


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

వరంగల్ | 15-07-2026 బుధవారం | సంపుటి : 11 | సంచిక : 28 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on






## ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ పనులకు

# ఒకేసారి గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి

**95 శాతం భూసేకరణ పూర్తి..**
**12 వరుసల రహదారితో 100 కిలోమీటర్ల దూరం కట్!**
**అటవీ శాఖ క్లియరెన్స్‌లపై కేంద్రం చొరవ**
**వ్యవసాయ, వ్యాపార రంగాలకు ఊతమిచ్చేలా రహదారి**
**ఏకకాలంలో 'ఆర్ఆర్ఆర్' ఉత్తర, దక్షిణ భాగాల పనులు**

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ, జూలై 14 (వుదయం) :** తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని పలు కీలక జాతీయ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి బుధవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీతో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ భేటీలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రహదారుల నెట్‌వర్క్ విస్తరణకు సంబంధించి పలు కీలక ప్రతిపాదనలను సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ముందుంచారు.

**ఏకకాలంలో 'ఆర్ఆర్ఆర్' పనులు**
రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. పనులు ప్రారంభించేందుకు వీలుగా కేంద్ర మంత్రిమండలి నుంచి తక్షణమే అనుమతులు ఇప్పించాలని కోరారు. ఉత్తర, దక్షిణ భాగాలు రెండింటికీ ఏకకాలంలో పనులు ప్రారంభిస్తే నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా, ప్రాజెక్టు త్వరగా అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. అలాగే ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులను కూడా వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.


**అమరావతి బందరు పోర్టుకు 12 వరుసల రహదారి**
ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో హామీ ఇచ్చిన విధంగా హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఇందులో భాగంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ' నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల (12 Lanes) భారీ రహదారిని మంజూరు చేయాలని ప్రతిపాదించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ విజయవాడల మధ్య దూరం దాదాపు 100 కిలోమీటర్లు తగ్గుతుందని, హైదరాబాద్ నుంచి బందరు పోర్టుకు సరుకు రవాణా ఎంతో వేగవంతం అవుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.


**మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్**
నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాల మీదుగా సాగే మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని రేవంత్ రెడ్డి కోరారు.

**రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా 6 వరుసల హైవే**
హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా.. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు సరికొత్త ఆరు వరుసల రహదారిని మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ నూతన రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా చేపడుతుందని గడ్కరీకి హామీ ఇచ్చారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి అందుబాటులోకి వస్తే తెలంగాణలో వ్యవసాయ, వ్యాపార రంగాలకు నూతన అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్

# గోయెంకాకు ప్రధాని నివాళి





**ముంబై :** ప్రముఖ దాత, నిగర్వి, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ సుభాష్ చంద్ర పితృవర్యులు శ్రీ నంద్ కిషోర్ గోయెంకా (96) కన్నుమూశారు. సోమవారం (జులై 13) ముంబైలోని తన నివాసంలో ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేశారు. ప్రముఖ సామాజికవేత్త అయిన నంద్ కిషోర్ గోయెంకా మరణం సమాజానికి తీరని లోటని ప్రధాని పేర్కొన్నారు. ఎస్సెల్ గ్రూప్ సాధించిన విజయాల వెనుక ఆయన ఒక నిశ్శబ్ద మార్గదర్శకుడిగా, స్ఫూర్తిదాతగా నిలిచారని దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సెల్ గ్రూప్ శ్రేణులు గుర్తుచేసుకున్నాయి.

**ఆర్ఎస్ఎస్ స్వయంసేవక్‌గా విశేష సేవలు ప్రధాని నివాళి:**
నంద్ కిషోర్ గోయెంకా మృతిపై ప్రధాని మోదీ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా నివాళులర్పించారు. "నంద్ కిషోర్ గోయెంకా జీవితం సమాజ సేవకు, వినయానికి, అంకితభావానికి ఒక గొప్ప నిదర్శనం. సామాజిక శ్రేయస్సుకు ఆయన చేసిన సేవలు, చూపిన విలువలు రాబోయే తరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయి" అని ప్రధాని కొనియాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్వయంసేవక్‌గా సమాజానికి, దేశానికి ఆయన చేసిన నిరుపమాన సేవలను ఈ సందర్భంగా ప్రధాని స్మరించుకున్నారు.

## వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను

# అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించండి

**న్యూఢిల్లీ, జూలై 14 (వుదయం) :** తెలంగాణలో వైమానిక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి బుధవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడితో ఆ శాఖ కార్యాలయంలో సమావేశమై రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు.

**ఉత్తర తెలంగాణకు వరంగల్ హబ్:**
ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు వరంగల్ కేంద్రంగా నిలుస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమల వల్ల వరంగల్ పారిశ్రామికంగా మరింత వేగంగా దూసుకుపోనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మామునూరు విమానాశ్రయంలో ఎంఆర్ఓ (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని కోరారు. భూసేకరణ పూర్తయినందున త్వరగా టెండర్లు పిలిచి, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్టును ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**కాకతీయ చరిత్ర ప్రతిబింబించేలా డిజైన్లు**
వరంగల్ విమానాశ్రయ నిర్మాణ నమూనాలపై చర్చ సందర్భంగా.. వరంగల్ చారిత్రక వైభవాన్ని చాటిచెప్పేలా, కాకతీయ శిల్పకళ, సంస్కృతికి అద్దం పట్టేలా ఎయిర్‌పోర్ట్ డిజైన్లు ఉండాలని సీఎం సూచించారు. ఇందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పూర్తి సానుకూలత వ్యక్తం చేశారు.



**ఆదిలాబాద్ లో పౌర విమానాశ్రయం**
ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని ఎయిర్‌పోర్టుతో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇందుకు అవసరమైన భూమిని సేకరించి రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేస్తామని స్పష్టం చేశారు. వరంగల్ తరహాలోనే ఆదిలాబాద్‌లోనూ ఎంఆర్ఓ, కార్గో సేవలతో పాటు రెండు విమానాశ్రయాల్లో విమాన శిక్షణ సంస్థలను (FTO) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

## యెమెన్ సరిహద్దుల్లో

# తీవ్ర ఉద్రిక్తత



**రియాద్ :** పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. గత నాలుగేళ్లుగా సౌదీ అరేబియా హూతీ తిరుగుబాటుదారుల మధ్య కొనసాగుతున్న అనధికారిక కాల్పుల విరమణకు తెరపడింది. ఇరు వర్గాల మధ్య ఒక్కసారిగా తీవ్రస్థాయిలో ఘర్షణలు చెలరేగాయి. సౌదీ అరేబియాలోని వ్యూహాత్మక అభా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని హూతీ తిరుగుబాటుదారులు క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో విరుచుకుపడ్డారు. ఈ ఆకస్మిక దాడితో గల్ఫ్ రీజియన్‌లో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పీక్ స్టేజ్‌కు చేరాయి.

**సనా రన్‌వేపై దాడే అసలు కారణం**
ఈ తాజా ఘర్షణల వెనుక యెమెన్ రాజధాని సనాలో జరిగిన ఓ కీలక ఘటన ఉంది. ఇరాన్ నుంచి హూతీ ప్రతినిధుల బృందంతో వస్తున్న ఒక విమానాన్ని ల్యాండ్ అవ్వకుండా అడ్డుకునేందుకు సౌదీ అరేబియా మద్దతున్న యెమెన్ ప్రభుత్వ దళాలు వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. అందులో భాగంగా సనా అంతర్జాతీయ విమానాశ్రయంలోని రన్‌వేపై ప్రభుత్వ దళాలు బాంబు దాడికి తెగబడ్డాయి. తమ ప్రతినిధుల విమానాన్ని లక్ష్యంగా చేసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హూతీలు.. దానికి ప్రతీకారంగానే సౌదీ భూభాగంలోని అభా ఎయిర్‌పోర్టుపై ఈ భారీ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది.

**పరోక్ష యుద్ధం (షాడో వార్)**
యెమెన్‌లో సౌదీ అరేబియా మద్దతు ఉన్న ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వారి ప్రభావం చాలా నామమాత్రంగానే ఉంది.

## కార్మికులకు రూ.54 వేల కోట్ల

# బకాయిలను చెల్లించాలి



**భూపాలపల్లి, జూలై 14 (వుదయం)**

సింగరేణి సంస్థ నష్టాల బారిన పడటానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ వైఖరే కారణమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర'లో భాగంగా ఆయన బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన కేంద్ర మంత్రి, ఉమ్మడి రాష్ట్రంలో మరియు స్వరాష్ట్రంలో సింగరేణి ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ నేతలు సింగరేణి సంస్థను, కార్మికుల శ్రమను దారుణంగా దోచుకున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. సంస్థ నిధులను పక్కదారి పట్టించి, సింగరేణిని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. కార్మికుల హక్కులను, వారి సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.

**రూ.54 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి**
ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేంద్ర మంత్రి తన విమర్శనాస్త్రాన్ని సంధించారు. సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల కష్టార్జితాన్ని సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు.




## పీవోకేలో నిరసనకారులపై

# పాక్ కాల్పులు

**కాల్పుల్లో ఆరుగురు మృతి**
**40 లక్షల మందికి ఇంటర్నెట్ కట్**
**ఆహారం, మందుల కొరతతో అల్లాడుతున్న పీవోకే**



**న్యూఢిల్లీ :** పాక్ ఆక్రమిత కశ్మీర్ లో పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా తిరుగుబాటు హింసాత్మకంగా మారింది. తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న నిరసనకారులపై పాక్ పోలీసులు, పారామిలిటరీ రేంజర్లు క్రూరంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ దమనకాండలో ఆరుగురు నిరసనకారులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. పాక్ ప్రభుత్వ అణచివేత చర్యలతో పీవోకే ప్రాంతం ప్రస్తుతం రణరంగంగా మారింది.

**40 లక్షల మంది గృహ నిర్బంధం - ఇంటర్నెట్ బ్లాకౌట్**
ఉద్యమాన్ని అణచివేసే వ్యూహంలో భాగంగా పాక్ ప్రభుత్వం కొంతకాలంగా పీవోకే అంతటా ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. దీనివల్ల దాదాపు 40 లక్షల మంది ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దారుణాలు బయటకు రాకుండా పాక్ సైన్యం కఠిన ఆంక్షలు విధించింది. ఈ సుదీర్ఘ దిగ్బంధనం కారణంగా స్థానిక ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదనను ఎదుర్కొంటున్నారు.






# స్వర్గీయ అశోక్ కుమార్ గౌడ్ 19 వ వర్ధంతి వేడుకలు

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 14....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు పెద్దగోని జిన్నారం స్వర్గీయ అశోక్ కుమార్ గౌడ్ 19వ వర్ధంతి వేడుకలు నేడు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వర్గీయ అశోక్ కుమార్ గౌడ్ సమాధిపై పూలమాలవేసి అశోక్ కుమార్ కుటుంబ సభ్యులు అభిమానులు నివాళులు అర్పించారు. అనంతరం స్వర్గీయ అశోక్ కుమార్ గౌడ్ అభిమానులు మాట్లాడుతూ . స్వర్గీయ అశోక్ కుమార్ గౌడ్ పేరా వారి సోదరులు పెద్ద గోని జిన్నారం శివకుమార్ గౌడ్, సూర్య కుమార్ గౌడ్. తమ సోదరుని వర్ధంతి వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తారని, అశోక్ కుమార్ గౌడ్ పేరా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద విద్యార్థులను చదివించడం, వారికి బుక్కులు, లాప్టాప్ లు, ఫీజులు, ఆర్థికంగా ఎన్నో సేవలు చేస్తున్నారని, నేడు స్వర్గీయ అశోక్ కుమార్ గౌడ్ 19వ వర్ధంతి వేడుకలు సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బిస్కెట్స్, పంపిణీ చేయడం జరిగింది. తన సోదరుని పేరు చేస్తున్న సేవలు వెలకట్టలేమని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మాజీ సర్పంచ్ స్వరాజ్య లక్ష్మి శ్రీనివాస్ గౌడ్. రాజం బిక్షపతి యాదవ్. గ్రామ సర్పంచ్ బ్యాగరీ నర్సయ్య. ఉప సర్పంచ్ వెంకటేష్. మురళి. ఆంజనేయులు యాదవ్. సత్యనారాయణ గౌడ్. గ్రామ యువకులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ మేళా 16న

**సంగారెడ్డి,వుదయం:**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-సేర్ప్ (ఈజీఎంఎం) ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత డీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించే ఈ మేళాలో Honour Lab Ltd కంపెనీ పాల్గొని 100 ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనుంది. B.Sc (కెమిస్ట్రీ), M.Sc (కెమిస్ట్రీ), B.Com, B.A, B.Pharmacy ఉత్తీర్ణులైన 21 నుంచి 28 ఏళ్ల యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి బొంతపల్లిలో విధులు ఉండగా, వార్షిక వేతనం రూ.2.76 లక్షల నుంచి రూ.2.80 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, అనుభవ ధ్రువపత్రాలు (ఉంటే), పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని అధికారులు సూచించారు.



# 9 ఏళ్ల సేవల అనంతరం బదిలీ ఎస్పీ సిసి బాలరాజు కు సత్కారం

- **ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ చేతుల మీదుగా సన్మానం, అప్రిసియేషన్ సర్టిఫికెట్ ప్రదానం**
- **కొత్త ఎస్పీ సిసిగా రాహుల్ బాధ్యతలు**

**నాగర్ కర్నూల్ ,జూలై 14 (వుదయం ప్రతినిధి):**

జిల్లా ఎస్పీ కార్యాలయంలో గత 9 సంవత్సరాలుగా ఎస్పీ సిసిగా విశేష సేవలు అందించిన బాలరాజు బదిలీపై మహబూబ్‌నగర్‌కు వెళ్లారు.బాలరాజు సేవలకు గుర్తింపుగా జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి పాటిల్ మంగళవారం ఆయనను శాలువాతో సత్కరించారు. అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందజేసి ఆయన కృషిని కొనియాడారు. పోలీసు శాఖలో నిబద్ధతతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తెచ్చినందుకు అభినందించారు. భవిష్యత్‌లోనూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఖాళీ అయిన ఎస్పీ సిసి పోస్టును ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాహుల్ తో భర్తీ చేసినట్లు ఎస్పీ ప్రకటించారు. రాహుల్ కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి శాఖకు మరింత సేవ చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఏఓ కృష్ణయ్య తో పాటు ఎస్పీ కార్యాలయ సిబ్బంది అందరూ బాలరాజును అభినందించి, రాహుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం

**నారాయణపేట టౌన్, జూలై 14(వుదయం ప్రతినిధి):**



ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ నెల 15న బుధవారం నాడు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించారు.ప్రజలు తమ ఫిర్యాదులు, సమస్యలు, సూచనలు అభ్యంతరాలను ఎస్పీ కార్యాలయ ఫోన్ నంబర్ 08506281182కు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు కాల్ చేసి నేరుగా జిల్లా ఎస్పీకి తెలియజేయవచ్చని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ స్వయంగా ప్రజలతో మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులకు తక్షణ పరిష్కారానికి అవసరమైన ఆదేశాలు జారీ చేస్తారని తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కు హాజరు కానీ వారికి తుది అవకాశం

- **జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద**

**గద్వాల, జూలై 14 (వుదయం కరస్పాండెంట్):**

జిల్లాలో అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు తుది అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ గద్వాల్, మనోపాడు, మల్దకల్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ టీచర్, అంగన్వాడీ హెల్పర్ పోస్టుల నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులు 16.07.2026,17.07.2026 తేదీలలో సంబంధిత సీడీపీఓ కార్యాలయాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని ఒరిజినల్ ధృవపత్రాలతో పాటు వాటి అటెస్టెడ్ జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత తేదీలలో హాజరు కాని అభ్యర్థులను గైర్హాజరు / అనర్హులుగా పరిగణించి, వారి దరఖాస్తులను తదుపరి ఎంపిక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోబడవని పేర్కొన్నారు. అందువల్ల సంబంధిత అభ్యర్థులందరూ ఈ తుది అవకాశాన్ని వినియోగించుకుని, నిర్ణీత తేదీలలో సంబంధిత సీడీపీఓ కార్యాలయాలకు హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

# హామీలకే పరిమితమైన కోహీర్ బడంపేట్ రోడ్డు పనులు

- **ప్రారంభించాలని ప్రసాద్ రెడ్డి డిమాండ్**
- **నెరవేరని హామీ పట్టించుకోని నాయకులు**

**కోహీర్, జులై 14 (వుదయం ప్రతినిధి ):**

కోహీర్ మండలం నుంచి బడంపెట్ వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ, పాలకులు మాత్రం కేవలం హామీలకే పరిమితమయ్యారని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సజ్జపూర్ నివాసి ప్రసాద్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మాట తప్పిన నాయకులు. గతంలో ఖానాపూర్ మరియు కొత్తూరు గ్రామాలలో జరిగిన సభలలో గౌరవ జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ డాక్టర్ ఎ. చంద్రశేఖర్ ఈ రోడ్డు నిర్మాణాన్ని త్వరలోనే చేపడతామని అనేకసార్లు ప్రజల సమక్షంలో స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. నాయకులు మాట ఇచ్చి నెలలు గడుస్తున్నా, నేటికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవడంపై స్థానిక ప్రజల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోందని అన్నారు.

ఈ రహదారి గుంతలమయంగా మారి, ప్రతిరోజూ వాహనదారులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని, తక్షణమే ఉన్నతాధికారులు మరియు డాక్టర్ ఎ. చంద్రశేఖర్ స్పందించి రోడ్డు పనులను మంజూరు చేయించాలని ఆయన సవినయంగా విజ్ఞప్తి చేశారు.రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల ఈ మార్గంలో ప్రయాణించే ప్రభుత్వ రవాణా సంస్థ (TSRTC)



బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. గుంతల కారణంగా బస్సుల రాకపోకలు ఆలస్యమై నిత్యం ప్రయాణికులు గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. రహదారుల భవనాల శాఖ (R&B) అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు (ప్యాచ్ వర్క్స్) కూడా చేయకపోవడం వల్ల నిత్యం ఈ దారిలో చిన్న చిన్న ప్రమాదాలు జరిగి వాహనదారులు తీవ్ర గాయాలపాలవుతున్నారు.

ఈ ప్రాంతం నుండి కోహీర్, జహీరాబాద్ వెళ్లే పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు.

రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో గర్భిణీలు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగులను ఆసుపత్రికి తరలించే '108' అంబులెన్స్ సేవలు కూడా సకాలంలో అందడం లేదు. సకాలంలో వైద్యం అందక ప్రాణాపాయ స్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

కాబట్టి, ఖానాపూర్, కొత్తూరు మీటింగుల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ కోహీర్‌బడంపెట్ రోడ్డును యుద్ధప్రాతిపదికన నిర్మించి ఇక్కడి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.

# తప్పులు దిద్ది దారిలో పెట్టే దేవుడు

- **షిరిడి సాయిబాబానే.....**
- **శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 14.....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీ గురు పీఠంలో భారతదేశంలోనే ఎక్కడ లేని విధంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గురు పీఠం లో కొలువుదీరిన శిరిడి సాయిబాబా గురించి. శ్రీకృ పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇలా వివరించారు.రూపాలు వేరైనా భగవంతుని స్వరూపం ఒక్కటే! శ్రీ సాయి తనకే కాదు ఇతర దేవతలకు భక్తులు పూజలు సరిగా చేయకుంటే, ఆ విషయాన్ని చెప్పి సరిదిద్దేవారు. ఈ విధంగా బాబా తన భగవదవతారంలోని సర్వజ్ఞతను పలు సందర్భాలలో చాటేవారు. భగవంతరావు క్షీరసాగర్ తండ్రి పండరిపురం విఠలునికి గొప్ప భక్తుడు. ప్రతి ఏటా పండరి పురానికి విఠలుని దర్శనం కోసం వెళ్ళేవాడు. ఇంటి వద్ద విఠలుని ప్రతిమనుప్రతిష్ఠించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసేవాడు. కొన్నాళ్లకు అతను మరణించాడు..తండ్రి మరణానంతరం అతని కొడుకు భగవంతరావు క్షీరసాగర్ విఠలుని పూజను, పండరి పురం యాత్రను నిర్లక్ష్యం చేశాడు. భగవంతరావు ఒకసారి షిరిడీకి వచ్చాడు. బాబా దర్శనం చేసుకున్నాడు. బాబా సర్వాంత ర్యామి కదా! భగవంతరావు తండ్రి విఠలునికి పూజ చేయడం, అతని భక్తి శ్రద్ధలు కళ్లలో మెది లాయి. వెంటనే భగవంతరావు వైపు తీక్షణంగా చూస్తూవీడి తండ్రి నా స్నేహితుడు, అందుకే వీడిని నేనిక్కడకు లాక్కొచ్చాను. వీడెప్పుడూ కనీసం నైవేద్యం కూడా పెట్టి ఎరుగడు. నన్ను,





విఠలుడ్ని కూడా ఆకలితో మాడ్చాడు. వీడు చేస్తున్నది తప్పని చెప్పి చీవాట్లు పెట్టి, తిరిగి విఠలుని పూజ ప్రారంభించమని తెలియచెప్పడానికే వీడ్ని షిరిడీకి రప్పించాను" అన్నారు. భగవంతరావు సిగ్గుతో తలదించుకున్నాడు. బాబా ఉపదేశంతో అతని కళ్లు తెరుచుకున్నాయి. మరెప్పుడూ విఠలుని పూజను నిర్లక్ష్యం చేయలేదు. బాబా సేవను మరువలేమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సూర్య కుమార్ గౌడ్. రాజం బిక్షపతి యాదవ్. స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్. భక్తులు పాల్గొన్నారు.

# కన్నవారు వద్దన్నారు.. పోస్టుమార్టంకు వైద్యులు కాదన్నారు

- **చివరికి నరహంతకుడికి అనాథశవంలా అంత్యక్రియలు**

**వికారాబాద్, జూలై 14 (వుదయం బ్యూరో):**



తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసిన షాబాద్ ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ ముగింపు అత్యంత హృదయ విదారకంగా ముగిసింది. జీవించి ఉన్నప్పుడు ఆరుగురి ప్రాణాలు తీసి క్రూరత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆ నరహంతకుడికి మరణానంతరం కనీసం కన్నవారి చేతుల మీదుగా అంతిమ సంస్కారాలు కూడా నోచుకోలేదు. బతికినంత కాలం రాక్షసత్వంతో ఊగిపోయిన రాజ్‌కుమార్.. చివరకు ఒక అనాథ శవంగా మట్టిలో కలిసిపోయాడు.

**మృతదేహాన్ని ఛీత్కరించుకున్న కన్నవారు**

పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన రాజ్‌కుమార్ శవపరీక్ష ముగిసిన తర్వాత.. పోలీసులు ఆ మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ కన్న హృదయాలు, రక్తసంబంధీకులు అతడు చేసిన పాపాలను భరించలేకపోయారు. మృతదేహాన్ని స్వీకరించేందుకు అతని తల్లిదండ్రులు, సోదరుడు తీవ్రంగా నిరాకరించారు. అంబులెన్స్‌లో ఉన్న రాజ్‌కుమార్ శవాన్ని చూసి కూడా వారు కన్నీరు కార్చకుండానే వెనుదిరిగి వెళ్లిపోయిన తీరు అక్కడున్న వారిని సైతం కలచివేసింది. రక్తసంబంధమే ఛీత్కరించుకున్న వేళ.. ఆ శవం దిక్కులేనిదై నిలబడింది.

**పోస్టుమార్టం వద్దంటూ వైద్యుల వెనకడుగు**

అంతకుముందు రాజ్‌కుమార్ మృతదేహం పోస్టుమార్టం ప్రక్రియలోనూ అనూహ్య నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చేవేళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించాల్సి ఉండగా.. ఆరుగురిని బలిగొన్న నిందితుడి మృతదేహాన్ని ముట్టుకోవడానికి కూడా డ్యూటీలో ఉన్న వైద్యురాలు నిరాకరించారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు ప్రక్రియ స్తంభించిపోయింది. చివరికి పోలీసులు వికారాబాద్ జిల్లా ఆసుపత్రి వైద్యుల కోసం ప్రయత్నించి.. చివరకు చేవెళ్ల ఆసుపత్రికి చెందిన డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డాక్టర్ ప్రణీత్‌లను ప్రత్యేకంగా పిలిపించి రాత్రి పూట శవపరీక్ష పూర్తి చేయించారు.

**బంధువులు లేరు.. బాంధవ్యాలు లేవు..**

కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అస్సలు తీసుకోబోమని తేల్చి చెప్పడంతో పోలీసులే ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాల్సి వచ్చింది. చేవెళ్ల మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతో స్థానిక శ్మశాన వాటికలో రాజ్‌కుమార్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. కనీసం కడసారి చూపు చూసేందుకు బంధువు గానీ.. గుక్కెడు నీళ్లు పోసేందుకు స్నేహితుడు గానీ లేడు. కేవలం ప్రభుత్వ అధికార యంత్రాంగం సమక్షంలో ఒక అనాథ శవంలా రాజ్‌కుమార్ అంతిమ సంస్కారాలు ముగిశాయి

ఒకప్పుడు నిండు కుటుంబంతో సంతోషంగా ఉన్న వ్యక్తి కేవలం తన క్రూరమైన ఆలోచనలు, నిర్ణయాల వల్ల సమాజానికే కాకుండా సొంత కుటుంబానికి కూడా శాశ్వతంగా దూరమయ్యాడు. రాజ్‌కుమార్ చేసిన అమానుష హత్యలు ఎన్నో కుటుంబాలలో తీరని చీకట్లను నింపగా.. చివరకు అతడి ముగింపు కూడా అంతే చీకటిగా ఒంటరిగా ముగిసింది. జీవితంలో మనం తీసుకునే నిర్ణయాలు, చేసే పనులే మన అంతిమ ప్రయాణాన్ని నిర్ణయిస్తాయని చెప్పడానికి ఈ ఘటనే ఒక సజీవ సాక్ష్యం.

# పెట్టుబడి దారి సమాజాన్ని మార్చాలి ఎస్ ఎల్ పద్మ

**నారాయణపేట టౌన్, జూలై 14(వుదయం ప్రతినిధి):**

నేడు కొనసాగుతున్న పెట్టుబడి దారి సమాజాన్ని మార్చాలని సమసమాజ స్థాపన కోసం కృషి చేయాలని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎస్ఎల్ పద్మ పిలుపునిచ్చారు. సోమవారం నారాయణ పేట భగత్ సింగ్ భవన్లో జరిగిన మాస్ లైన్ పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై మార్క్సిస్ట్ రాజకీయ అర్థశాస్త్రం అనే అంశాన్ని బోధించారు. ఈ క్లాసులో భాగంగా బోధిస్తు కొనసాగుతున్నటువంటి ఆర్థిక శాస్త్ర సూత్రాలు పెట్టుబడిదారి సమాజం కోసం పనిచేస్తున్నాయనీ, అలా కాకుండా శ్రామిక వర్గం , మనుషులంతా సమానంగా ఉండే వ్యవస్థ కోసం పనిచేసే మార్క్సిస్టు అర్థశాస్త్రాన్ని తీసుకురావాలని అందుకోసం ప్రతి వ్యక్తి కృషిచేయాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు నేడు ప్రకృతి సహజ సిద్ధంగా దొరికే భూమి, నీరు, గాలి ఇలాంటి అన్నింటిపై పట్టు సాధించి వాటిని సాకుగా మార్చి స్వలాభం కోసం అమ్ముతున్నారు. ఇదే సరిఅయిన పద్ధతని చెపుతా, కార్మికుల శ్రమను దోచి కుబేరులుగా ఎదుగుతున్నారు. కానీ ఇరవై నాలుగు గంటలు శ్రమ చేసే కార్మికులకు అరకొర వేతనాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. శ్రమని దోచుకోవడమే హక్కు భావిస్తు ప్రశ్నించిన వారిపై నిర్బంధం విడిస్తున్నారు. ఇది ముమ్మాటికి తప్పని శ్రామికుల శ్రమపై పెట్టుబడిదారులు ప్రపంచ కుబేరులుగా ఎదుగుతున్నారని అన్నారు. వారి సంపాదనంత కార్మికుల శ్రమినని దానిని మనం మర్చిపోరాదని అన్నారు. కావున మనం ఆ సంపదను ఆక్రమించుకోవడానికి ప్రజలను నిరంతరం చైతన్యవంతం చేస్తూ పెద్ద పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఇచ్చారు. ప్రారంభోపన్యాసం ఈ క్లాసులను పార్టీ సీనియర్ నాయకులు టి



పి టి ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ ప్రారంభిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతం కావాలనీ, నేడు మతాన్ని దేవుడిని ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చిన బిజెపి అదే దేవుడి హుండిని కొళ్లగొడుతున్నది అన్నారు. దేశ సంపదను, ఆర్థిక వనరులను ప్రభుత్వ సంస్థలను ఆదాని, అంబానీ లాంటి పెట్టుబడుదారులకు కట్టబెడుతూ, ప్రజలకు నిత్యాసర సరుకులు, పరితమైన ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నది దీనిని మనం అర్థం చేసుకొని నిత్యం ప్రజలను చైతన్యవంతం చేస్తూ సమసమాజం కోసం పోరాడాలన్నారు.ఈ క్లాసులలో మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం. కృష్ణ, నారాయణ పేట్ జిల్లా కార్యదర్శి బి.రాము, జిల్లా నాయకులు సలీం , కె.కాశీనాథ్, బోయిన్ పల్లి రాము, యాదగిరి , రామకృష్ణ, బి. నర్సింహా, కొండా నరసింహులు, చెన్నారెడ్డి , భగవంతు, కెంచి నారాయణ తదితరులు పాల్గొన్నారు. క్లాసులకు ముందు పార్టీ జండాను పార్టీ జిల్లా కార్యదర్శి బి రాము ఆవిష్కరణ చేశారు.

# మంత్రి' సభలో జనసమీకరణ దోపిడీ!

- **కూలీ ఇస్తామని పిలిచి.. కూరలో కరివేపాకులా తీసిపారేశారు!**
- **కాసుల' పంపిణీలో అధికార పక్షం కక్కుర్తి.. రచ్చకెక్కిన బాగోతం!**
- **ఓట్లేమో అందరివి.. నోట్లేమో కొందరికా? ధరూర్ మండలంలో మహిళల తిరుగుబాటు!**

**ధరూర్, జూలై 13 (వుదయం బ్యూరో)**

అధికార దాహం.. సభల జాతర.. సక్సెస్ కోసం ఆరాటం! కానీ తీరా చూస్తే పేద మహిళల శ్రమను దోచుకున్న నయవంచన! జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి పర్యటన సందర్భంగా అధికార పార్టీ నేతలు ఆడిన కపట నాటకం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. **తలసరి 'ధర' కట్టారు.. తీరా చూస్తే దగా చేశారు!**

దాదాపు 126 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనుల శంకుస్థాపన సభను గ్రాండ్‌గా చూపించుకోవడానికి స్థానిక అధికార గణం రోజుల తరబడి స్కెచ్ వేసింది. కూలి పనులకు వెళ్లే పేద మహిళలకు 'సభకు వస్తే గిట్టుబాటు డబ్బులు ఇస్తాం' అని ఎర వేశారు. నేతల మాటలు నమ్మి, పొట్టకూటి పనులను మానుకుని, మండే ఎండను సైతం లెక్కచేయకుండా వివిధ గ్రామాల నుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చారు. కానీ సభ ముగిశాక అసలు రంగు బయటపడింది. తమ అనుకూల వర్గాలకు, కొన్ని నిర్దేశిత గ్రామాలకు మాత్రమే గుట్టుచప్పుడు కాకుండా నజరానాలు అందజేసి, మిగిలిన వందలాది మంది మహిళలను నట్టేట ముంచారు.

**'నమ్మించి గొంతు కోశారు'.. గ్రామాల్లో మిన్నంటిన ఆక్రోశం!**

ఒకే ఎండలో..ఒకే వేదిక ముందు గంటల తరబడి కూర్చున్న తమలో ఈ వర్గభేదం ఏంటని బాధితులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. "మా ఓట్లతో గెలిచి, మా శ్రమతో సభలు సక్సెస్ చేసుకుని, మాకే మొండిచేయి చూపుతారా?" అంటూ మహిళలు రోడ్డెక్కుతున్నారు. ప్రస్తుతం ధరూర్ మండలంలోని గ్రామగ్రామాన ఈ 'దగా'పైనే చర్చ సాగుతోంది. స్థానిక నేతల నయవంచనపై బాధితులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. తమకు న్యాయం జరగకపోతే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

**నిమ్మకు నీరెత్తిన అధికారులు.. సమాధానం చెప్పని నేతలు!**

పేద మహిళల ఆత్మగౌరవాన్ని బజారున పడేసిన ఈ దారుణ వ్యవహారంపై అటు అధికారుల్లో గానీ, ఇటు అధికార పార్టీ



ప్రజాప్రతినిధుల్లో గానీ కనీస చలనం లేకపోవడం గమనార్హం. జనం ఛీత్కరిస్తున్నా, బాధితులు లబోదిబోమంటున్నా కనీసం సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ఈ వ్యవహారం వెనుక ఉన్న దళారులు, బాధ్యులైన నిర్వాహకులపై చర్యలు తీసుకుని, తమకు రావాల్సిన సొమ్మును అందజేయాలని బాధితులు నిలదీస్తున్నారు.

# భగలాముఖి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 14....**



శ్రీబగలాముఖి శక్తిపీఠం, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా శివ్వంపేటలో నెలకొన్న శ్రీ భగలాముఖి శక్తిపీఠం . హిందూధర్మంలో కాళికాదేవి దశమహావిద్యలలో బగలాముఖి అవతారం ఒకటి. బగలాముఖి దేవి తన దుడ్డు కర్రతో భక్తుల దురభిప్రాయాలు, భ్రమలు దూరం చేస్తుంది. అమ్మవారిని ఉత్తర భారతదేశంలో పీతాంబరీ దేవిగా కొలుస్తారు. పసుపు వర్ణంతో ప్రకాశించే బగలాముఖి అమ్మవారు స్తంభన దేవతగా ప్రసిద్ధి చెందింది.ఈ మహాదేవికి వైశాఖమాస శుక్లపక్ష అష్టమీ తిథి ప్రీతిపాత్రమైనది. ఈ దేవతా ఉపాసన వల్ల సాధకుడికి శత్రువుల వాక్శని స్తంభింపచేసే శక్తి లభిస్తుంది. ముఖ్యంగా కోర్టు వ్యవహారాల్లో, వాదప్రతివాద విషయాల్లో ఎదుటిపక్షం వారి మాటల్ని స్థంభింపచేసి వ్యవహార విజయాన్ని సాధకులకు ప్రసాదిస్తుంది. ఈ ప్రత్యేక పూజలు బగలాముఖి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ మహర్షి పండితులు శాస్త్ర వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవరణము. అర్చన. హరిదార్చిన . నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అమ్మవారి దర్శించుకున్న భక్తులకు స్థలదాత పబ్బ స్వరూప రమేష్ గుప్తా. ప్రముఖ సంఘ సేవకులు మాజీ జెడ్పిటిసి స్వాతి మహేష్‌గుప్తాలు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా. జోగిపేట వాస్తవ్యులు బిక్షపతి దంపతులు నేడు అన్న ప్రసాద్ విత్ అన్న కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఇంతటి సౌకర్యాన్ని కల్పించిన స్థలదాతకు . అన్నదాతకు. కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ లక్ష్మీ నరసయ్య. పోచ గౌడ్. కొండల్. పండితులు. నలుమూలల నుండి విచ్చేసిన భక్తులు. తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ లో ఉన్న కరెంట్ బిల్లులు కట్టలేము

- **అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్ లు.....**
- **ఎంపీడీవో కు రిప్రాంటేషన్ అందచేత.....**

**వుదయం న్యూస్ శివ్వంపేట జులై 14....**

ప్రభుత్వం పెండింగ్లో కరెంట్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో. గ్రామపంచాయతీలో ఉన్న ఇబ్బందుల గురించి మేము అందరం కలసి తెలియజేయడం జరిగింది. మేము గెలిచిన గత ఆరు నెలల నుండి సెక్రెటరీలు చేసిన బిల్లులు మరియు పాత సర్పంచ్లు చేసిన పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడానికి సరిపోయింది ఇప్పుడు మేము కరెంటు బిల్లులు చెల్లిస్తే గ్రామంలో కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితిలో ఉంటాము అని ఎంపీడీవో కు. ఎంపీ ఓ తిరుపతిరెడ్డికి. తెలియజేస్తూ ప్రభుత్వం ప్రతి ఇంటికి ఫ్రీ కరెంట్ ఇచ్చినట్టే గ్రామపంచాయతి లకు ఫ్రీ కరెంట్ ఇవ్వాలని చెప్పడం జరిగింది అని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు రాజపేట వెంకటేశం. మోకాల నవీన్ .గైనభేటి ప్రవీణ్ . కుమ్మరి హైమావతి ఆంజనేయులు .దొంతి రెడ్డి అరుణ .ఆకు కొముర‌య్య . మ్యానము . గుణంగారి రాజు .తేజస్విని రాజేందర్ .నారాయణరావు . బ్యాగరి నరసయ్య . బానోత్ వినోద్ .బానోత్ కవిత రమేష్ . తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం

- **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కౌన్సిలర్ ఎం.ఏ. కలీమ్`**

**కోహీర్, జూలై 14 (వుదయం ప్రతినిధి ):**



ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష (SIR) కార్యక్రమంలో ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, లేనిపక్షంలో తమ అమూల్యమైన ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని కోహీర్ మున్సిపాలిటీ 11వ వార్డు బిఆర్ఎస్ (BRS) పార్టీ కౌన్సిలర్ ఎం.ఏ. కలీమ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... ఈ ముఖ్యమైన కార్యక్రమానికి ఇప్పుడు కేవలం 16 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, కాబట్టి ప్రజలు ఈ పరిమిత సమయాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 31లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.వారు ప్రజలకు పలు సూచనలు చేసారు జూలై 31తుది గడువు కంటే ముందే తమ ఎన్యూమరేషన్ (గణన) ఫారమ్‌లను పూర్తిగా భర్తీ చేయాలి.

ఫారమ్‌ను పూర్తి చేసిన తర్వాత వెంటనే తమ సంబంధిత ప్రాంత బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) ని సంప్రదించి, దానిని ఆన్‌లైన్ చేయించాలి. కౌన్సిలర్ ఎం.ఏ. కలీమ్ కోహీర్ మున్సిపాలిటీలోని వివిధ పోలింగ్ బూత్‌లను సందర్శించి, అక్కడ ఉన్న ప్రజలకు ఫారమ్‌లను సరైన పద్ధతిలో ఎలా పూరించాలో వివరించారు. ఫారమ్ పూరించడంలో చిన్నపాటి నిర్లక్ష్యం లేదా పొరపాటు జరిగినా నష్టం వాటిల్లుతుందని ఆయన ప్రజలను హెచ్చరించారు. అర్హులైన ఓటర్లందరూ తమ వివరాలను పూర్తిగా తనిఖీ చేసుకుని, అవసరమైన సవరణలు (పేరు, వయస్సు లేదా చిరునామా మార్పులు) చేసుకుని, వీలైనంత త్వరగా ఫారమ్‌ను బీఎల్ఓ వద్ద సమర్పించాలని కోరారు. తమ ప్రజాస్వామ్య హక్కును కాపాడుకోవడానికి ఓటర్లందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, తమ ఓటును సురక్షితం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు

# తిమ్మాపూర్ లో త్రాగు నీరు కష్టాలు!

**ఎల్కతుర్తి, జులై 14 (వుదయం ప్రతినిధి) :**

ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో త్రాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గ్రామంలో వాటర్ ప్లాంట్ ను గ్రామంలో గతంలో దొరగా కొనసాగిన వ్యక్తి కుటుంబ సభ్యులు నిర్మించి గ్రామానికి బహుమతిగా ఇచ్చినప్పటికీ దానిని గ్రామపంచాయతీ స్వాధీనపరచుకోకపోవడం వాటర్ ప్లాంట్ ప్రవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండటం వల్ల నిత్యం వాటర్ ప్లాంట్ మరమ్మత్తుల పేరుతో రోజుల తరబడి ప్లాంట్ పనిచేయకపోవడంతో త్రాగు నీటి కోసం గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పక్క గ్రామమైన కేశవాపూర్ నుండి తాగునీరు కొనుక్కొని త్రాగవలసిన పరిస్థితి ఏర్పడింది. వాటర్ ప్లాంట్ పాడవుతున్న నీటి కోసం ఇంత ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్న ఎవరిని ప్రశ్నించాలో అర్థం కాని గందరగోళంలో గ్రామ ప్రజలు ఉన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని నిలదీద్దాం అంటే వాటర్ ప్లాంట్ గ్రామపంచాయతీ ఆధీనంలో లేదు. ప్రైవేటు వ్యక్తులను నిలదీసే పరిస్థితి లేదు . ఇలాంటి పరిస్థితుల్లో ఏమి చేయలేక త్రాగునీటి కోసం అవస్థలు అనుభవించవలసిన పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో వాటర్ ప్లాంట్ కొనసాగుతున్న వాటి లాభనష్టాలు ఇవి కూడా గ్రామ ప్రజలకు తెలియవు. ప్రవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న వాటర్ ప్లాంట్ నిర్వహణలో కెమికల్ ఎక్కువగా కలిసిన తక్కువగా కలిసిన ప్రజలకేదన్న ఆరోగ్య సమస్యలు ఎదురైతే ఎవరు బాధ్యత వహిస్తారని ఈ సందర్భంగా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ ప్లాంట్ ను వెంటనే గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకొని గ్రామ ప్రజలకు త్రాగునీరు ఇబ్బందులు రాకుండా అందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి



**- చేవెళ్ల ఏబీవీపీ కళాశాలల బంద్ విజయవంతం**

**చేవెళ్ల జులై 14 (వుదయం)**

ఏబీవీపీ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు చేవెళ్ల మున్సిపాలిటీ లోని అన్ని కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ...ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.స్కాలర్‌షిప్ ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదు.. విద్యార్థుల హక్కు అని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శివ,లోకేష్ జైపాల్, మల్లేష్, వివేకానంద, కార్తీక్, యశ్వంత్, మణి, నాని, సన్నీ, ఫెరోద్‌తో పాటు ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షపు నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



**- చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో 'క్యాచ్ ద రైన్' కార్యక్రమం – పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ**

**చేవెళ్ల,జూలై14(వుదయం)**

చేవెళ్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం "క్యాచ్ ద రైన్" కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వర్షపు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.మునిసిపల్ కమిషనర్ బి.యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వర్షపు నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాల్లోకి మళ్లించడం వల్ల నీటి కొరతను అధిగమించవచ్చని అధికారులు బ్యానర్ల ద్వారా విద్యార్థులకు వివరించారు.భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటు వర్షపు నీటి సంరక్షణకు కట్టుబడి ఉండాలని విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాములు గౌడ్, 14వ వార్డ్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, మేనేజర్ ఉమేందర్ సింగ్, ఏఈ సాహితీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ఎస్ఐఆర్ డిజిటల్ సర్వే




**- రెండు పడక గదుల ఇళ్లలో మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి**
**- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి**
**- అధికారుల జూమ్ కాన్ఫరెన్స్ సమీక్షలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట, జూలై 14 (వుదయం బ్యూరో)**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ అధికారులతో ఆమె జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి సేకరించిన ఎస్ఐఆర్ ఫారాలను వెంటనే డిజిటలైజేషన్ చేయాలి. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, వార్డు నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి.మున్సిపాలిటీల్లో అత్యధిక ఓటర్లు ఉన్నందున పట్టణ ప్రాంతాల్లో ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకూడదు. ఎవరికీ రెండు చోట్ల ఓట్లు లేకుండా జాగ్రత్త వహించాలి. జిల్లాలో ఇప్పటికే లబ్ధిదారులకు అందించిన రెండు పడక గదుల ఇళ్లలో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలి. జిల్లాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగంగా పూర్తి చేసేలా గృహ నిర్మాణ శాఖ ఏఈలు తగిన చర్యలు తీసుకోవాలి.

## మృతుని కుటుంబాన్ని పరామర్శ

**- బిజెపి రాష్ట్ర నేత తల్లోజు ఆచారి**

**వెల్దండ**

**వుదయం ప్రతినిధి జూలై 14:**



మండల కేంద్రానికి చెందిన బయ్య జగదీష్ గుండెపోటుతో అకస్మాత్తుగా మృతిచెందిన విషయాన్ని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కురుమిద్ద యాదగిరి ద్వారా విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో కోట్ర మాజీ సర్పంచ్ బాలస్వామి వెల్దండ మాజీ ఎంపీటీసీ జంగయ్య సింగల్ విండో వైస్ ఛైర్మన్ రాజేందర్ రెడ్డి యాదవ్ శ్రీనివాస్ చారి రాజు తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

**హైదరాబాద్**

**వుదయం ప్రతినిధి జూలై 14:**

తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, వివిధ పత్రికలు, చానళ్ళల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదించుకోలేక పోతున్నారని అన్నారు.జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతునలను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల



పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటాజర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచెం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

## ఈనెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి




**నారాయణపేట టౌన్**

**జూలై 14(వుదయం ప్రతినిధి)**

18 జూలై , 21 నవంబర్ 2026 నా నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ కేసులకు శాశ్వత పరిష్కారం ద్వారా ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని లీగల్ సర్వీసెస్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాలనుసారం లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్,సీనియర్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిస్ సీనియర్ జూనియర్ న్యాయవాదులు బ్యాంకు ఆఫీసర్స్ తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ ఆదేశాల మేరకు, ప్రత్యేక లోక్ అదాలత్ నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద కేసుల కోసం ప్రత్యేకంగా ఒక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తోంది అన్నారు. 18 జూలై 2026 జూలై 3వ శనివారం, 21 నవంబర్ 2026 నవంబర్ 3వ తేదీ శనివారం నాడు ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.ప్రత్యేక లోక్ అదాలత్ ను అనగా నెగోషియబుల్ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ న్యాయమూర్తి జిల్లాలోని అన్ని స్టేక్ హోల్డర్లు అంటే బ్యాంకులు, ఆర్థిక సంస్థల బ్రాంచ్ తీసుకోవాలని ఆర్థిక సంస్థల బ్రాంచ్ మేనేజర్లు ఆదేశించారు. పట్టణంలోని ప్రముఖ ప్రదేశాలలో హోర్డింగ్‌లు, బ్యానలతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలిపారు.ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయుటకు గాను వివిధ తేదీలలో న్యాయమూర్తులతో, పోలీసు అధికారులతో, ఇన్సూరెన్స్ అధికారుల తోనూ, న్యాయవాదుల తోనూ, బ్యాంకు, చిట్ ఫండ్ మేనేజర్లతో, కోర్టు కానిస్టేబుల్స్ తో వేరు వేరు సమావేశాలు ఏర్పాటు చేసి, చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించి, కక్షిదారులకు లోక్ అదాలత్ వలన కలిగే మేలును మీ వంతుగా, మీ శైలిలో తెలపాలని ఈ సందర్భంగా లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ కోరారు. రాజీ పడదగు కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోనెల విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాజీపడదగు 152 పెండింగ్ ఉన్న నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం చెక్కు బౌన్స్ కేసులను గుర్తించి కేసులను పరిష్కరించుటకు తగినన్ని ఏర్పాటు చేసి, కక్షిదారుల సమయం వృథా కాకుండా, ఎటువంటి నిరుత్సాహానికి గురికాకుండా, వీలైనంత త్వరలో కేసు పరిష్కరించబడేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో ప్రతీ ఒక్కరు తమవంతుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి సలహాలకైనా, సందేహాలకైనా, ఏదేని న్యాయ సహాయం కోసమైనా న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు. లోక్ అదాలత్ పట్ల మరింత సమాచారం కోసం 15100 నంబర్ కు కాల్ చేసి, సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, సీనియర్ సివిల్ జడ్జి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ , సీనియర్, జూనియర్ న్యాయవాదులు బ్యాంకు ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు



**- సీఎం వ్యాఖ్యలపై మండిపడ్డ కోదాడ మండల బీఆర్ఎస్ నాయకులు**
**– రైతులకు సి ఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్**

**కోదాడ**

**జూలై 14(వుదయం)**

రైతులకు సాగునీరు ఇవ్వాలని కోరితే "రక్తం పారిస్తాం" అనే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కోదాడ మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం స్థానిక కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా రైతాంగ సమస్యలు, సాగునీటి సరఫరాపై ప్రశ్నించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా, హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమన్నారు. అన్నదాతలను ఆదుకోవాల్సిన ముఖ్యమంత్రి వారిని భయభ్రాంతులకు గురిచేసే విధంగా మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.రైతుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రిపై తక్షణమే చట్టపరంగా కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అలాగే రైతులకు ముఖ్యమంత్రి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాపుగల్లు గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు ,గణపవరం మాజీ సర్పంచ్ పొట్ట శ్రీ విజయకిరణ్, దొరకుంట మాజీ సొసైటీ చైర్మన్ ముత్తవరపు రమేష్, నాయకులు జిల్లా బోస్, వీరారెడ్డి, కంబాల జగ్గయ్య, పిచ్చిరెడ్డి, కొండల్, బాడిషా నాగేశ్వర రావు, శ్రీను, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అరణ్యేశ్వర ఆలయానికి దాతల 'పళ్లేల' విరాళం!



*** అన్నదాన సేవకు అండగా కోతులగిద్ద భక్తులు**
*** దేవాలయ కమిటీకి 70 స్టీల్ ప్లేట్ల అందజేత**

**ధరూర్**

**జూలై 14 (వుదయం బ్యూరో)**

భక్తి భావనతో పాటు సామాజిక సేవా నిరతిని చాటుకుంటూ ధరూర్ మండలంలోని కోతులగిద్ద శ్రీశ్రీశ్రీ అరణ్యేశ్వర స్వామి ఆలయం దాతృత్వానికి వేదికగా నిలిచింది. ఆలయంలో నిర్విఘ్నంగా సాగుతున్న అన్నప్రసాద వితరణ (అన్నదాన) కార్యక్రమానికి భక్తులు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. భక్తుల ఉదారతతో సమకూరిన 70 స్టీల్ ప్లేట్లను ఆలయ కమిటీకి మంగళవారం ఘనంగా అందజేశారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణను మరింత సౌకర్యవంతంగా, క్రమబద్ధంగా నిర్వహించాలనే ఉన్నత ఆశయంతోనే ఈ విరాళాన్ని అందించినట్లు దాతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆలయంలో నిత్యం జరిగే అన్నదాన సేవలకు ఈ విరాళం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**దాతృత్వం.. సమాజానికి స్ఫూర్తిదాయకం**

"స్వామివారి సేవలో భాగస్వాములవుతూ, అన్నదాన కార్యక్రమానికి చేయూతనిస్తున్న దాతల ఉదార స్వభావం అభినందనీయం. భక్తుల సేవా దృక్పథమే ఆలయ ప్రగతికి చోదక శక్తిగా నిలుస్తోంది. సమాజంలో ఇలాంటి దాతృత్వం మరెందరికో మార్గదర్శకం కావాలి."ఆలయ కమిటీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దాతల ఈ సేవా గుణంపై స్థానికంగా ప్రశంసల జల్లు కురుస్తోంది.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి



**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి**

**కల్వకుర్తి**

**జులై 14 (వు దయం)**

ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు ఎలాంటి లోపాలు లేకుండా వేగవంతం చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు నియోజకవర్గంలోని శుభం గార్డెన్‌లో ప్రత్యేక ఓటరు సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీ గోలి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని పలు సూచనలు అందజేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి అర్హులైన ఓటరు పేరు జాబితా నుంచి మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, ప్రజల్లో అవగాహన కల్పించి ఎక్కువ మంది ఈ కార్యక్రమాన్ని వినియోగించుకునేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై రేవంత్ ప్రభుత్వంపై ఆర్. కృష్ణయ్య తీవ్ర విమర్శలు

**- "కాంట్రాక్టర్లకు లక్షల కోట్లు... విద్యార్థులకు రూ.8 వేల కోట్లు ఇవ్వలేరా?"**
**- ఇందిరాపార్క్‌లో బీసీ సంక్షేమ సంఘం సత్యాగ్రహ దీక్ష – మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ చారి సంఘీభావం**

**ముషీరాబాద్, జూలై 14(వుదయం)**



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన సత్యాగ్రహ దీక్ష ఉద్రిక్త వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదన్ చారి తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని దోచుకోవడంలో మాత్రమే ప్రభుత్వం ముందుంటోందని, కానీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం అత్యంత సిగ్గుచేటు అని ఆయన అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం గత ముఖ్యమంత్రుల హయాం నుంచే విజయవంతంగా అమలవుతూ వస్తోందని గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, గతంలో అమలులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న జీవో నెం. 8, జీవో నెం. 9లను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సత్యాగ్రహ దీక్షలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## పాలమూరుపై గత పాలకులది పచ్చి ద్రోహం!

**మల్దకల్**

**జులై 14 (వుదయం బ్యూరో)**

"భూమిపూజల ఆర్భాటాలు.. బోగస్ ప్రచారాలు తప్ప క్షేత్రస్థాయిలో పాలమూరుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. నిధులు ఇవ్వకుండా, ప్రాజెక్టును అర్ధాంతరంగా గాలికొదిలేసి రైతుల నోట్లో మట్టి కొట్టారు" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేసి, ఈ ప్రాంత రైతాంగానికి గత పాలకుల చేసిన తీరని అన్యాయాన్ని ఆయన ఎండగట్టారు. ప్రజా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని.. ఎన్ని వేల కోట్ల రూపాయలైనా వెచ్చించి, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, కృష్ణా జలాలతో పాలమూరు తలరాతను మారుస్తామని భీష్మించారు.గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి నిర్వహించిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోట్లను వెచ్చిస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు రూ.67 వేల కోట్ల వడ్డీలేని రుణాలు, కోటి ఆరు లక్షల కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం, 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చాటిచెప్పారు.

దొరల పాలనకు చరమగీతం.. 'బావ-బామ్మర్దుల'కు కాలం చెల్లింది! బీఆర్ఎస్ నేతల విమర్శలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కరుకుగా స్పందించారు. "మళ్లీ వస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారు.. అస్సలు మీ పార్టీ అసలు నాయకుడు ఎక్కడున్నారో మీకే తెలియని దయనీయ స్థితిలో ఉన్నారు. 'బావ-బామ్మర్దుల' రాజకీయాలకు గతం లేదు.. భవిష్యత్తూ లేదు. ప్రజలను మళ్లీ మభ్యపెట్టే రోజులు ముగిశాయి" అని హెచ్చరించారు. దొరల పాలనకు చరమగీతం పాడి, ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నామని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే బ్రహ్మరథం పడతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

## డ్రగ్స్ కు యువత దూరంగా ఉండాలి



**- బి.వి.ఆర్.ఐ.టి కళాశాలలో డ్రక్స్ పై అవగాహన సదస్సు**

**నర్సాపూర్, జూలై 14,( వుదయం న్యూస్).**

నేటి కాలంలో యువత డ్రగ్స్ కు మారక ద్రవ్యాలకు అలవాటు పడుతున్న నేపథ్యంలో యువతలో అవగాహన కల్పించాలని నర్సాపూర్ బి.వి.ఆర్.ఐ.టి (BVRIT) కళాశాలలో నర్సాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం "డ్రగ్స్ నియంత్రణ అవగాహన సదస్సు" నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా మెదక్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ ప్రస్తుతం యువతలలో మాదక ద్రవ్యాలను డ్రగ్స్ కు ఎక్కువగా బానిసలు అవుతున్నారు వయువతను వేధిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారి పై నియంత్రణ చేయుటలో అందరం భాగస్వామ్యం కావాలని అన్నారు డ్రగ్స్‌కు నో (NO) చెప్పండి ను ఎలా నిర్వీర్యం చేస్తాయో, విద్యార్థుల చేస్తుందని అన్నారు విద్యార్థులు డ్రగ్స్‌కు ఖచ్చితంగా దూరంగా ఉండాలని అన్నారు.బీవిఆర్ఐటి డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబె మాట్లాడుతూ విద్యార్థులు తోటివారి ఒత్తిళ్లకు లొంగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఉజ్వల భవిష్యత్తు కోసం చదువు పైనే దృష్టి పెట్టాలని డ్రగ్స్ కు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారుఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా ఎస్.ఐ సుచరిత సి.ఐ (CI) రాఘవేంద్రరావు, ఎస్.ఐ అజీజ్ ఖాన్, ఎస్.ఐ అరుణ, డి.టి.ఎఫ్ సి.ఐ (DTF CI) గోపాల్, డి.టి.ఎఫ్ ఎస్.ఐ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.




**ఆ నిర్ణయాలు అన్యాయం**

ఫిఫా వరల్డ్ కప్ 2026 మ్యాచ్ లు అత్యంత ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మ్యాచ్ లలో కొన్ని నిర్ణయాలు అన్యాయంగా ఉంటున్నాయి.. అర్ధరాత్రి, తెల్లవారుజామున మ్యాచ్ లు వస్తుండటంతో నా రోజువారీ షెడ్యూల్ పూర్తిగా మారిపోయింది. అయినా నేను కచ్చితంగా మ్యాచ్ చూస్తాను. నాకు కొన్ని రిఫరీ నిర్ణయాలు నచ్చడం లేదు. వివక్షగా అనిపిస్తున్నాయి. ఈ విషయంలో బాధగా ఉంది. ఇక, ఈ టోర్నీలో ఎలాంటి అంచనాలు లేని దేశాలు విజయం సాధించడం ఆనందంగా ఉంది. చాలా బాగా ఆడే జట్లు ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించింది...

**- అమితాబ్ బచ్చన్, బాలీవుడ్ అగ్రకథానాయకుడు**

## వే'మన' పద్యం

కనకమృగము భువిని గద్దు లేదనకను
తరుణి విడిచి చనియె దాశరథియు
తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా
విశ్వదాభిరామ! వినురవేమ



# సంపాదకీయం

## ఆలోచనలను తిప్పికొట్టాలి

చాహే ఆప్ అధ్యాపక్ బనో, చాహే ఆప్ ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ బనో, కోయీ బనో మగర్ ఏక్ ఎక్స్‌పర్ట్ మా బనో పెహలేతుమ్ "మీరు అధ్యాపకులు కావచ్చు, మీరు ఐ.ఏ.ఎస్. ఆఫీసరు అవ్వొచ్చు. కానీ ముందుగా మీరు మంచి అమ్మలు కండి. డిగ్రీ పట్టాలు పొందుతున్న చదువులో మంచి పతకాలు పొందిన విద్యార్థినులను ఉద్దేశించి బోధిస్తున్న మాటలివి. మీరు ఎంత గొప్పగా తెలివితేటలు పెంచుకున్నా కానీ, అధికారులుగా సేవ చేయొచ్చు గానీ, ముందుగా ఒక మంచి అమ్మగా తర్ఫీదు పొందకపోతే, మంచి అమ్మకాకపోతే జీవితం వృథా అయిపోతున్నదనే ఆ వాక్యాల సారం. ఇవి ఎవరో అనామకులు చెప్పలేదు. ప్రస్తుత ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ గారి బహిరంగ ఉపన్యాస ప్రకటన. జూలై 9న లక్నోలోని ఛత్రపతి సాహు జీ మహరాజ్ యూనివర్సిటీలో విద్యార్థులకు పట్టాల పంపిణీ, పతకాల పంపిణీ సమావేశంలో ముఖ్య అతిథిగా చాన్సలర్ హోదాలో పాల్గొన్న ఆనందిబెన్ పటేల్ పితృస్వామిక భావజాలంతో నిండిన అనేక విషయాలను విద్యార్థినులు నేర్చుకోవాల్సిందిగా ఉద్బోధించారు. ఆనందిబెన్ గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా అనేక రాష్ట్రాలలో గవర్నర్‌గా పనిచేశారు. ఈవిడ బీజేపీలో ప్రముఖ నాయకురాలిగా కూడా ఉన్నారు. లక్షమంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరైన సభలో ఆమె మాట్లాడారు. ఇంకా ఆమె బోధన ఎలా సాగిందంటే, "అమ్మాయిలూ మీరు మంచిగా వంటలు వండటం కూడా నేర్చుకోవాలి. అత్తారింటికి వెళ్లాక, అత్తమామలు ఏదైనా వండి పెట్టమంటే, మీరు చేయలేకపోతే వాళ్లేమంటారు.. మీ అమ్మానాన్నలు ఇలాగే పెంచారా? అని నిందిస్తారు. కనుక వంట నేర్చుకోవాలి, ఇంటినీ పిల్లల్ని చూసుకోవడం నేర్చుకోవాలి. అంతేకాదు కుటుంబ సంబంధాలు సు సరిగా నిర్వహించాలి" అని ఆడపిల్లల కెరీర్ ఇదే అన్నట్లుగా సెలవిచ్చారు. ఇంకా...! మీరు చదువుకోవటానికి వచ్చి అబ్బాయిలతో వెళతారు. మీకు గర్భం వస్తుంది. బిడ్డ పుడుతుంది. ఆ బిడ్డను ఎవరూ తీసుకోరు. ఆ బిడ్డకు తల్లి తండ్రి ప్రభుత్వం కావలసి వస్తుంది. అంటే ప్రభుత్వం భరించాల్సి వస్తుందని ఆమె భావన. తల్లిదండ్రులూ! పిల్లలు చదువుకోవటానికి విద్యాసంస్థల్లోకి వచ్చినప్పుడు, వాళ్లను గమనిస్తూ ఉండండి అంటూ తల్లిదండ్రులకూ ఉద్బోధించారు. విద్యార్థినులను విద్యార్థులను ఉన్నత ఉద్యోగాలకు తయారుచేయకపోగా, వాళ్లకు లింగపరమైన విభజనలు పై విషయాలను చెప్పటం పలువురిని ఆశ్చర్యపరచింది. వంట చేయటం, పిల్లల్ని కనిపెంచటమే అమ్మాయిల ప్రథమ కర్తవ్యంగా బోధించడం అత్యంత దారుణమైన విషయం. ఇది ఆనందిబెన్ పటేల్ ఆలోచన, ఆచరణకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఆమె ఎదిగిన పార్టీ భావజాలం ఆ విధమైనది. ప్రపంచం ఎంతో అభివృద్ధి చెంది, అన్ని రంగాలలో మహిళలు, పురుషులకు సమానంగా ముందుకుపోతుంటే, మన రాజ్యాంగం ప్రకారం స్త్రీ పురుషులు సమానమని, వివక్షత ఉండరాదని చెబుతుంటే, తిరిగి మనుధర్మ శాస్త్రం ప్రకారం స్త్రీలు నడచుకోవాలని బోధించడం ఎంత అనాగరికం! స్త్రీలు పిల్లల్ని కంటారు సరే, పురుషుడి బాధ్యతలేదా? అతను తండ్రిగా సమాన బాధ్యత వహించాలి కదా! వంటచేయటం ఆడవాళ్ల పనేనా? ఇంటినీ, అత్తమామల్ని చూసుకోవడం ఆడపిల్లలకు మాత్రమే ఉన్న బాధ్యతనా! ఇవేమి బోధనలు. ఇది పూర్తిగా మహిళలను వంట ఇంటి బానిసలుగా చూసే సనాతన ఆచార వ్యవహారం మాత్రమే. బీజేపీ, ఆరెస్సెస్, సంఘ పరివారాలంతా ఈ ఆలోచనలతోనే ఉంటుంది. మహిళలను బలహీనులుగా, చిన్నచూపు చూడడం, వాళ్ల విధులను, కట్టుబొట్టును, నడవడికను, మాటల్ని అన్నిటినీ నియంత్రించడం ఈ మనుధర్మ బోధకులకు అలవాటైన విషయం. ఒకవైపు స్త్రీలను శక్తి స్వరూపిణులుగా, దేవతలుగా పొగుడుతారు. మరోవైపు పురుషునికి బానిసగా ఉండాలని బోధిస్తారు. రాజా రామ్మోహనరాయ్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం, గురజాడ లాంటి ఎంతో మంది సంఘ సంస్కర్తలు స్త్రీల సమాజంలో సమానహక్కును పొందాలని, విద్యను పొందాలని, వివక్ష తగదని ఉద్యమాన్ని చేపట్టారు. ఆధునిక మహిళ చరిత్రను పునర్లిఖిస్తుందని గురజాడ వందేళ్ల క్రితమే పేర్కొన్నాడు. అట్లాంటి మహనీయులు ఆశించిన స్త్రీ సాధికారత, స్వేచ్ఛలను స్త్రీలకు దూరం చేసే పితృస్వామిక ధోరణి భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది ఈ బీజేపీ పరివారము. ఇది కేవలం వ్యక్తుల అభిప్రాయం మాత్రం కాదు, రేపు దేశంలో సగం మందిగా ఉన్న స్త్రీలు ఎదుర్కొనే పెద్ద సవాలు. ఎందుకంటే ఈ భావజాలాలే నేడు దేశంలో ఆధిపత్యంలో ఉంది. అధికారంలో ఉంది. "బేటీ పఢావో, బేటీ బచావో" అనే నినాదాలు కేవలం ఆకర్షణమైనవిగా మిగులుతున్నాయి. నేటితరం ఇలాంటి ఆలోచనలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

**రచనలు పంపండి**

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయ పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# కమ్మని పాటల జానకమ్మ



దుర్యోధన దుశ్శాసన దుర్వినీత'' లోకాలను భయ కంపితుల్ని చేసేంత ధీరత్వం ఉందాగళానికి. ''మనసా తుళ్లిపడకే'' అంటూ సముదాయించే మెత్తదనమూ ఉంది. ఆ గొంతు ఇప్పుడు లేదు... ఆ తంత్రి తెగిపోయింది... ఆ గూటిలో కోయిల ఎగిరి పోయింది... జనహృదయాలను తన పాటలతో ఓలలాడించిన జానకి మన నుంచి దూరమైంది. ఎస్. జానకి సంగీత ప్రస్థానం భారతీయ చలనచిత్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. అమాయకత్వం ఉట్టిపడే పసిపిల్లల గొంతు నుంచి ముసలి ముత్తవ్వల స్వరాల వరకు, భక్తి భావనలు పండించే కీర్తనల నుండి హుషారైన నృత్య గీతాల వరకు ఆమె పలికించిన భావాలు అద్వితీయం. ఎనభై ఎనిమిదేండ్ల జీవనయానంలో అరవై ఏండ్ల గానం ఆమెది. ఐదు తరాల నటులకు తన స్వరంతో ప్రాణం పోసిన జానకమ్మ కేవలం ఒక గాయని మాత్రమే కాదు, అసంఖ్యాక స్వరాల అద్భుత సృష్టి కర్త. ఇప్పుడామె తనువు చాలించారు. ఇక నుంచి జానకి కనిపించరు. కానీ... ఎన్నో భాషల్లో ఆమె పాడిన పాటలు 'నీలి మేఘాలలో... గాలి కెరటాలలో..' మనల్ని పరవశింప చేస్తూనే ఉంటాయి. పాట ఏ భాషలో ఉన్నా సరే, ఆయా ప్రాంతాల ఉచ్చారణను, అక్కడి మట్టి వాసనను పక్కాగా పట్టుకోగలగడం ఆమె గొంతు ప్రత్యేకత. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఆమె పాడిన వేలాది పాటలు ఆయా రాష్ట్రాల ప్రజల జీవితాల్లో ఒక భాగమైపోయాయి. శాస్త్రీయ సంగీతంలో ఎలాంటి అధికారిక శిక్షణా లేకపోయినా, కేవలం ఏకసంథా గ్రహిగా, శ్రవణ జ్ఞానంతోనే ఆమె సాధించిన ప్రగతి ఈనాటి యువ గాయనీ గాయకులకు ఒక గొప్పపాఠం. రేపల్లె తాలూకాలో కనుతెరచి... మన సిరిసిల్లలో 'సరిగమపదని' నేర్చి, జాతీయ స్థాయికి ఎదిగిన తెలుగింటి ఆడపడుచు మన జానకమ్మ! పేరుకు తెలుగు గాయనే అయినా దక్షిణ భారతంలోని ప్రతి చిత్ర పరిశ్రమ ఎస్.జానకి స్వరాన్ని తమదిగా భావించింది. దక్షిణ భారత గాన కోకిలగా పేరుగాంచిన ఆమె స్వరాలకు సరికొత్త సొబగులు అద్దారు. సాహిత్యానికి వేడుక చేశారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం... ఇలా మనవైన భాషలు మొదలుకొని సింహళం, జర్మనీ, జపాన్ వరకూ పదిహేడుకు పైగా భాషల్లో దాదాపు యాభై వేల పాటలు ఆలపించారు. ఇందులో పదహారు వేల పైచిలుకు పాటలు సినిమాల కోసం ఆలపించినవే. దక్షిణాదిలో తొలి ఆంగ్ల గీతాన్ని పాడిన ఘనతనూ సొంతం చేసుకున్నారు. చంద్రుడిపై మానవుడు కాలు మోపిన అపురూప ఘట్టం సందర్భంగా రూపొందించిన మ్యూజిక్ ఆల్బమ్ కోసం 'మాన్ హాస్ సెట్ హిజ్ ఫుట్ ఆన్ ది మూన్'' అనే గీతాన్ని పీబీ శ్రీనివాస్‌తో కలిసి ఆలపించారామె. అందుకే ఏ భాషలోకి వెళ్లినా 'మా జానకమ్మ' అంటూ ఆమెని సొంతం చేసుకుంటారు. నాలుగు జాతీయ పురస్కారాలతో పాటు, పలు రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు ఆమె సొంతమయ్యాయి. గానం, సంగీత దర్శకత్వం, రచన... ఇలా ఎన్నో రూపాలుగా తన ప్రతిభని చాటిన జానకి చదువుకోలేదు. కానీ తన పాటల ప్రయాణంలోనే ఎన్నో భాషలు నేర్చుకున్నారామె. ఊహ తెలిసినప్పటి నుంచి పాటే ఆమె ప్రపంచం. గళంతో గారడి చేస్తూ.. సినీ సంగీత ప్రియుల్ని పాటల పూదోటలో విహరింపజేయడంలో దిట్ట. కులాలు, వర్ణాలు అన్నీ మనం కల్పించు కొన్నవే. మనుషులంతా ఒక్కటే అనే పరమోన్నత సందేశాన్ని ఇచ్చిన 'గోవుల్లు తెల్లన' పాట జానకమ్మ గొంతు చల్లిన గోధూళి ఎర్రని స్వరార్ణవ అరుణారుణ వర్ణాలు. పిల్లల్లా గాత్రం మార్చి పాటలతో అల్లరి చేయాలన్నా.. వయసు పైబడిన ముదుసలిలా స్వరంలో భావాలు ఒలికించాలన్నా ఆమెకి ఆమే సరిసాటి. ఇలా వైవిధ్యభరితమైన స్వరంతో ఆమె చేసే మాయలన్నీ నేడు సంగీతపాఠాలుగా నిలిచిపోతాయి. భాష ఏదైనా... బాణీ ఎలాంటిదైనా తన మధుర గాత్రంతో పాటను అమృతతుల్యం చేసిన గొప్ప గాయని ఎస్.జానకి. స్వరాలకు అనుగుణంగా గాత్రాన్ని మార్చుకోగల అద్భుత శక్తి ఆమె సొంతం. తన పాటలతో దశాబ్దాలుగా శ్రోతల్ని ఆనందడోలికల్లో ఉర్రూతలూగించి.. తెలుగు నేలలో జానకమ్మగా ఖ్యాతిగాంచిన స్వర సామ్రాజ్ఞి. స్వరంలో ఎంతటి వైవిధ్యం ఉన్నా, నిజజీవితంలో అంతటి సరళత, నిరాడంబ రతను ప్రదర్శించడం ఆమెకే చెల్లింది. అవార్డులు, సత్కారాల కంటే ప్రేక్షకుల గుండెల్లో దక్కే స్థానమే మిన్న అని నమ్మిన మహోన్నత వ్యక్తిత్వం ఆమెది. పద్మభూషణ్ వంటి పురస్కా రాన్ని కూడా ఎంతో హుందాగా తిరస్కరించి, కళాకారులకు దక్కాల్సిన అసలైన గౌరవం కోసం నిలబడిన తీరు ఆమె ఆత్మగౌరవానికి నిదర్శనం. ఆమె పెదవి పలికితే గేయాలు. మన గుండె గొంతుల్లో నిండే పాటలు. 'ఆకాశం ఏనాటిదో అనురాగం ఆనాటిదంటూ...'పాటల 'సిరిమల్లె పువ్వు'లను తన జ్ఞాపకంగా వదిలి వెళ్లిన సంగీత రాజ్ఞికి జోహర్లు.

# నైపుణ్య యువతే ప్రపంచ ఉజ్వల భవిత



ప్రపంచంలోని 8.2 బిలియన్ల జనాభాలో 15 నుంచి 24 ఏండ్ల వయస్సు కలిగిన యువత జనాభా 1.22 బిలియన్లు (దాదాపు 15.4 శాతం) ఉన్నారు. అదే విధంగా ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 78 శాతం అనగా 6.4 బిలియన్లు ఉన్నారు. నేడు భారత జనాభా 1.46 బిలియన్లు ఉన్నది. ఇందులో 15 నుంచి 29 ఏండ్ల యువత జనాభా 40 శాతం వరకు ఉన్నది. మన దేశంలో 15 నుంచి 64 ఏండ్ల వయస్సు కలిగిన పని చేసే లేదా వర్కింగ్ క్లాస్ జనాభా 96.1 కోట్లు (లేదా 0.961 బిలియన్లు), అనగా 68 శాతం వరకు ఉన్నది. ఇండియాలో 15 ఏండ్ల లోపు జనాభా 24 శాతం, 64 ఏండ్లు దాటిన వారి జనాభా 7 శాతం వరకు ఉన్నది. ఇతర దేశాలతో పోల్చితే భారత జనాభా సగటు వయస్సు చాలా తక్కువగా 28.8 ఏండ్లు మాత్రమే ఉన్నది. జపాన్ ప్రజల సగటు వయస్సు 49.9 ఏండ్లు ఉన్నది. అందువల్లనే ఇండియాను "యువ భారత్" అని, జపాన్‌ను "ఓల్డ్ జపాన్" అని పిలుస్తున్నాం. యువత జనాభా అధికంగా ఉండడం వల్ల రాబోయే రోజుల్లో విశ్వ దేశాల్లో భారత్ ముందుండా తన సత్తాను గట్టిగా చాటుకోనున్నది. దేశాభివృద్ధికి నైపుణ్య యువతే పునాది:

యువత అధికంగా ఉండడంతో పాటు ఆ యువత నైపుణ్య విద్యను పొందింతే భారత భవిత ఉజ్వలంగా ఉండనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

అధిక యువ జనాభా కలిగిన యువ భారతాన్ని పలు సవాళ్లు కూడా వెంటాడుతున్నాయి. నేడు పరిశ్రమ ఆశిస్తున్న నైపుణ్యాలకు, నేటి మన యువత కలిగి ఉన్న నైపుణ్యాలకు మధ్య వ్యత్యాసం లేదా గ్యాప్ అధికంగా ఉండడంతో మన యువ శక్తి దేశాభివృద్ధికి అంతగా వినియోగపడడం లేదు. యువతలో అవసర నైపుణ్యాలు కొరవడితే నిరుద్యోగం పెరగడం, తక్కువ స్థాయి ఉద్యోగాలు చేయడం లాంటి ప్రతికూల ఫలితాలు వెక్కిరిస్తున్నాయి. తగిన నైపుణ్యాలు లేని యువతతో నిరుద్యోగ సమస్యలు పెరిగి సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి, సమానత్వ భావనలు పలుచబడతాయి. పౌర సమాజ సుస్థిరాభివృద్ధికి, ఆరోగ్యకర సమాజ స్థాపనకు నైపుణ్య యువత మాత్రమే పునాది అవుతారు. బహుళ జాతి కంపెనీలు (ఎంఎన్‌సిలు) లేదా పరిశ్రమలు కోరుతున్న నైపుణ్యాలను నేటి విద్యాలయాలు బోధిస్తూ, తగు శిక్షణలు ఇవ్వాలి. ఏఐ, డిజిటల్ నైపుణ్యాల్లో యువత సాధికారత: 2014లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 15 జూలై రోజున "ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం (వరల్డ్ యూత్ స్కిల్స్ డే)" పాటించడం కొనసాగుతున్నది. నేడు మనం 11వ ప్రపంచ యువత నైపుణ్యాల దినం జరుపుకుంటున్న వేళ 2026 ఇతివృత్తంగా "భాగస్వామ్య భవిష్యత్తు కోసం ఆధునిక నైపుణ్యాలు (స్కిల్స్ ఫర్ ఏ షేర్డ్ ఫ్యూచర్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. నేడు ప్రపంచం 4వ పారిశ్రామిక విప్లవం సాకారం కావడానికి "ఏఐ, సాంకేతిక, వృత్తి విద్య మరియు శిక్షణ" రంగాలు నడుం బిగిస్తే నేటి యువత రేపటి పరిశ్రమలో పనిచేయడానికి సిద్ధం అవుతారు. నేడు ఏఐ రంగం ప్రపంచాన్ని శాసిస్తున్నది. మన జీవితాలు, లెర్నింగ్, చేసే పనులను ఏఐ నిర్ణయించనున్నది. పరిశ్రమ కోరుకున్న నైపుణ్యాల్లో మాత్రమే మన యువతను సదా సిద్ధం చేయాలి. నైపుణ్య యువతతో సమాజ శాంతి, సమ్మిళిత సుస్థిరాభివృద్ధి సుసాధ్యం అవుతాయని నేటి విద్యాలయాలు, ప్రభుత్వాలు, యువత, పౌర సమాజం, పాలసీ తయారు చేసే వారు గట్టిగా నమ్మాల్సిన అగత్యం ఏర్పడింది. ఉత్తమ వృత్తి శిక్షణ, ఏఐ నైపుణ్యాల్లో వృద్ధి, డిజిటల్ సాధికారత వంటి అంశాల్లో యువత దృష్టి పెట్టాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మన చదువులు కొనసాగాలి. ఉత్తమ శ్రేణి బోధనలు, అవసర మౌళిక వసతులు, నైపుణ్యాల వృద్ధికి తగిన నిధులను వెచ్చించడం, నాణ్యమైన విద్యా బోధనలు నేటి తక్షణ కర్తవ్యం అని మరువరాదు. నేటి యువత నాణ్యమైన నైపుణ్య విద్యను పొందితే మన యువశక్తి దేశానికి వరంగా మారుతుంది. యువతలో నైపుణ్యాలు కొరవడితే యువ శక్తి శాపంగా మారి, అశాంతికి ఆజ్యం పోస్తుంది. మన యువతను నైపుణ్య శక్తిగా మార్చుదాం, అగ్ర రాజ్యాల సరసన సగర్వంగా నిలబడదాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# తప్పెవరిది...?

తెలంగాణాలో పదేండ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సగం కాలం పూర్తయినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో మంత్రి వర్గాన్ని విస్తరించలేదు. పైగా ఒక్కొక్క మంత్రి రెండు మూడు ప్రధాన విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో అన్నింటిపై సమీక్ష, నిఘా లేకపోవటం వల్ల పాలన పట్టు తప్పుతుందా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. ఎందుకంటే, దానికి కొన్ని ఉదాహరణలూ లేకపోలేదు. ఈ నెల పదిన అర్ధరాత్రి రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలను చూసి తెలంగాణ ప్రజానీకం దిగ్భ్రాంతికి గురైంది. నిందితుడు పార్వతి రాజ్‌కుమార్ షాబాద్‌లో నివాసం ఉంటూ పక్కింటి మైనర్ బాలికను వేధించటం వల్ల అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆశ్చర్యకర విషయమేమంటే ఈ కేసులో సాధారణంగా బెయిల్ దొరకటం కష్టం. కానీ రాజ్‌కుమార్ విషయంలో యాంటిసిపేటరీ బెయిల్ దొరికిందంటే షాబాద్ పోలీసుల నిర్లక్ష్యం, అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అమ్మాయిని వేధిస్తుంటే బాధిత కుటుంబసభ్యులు అనేకమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, లంచాలకు మరిగిన పోలీసులు నిర్లక్ష్యం వహించారు. పైగా పోక్సో కేసులో కూడా బెయిలెబుల్ సెక్షన్లు పెట్టడంతో రాజకుమార్ ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. బాలిక కుటుంబపై కక్ష పెంచుకుని బాలికతో పాటు ఆమె తల్లి, నానమ్మను హత్య చేశాడు. అంతటితో ఆగకుండా తన భార్యతో పాటు ఇద్దరు కొడుకులనూ నిర్దాక్షిణ్యంగా చంపేసి అద్దె కారులో పరా య్యాడు. ముఖ్యమంత్రిగా హోం శాఖను కూడా తన ఆదీనంలో పెట్టుకున్న రేవంత్ రెడ్డి ఆ బాధిత కుటుంబానికి, శాంతి భద్రతల విషయంలో తెలంగాణ ప్రజానీకానికి ఏమి సమాధానం చెబుతాడు? పోలీస్ వ్యవస్థనే కాదు, ఆ మాటకొస్తే అన్ని శాఖలు దాదాపు పూర్తిస్థాయిలో అవినీతిలో కూరుకుపోయాయి. ముఖ్యంగా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రేషన్, ఇరిగేషన్, విద్యుత్, ఇలా అనేక శాఖల్లో లంచాలు తీసుకుంటూ చాలామంది అధికారులు ఏసీబీకి పట్టుపడుతున్నారు. వ్యవస్థలు ఇంతగా కుళ్లి పోవటానికి ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వానిది బాధ్యత అయితే, దాన్ని అరికట్టలేని ప్రస్తుత సర్కార్‌ది కూడా ఇందులో భాగస్వామ్యం ఉంది.




# సామాజిక సేవలకు ప్రతిరూపం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరురాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించదగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందు కున్నారు. గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు.



**ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరు రాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి**

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్. ఎల్. బి పూర్తిచేసింది. న్యాయశాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు.

భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు. 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు.

ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్ గా పిలిచేవారు. అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించ బడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు, అనాధ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు. రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతి గృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యా కేంద్రాలు నెలకొల్పారు.

లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీలను స్థాపించారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు.

దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు.

**దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన అందించారు.**

1971లో సాక్షారతా భవన్ ని ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు. అసమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## హిత శత్రువు !

రామునిడి చేతిలో కోదండం
కన్నయ్య కరంలో సుదర్శన చక్రం
భీముడి హస్తంలో భారీ గదా
పరశురాముడి చేతిలో గొడ్డలి
అర్జునుడి చేతిలో గాండీవం
వృద్ధుడి మూడో హస్తం చాదస్తం
నడవంత్రపు నరుడి అరచేతిలో..
మొలిచె ఆరో అంగమైంది స్మార్ట్‌ఫోన్

చిన్నారుల అరచేతులోనూ..
తిష్టవేసింది ఆప్త శత్రువు
నాడు పుస్తకం హస్తభూషణం..
నేడు చరవాణే హస్తభూషణం
డిజిటల్ ఫోన్ చేతిలో లేనిదే
ముద్ద దిగనని మారం చేస్తోంది
మానవుడి మతి పోగొట్టేస్తోంది
నేడు ఆరో అంగం వచ్చి చేరింది !

రావణుడికి పది తలకాయలు..
ప్రపంచ బలశాలి సెల్‌ఫోన్‌కు..
వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్..
లాంటి తలకాయలు ఎన్నో ఎన్నెన్నో..
సోషల్ మీడియా వ్యసనాలు..
భావోద్వేగ భస్మాసుర హస్తాలు
అరిష్టాన్ని ఆలింగనం చేసుకోవద్దు
మానసిక రుగ్మతల ఆహ్వానిచొద్దు !

పరిమితిలో వాడితేనే ప్రగతి..
అవసరానికి వాడితే అభివృద్ధి
దుర్వినియోగం చేస్తే మానసిక రోగి
వెర్రితలలు వేస్తే వ్యక్తిత్వ అధోగతి
తెలివిగా వాడితే ఆప్తమిత్రుడు
అతి చేస్తే గతి చెడగొట్టే శత్రువు
క్షణం దూరమైతే శ్వాస ఆగుతుంది
వరమో, శాపమో తెలియని దుస్థితి !

మధుపాళీ

# జాతీయం-అంతర్జాతీయం



## మొద్దుబారిన మోడీ ప్రభుత్వం

- ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం
- దీక్షను విరమించాలంటూ వాంగ్‌చుక్ కు విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జులై 14(ఏ.ఎం.ఎస్):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'మొద్దు బారిపోయిందని, ఏ త్యాగాన్ని గుర్తించే స్థితిలో లేదని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేష్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్షను విరమించాలని ఆయన కోరారు

"సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను విరమించాలని తాను వినయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను. ఆయన ప్రపంచానికి ముఖ్యమైన వ్యక్తి. ఎందుకంటే ప్రజాస్వామ్యం పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత మానవత్వం, పర్యావరణం పట్ల కూడా ప్రతిబింబిస్తుంది'' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) జంతర్‌మంతర్‌లో చేపడుతున్న నిరసన 24వ రోజుకు చేరుకుంది. సిజెపికి మద్దతుగా వాంగ్‌చుక్ చేపడుతున్న నిరవధిక నిరాహార దీక్ష 17వ రోజుకి చేరుకోవడంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.


పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరసనను విరమించాలని ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్ కోరారు. సిజెపి చేపడుతున్న ఆందోళనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాంగ్‌చుక్ గత కొన్ని రోజులుగా నిరహారదీక్ష చేస్తున్నారని, దీంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని అన్నారు. ఆయన దేశానికి ఒక విలువైన వ్యక్తి అని, పోరాటాన్ని కొనసాగించేందుకు ఇతర మార్గాలు కూడా ఉన్నాయని అన్నారు. ఆయన వెంటనే నిరాహారదీక్షను నిలిపివేయాలని కోరుతున్నట్లు తెలిపారు. వాంగ్‌చుక్, సిజెపి నిరసనకు మద్దతు తెలిపేందుకు గురువారం సాయంత్రం 5.00గంటలకు జంతర్‌మంతర్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు.

## అయోధ్య కేసులో ట్విస్ట్

- హైకోర్టును ఆశ్రయించిన నిందితుడు
- విచారణ 16కు వాయిదా

**డెహ్రాడూన్, జులై 14 (ఏ.ఎం.ఎస్) :** అయోధ్యలోని రామమందిరం లో విరాళాల తస్కరణ కేసు తర్వాత ఆలయాల్లో చోరీ కేసులు బయటకు వస్తున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రం బద్రీనాథ్ ఆలయంలో విరాళాల చోరీ కేసు తెరపైకి వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న, సస్పెండ్ అయిన బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) ఉద్యోగి ప్రమోద్ నౌటియాల్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది. ఆయనను సోమవారమే కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.నిందితుడి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు, అతడు డెహ్రాదూన్‌లో ఉన్నట్లు గుర్తిం చారు. అక్కడికి చేరుకున్న సిట్ అధికారులు గంటపాటు విచారించారు. అనంతరం ఆదివారం రాత్రి 9.45 గంటల నుంచి 10.15 గంటల మధ్య అతడిని అదుపులోకి తీసుకున్నారు. గోపేశ్వర్ కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఉత్తరాఖండ్ పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును సిట్ కోరనుంది.

జులై 2న ఆలయ హుండీ విరాళాల





లెక్కింపు సందర్భంగా తీసిన సీసీటీవీ దృశ్యాల్లో ప్రమోద్ నౌటియాల్ అనుమానాస్పదంగా ప్రవర్తించినట్టు పోలీసులు తెలిపారు. రూ.500, రూ.100 నోట్ల కట్టలు, బంగారం, వెండి నాణేలు, శాలిగ్రామ రాళ్లు, భక్తులు సమర్పించిన కానుకల కవర్లను తీసుకుంటున్నట్టు వీడియోల్లో కనిపించిందని పేర్కొన్నారు. లెక్కింపు గది నుంచి తన కార్యాలయానికి రెండు నుంచి మూడు సార్లు వెళ్లి వచ్చినట్టు కూడా సీసీటీవీ ఫుటేజీలో గుర్తించినట్లు తెలిపారు. దొంగిలించిన నగదు, విలువైన వస్తువులను తన కార్యాలయంలో దాచివేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.లెక్కింపులో వెలుగులోకి వచ్చిన అక్రమాలు బద్రీనాథ్ ఆలయంలో విరాళాల లెక్కింపు సమయంలో అక్రమాలు జరిగాయంటూ సోషల్ మీడియాలో వెల్లు వెత్తాయి. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత భైరవ్ సేన అనే సంస్థ ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని, నిందితులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఆ తర్వాత జులై 2న విరాళాల లెక్కింపు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా నగదును చోరీ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశించింది. బీకేటీసీ ఇన్‌చార్జి టెంపుల్ ఆఫీసర్ యుధ్‌వీర్ పుష్పవాన్ ఫిర్యాదు మేరకు బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు సీసీటీవీ కంట్రోల్ అధికారి పన్వార్, విరాళాల లెక్కింపు సమయంలో అక్కడే ఉన్న హరేంద్ర కోఠారి తదితరుల వాంగ్మూలాలను కూడా సిట్ నమోదు చేసింది.

ఆ తర్వాత గర్వాల్ డివిజన్ కమిషనర్ ఈ కమిటీకి ఛైర్మన్ నేతృత్వంలో ఒక త్రిసభ్య విచారణ కమిటీని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఈ కమిటీ తన విచారణ అంశాలను, సిఫారసులను 15 రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కేసును రాష్ట్ర పోలీసు లు, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), బీకేటీసీ శాఖాపర విచారణ కమిటీ, గఢ్వాల్ కమిషనర్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సమాంతరంగా దర్యాప్తు చేస్తున్నాయి. ఈ కమిటీ తన విచారణ అంశాలను, సిఫారసు లను 15 రోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుందని అధికారులు తెలిపారు. దీంతో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. తనపై విధించిన సస్పెన్షన్‌తో పాటు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను సవాల్ చేస్తూ ప్రమోద్ నౌటియాల్ ఉత్తరాఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ మెహ్రా, బీకేటీసీ నుంచి సమాధానం దాఖలు చేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను జులై 16కు వాయిదా వేశారు.



## అంతరిక్షానికి అనిల్ మీనన్

- ఆయనతోపాటు రష్యా వ్యోమగాములు

**బైకనూర్, జులై 14 :** భారత సంతతికి చెందిన నాసా ఆస్ట్రోనాట్ డాక్టర్ అనిల్ మీనన్ ఈరోజు రాత్రి కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి సోయజ్ ఎంఎస్29 వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరనున్నారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 8:17 గంటలకు ప్రారంభమయ్యే ఈ 8 నెలల యాత్రలో, అంతరిక్షంలో సుదీర్ఘకాలం మానవులు గడిపితే ఎదురయ్యే వైద్యపరమైన సవాళ్లపై పరిశోధనలు చేస్తారు. ఈ పరిశోధనల ఫలితాలు భవిష్యత్తులో చేపట్టబోయే సుదూర అంతరిక్ష యాత్రలకు కీలకం కానున్నాయి.

ఆయనతోపాటు రష్యన్ వ్యోమగాములు కూడా పాల్గొంటున్నారు.

## బెంగాల్‌లో తీవ్ర విషాదం

**9 మంది మత్స్యకారులు మృతి**

**కలకత్తా, జులై 14 (ఏ.ఎం.ఎస్):** పశ్చిమ బెంగాల్‌లోని సుందర్బన్ పరిధిలో బంగాళాఖాతంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల పడవ జూలై 4న మునిగిపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పు మిడ్నాపూర్ జిల్లా దిఘా హార్బర్ నుంచి జూలై 2న 15 మందితో బయలుదేరిన ఈ బోటు.. ప్రతికూల వాతావరణం, అలల ఉధృతి కారణంగా బక్కాలి కోస్ట్ వద్ద మునిగిపోయింది

. రెస్క్యూ బృందాల గాలింపులో ఒడిశా, బెంగాల్‌కు చెందిన 9 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన మరో ఆరుగురి కోసం రెస్క్యూ బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి.

## అందరికీ ఒకటే రూల్

- బనకచర్లపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు తిరస్కరణ

**న్యూఢిల్లీ, జులై 14 (ఏ.ఎం.ఎస్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిర్మిస్తోన్న పోలవరం -బనకచర్ల(నల్లమల్లసాగర్) ప్రాజెక్ట్ ను అడ్డుకోవాలని దాఖలు చేసిన పిటిషన్ లో అన్ని లోపాలు సరిదిద్దాకే ముందుకెళ్తామని సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ విషయంలో గతంలో కోర్టు పేర్కొన్న అవసరమైన అన్ని షరతులు పూర్తి చేయాలని సూచించింది. బనకచర్ల ప్రాజెక్ట్ పై ఏపీ ప్రభుత్వాన్ని నిలుపుదల చేసేలా ఇంజెక్షన్ ఆదేశాలు ఇవ్వాలని ఈ ఏడాది మార్చిలో తెలంగాణ ప్రభుత్వం తొలిసారి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ రిట్ పిటిషన్ లో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ), గోదావరి, కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డులు, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఇలా మొత్తం 13 మందిని ప్రతివాదులుగా చేసింది. అయితే ఈ పిటిషన్ లో పలు లోపాలు ఉన్నాయని పేర్కొంటూ కోర్టు ప్రాథమిక దశలోనే విచారణను తిరస్కరించింది. అంతేకాక ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదనీ, దీనిపై ఒరిజినల్ సూట్ వేసుకోవాలని స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సైతం రిట్ పిటిషన్ ను ఉపసంహరించుకుంది. కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సుమంత్ నూకల మధ్యంతర పిటిషన్ (ఐఏ) దాఖలు చేసింది. ఈ ఐఏపై జస్టిస్ ఎన్.వి అంజరియ(ఛాంబర్



బెంచ్) మే 22న ఛాంబర్ కోర్టులో విచారణ జరిపింది. ఈ సందర్భంగా రీ-ఫైలింగ్ లో జరిగిన జాప్యాన్ని మన్నిస్తూనే, ఐఏను అనుమతించింది. దీని ఆధారంగా ఒరిజినల్ సూట్ ను కోర్టు వెకేషన్ తర్వాత రెగ్యులర్ బెంచ్ విచారించనుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఒరిజినల్ సూట్ ను సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, గోపాల శంకర్ నారాయణ, తెలంగాణ అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిలు హాజరయ్యారు.

తొలుత ధర్మాసనం జోక్యం చేసుకొని ఈ పిటిషన్ ను జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడించింది. ఈ సూట్ కు సంబంధించి పలు ప్రక్రియలను పిటిషనర్ పూర్తి చేయాల్సి ఉందనీ, అందువల్ల ప్రస్తుతం కేసు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. మధ్యలో తెలంగాణ తరపు అడ్వొకేట్లు సింఘ్వీ, నారాయణ జోక్యం చేసుకొని, గత ఆదేశాల్లో కేవలం నాలుగు లైన్ల ఉత్తర్వులు పేర్కొందని, ఈ విషయంలో విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. మరోసారి జస్టిస్ విక్రమ్ నాథ్ స్పందిస్తూ... తాము కోర్టు రూల్స్ (నిబంధనల) ప్రకారమే ముందుకెళ్తామని స్పష్టం చేశారు. శంకర్ నారాయణ అభ్యర్థిస్తూ మొత్తం 15 మందిని ప్రతివాదులుగా చేర్చినట్టు కోర్టు దృష్టికి తెచ్చారు. బనకచర్లపై ఏపీ ప్రభుత్వం ముందుకెళ్లకుండా ఆ రాష్ట్రానికి మాత్రమే ఇంజక్షన్ ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నట్టు నివేదించారు. ధర్మాసనం మాత్రం ఈ అభ్యర్థనను తోసిపుచ్చింది. 'అందరికీ ఒకటే రూల్' అని పేర్కొంటూ... ఈ సూట్ విచారణపై నిబంధనల ప్రకారం రావాల్సిందే అని తేల్చి చెప్పింది. అవసరమైన అన్ని షరతులు పూర్తి చేసిన తర్వాతే ఈ పిటిషన్ ను తిరిగి విచారణకు తీసుకుంటామని జస్టిస్ విక్రమ్ నాథ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా... ఈ పిటిషన్ మరోసారి ఈ నెల 27న కోర్టు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

## 20 శాతం ఫీజు కట్టాల్సిందే

- ఇరాన్‌వి గొంతెమ్మ కోర్కెలు
- హర్మూజ్ జలసంధిపై ట్రంప్ తుంటరి వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జులై 14:** అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జల సంధి మూతపడింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. హర్మూజ్‌ను తమ అధీనంలోకి తీసుకుంటామని, సరకు రవాణా నౌకలకు 20 శాతం ఫీజు వసూలు చేస్తాం ప్రకటించారు. అయితే, ఈ ప్రకటన చేసిన కొద్దిసేపటికే అమెరికా తమపై సైనిక దాడుల కారణంగా తాము ఈ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించడం గమనార్హం. సోమవారం ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్ కార్యక్రమంలోఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. 'మేము హర్మూజ్ జల సంధిని స్వాధీనం చేసుకుంటాం.. వారి వద్ద (ఇరాన్) ఇప్పుడు ఏమీ లేదు' అని అన్నారు. అంతేకాదు, 47 ఏళ్ల కిందటే ఇరాన్ ముప్పు సమస్యను అమెరికా పరిష్కరించాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాతో ఇరాన్ నాయకులు 11 గంటల పాటు జరిపిన చర్చల్లో పాల్గొన్నారని, ఆ సమయంలో అన్ని అంశాలపై అంగీకారం కుదిరిందని ట్రంప్ చెప్పారు. కానీ, తర్వాతే ఇరాన్ కొన్ని మార్పులు చేయాలని కోరడం మొదలుపెట్టిందని అమెరికా అధ్యక్షుడు అన్నారు. "హర్మూజ్ జలసంధిని మా అధీనంలోనే ఉంచుకోబోతున్నాం... బహుశా మేమే దాన్ని నిర్వహిస్తాం.. మేము ఈ జలసంధికి రక్షకుడిగా మారుతాం.. దీనికి మాకు తగిన పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.. కార్గో నౌకలకు 20 శాతం ఫీజు వసూలు చేస్తాం.. మా ప్రజలను ప్రమాదంలోకి నెట్టినందుకు మాకు పరిహారం కావాలి'' అని ఆయన అన్నారు.



ఇప్పటివరకు ఎటువంటి ప్రతిఫలం లేకుండానే ఈ జలసంధిని అమెరికా కాపాడుతూ వచ్చిందని, అయితే ఇకపై ఈ పరిస్థితి మారుతుందన్నారు. ముందు ముందు ఈ ఏర్పాట్లకు ధనిక దేశాలు డబ్బు చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. "హర్మూజ్ జలసంధిని రక్షించినందుకు మాకు డబ్బులు అందుతాయి.. చాలా పెద్ద మొత్తంలో వస్తుంది. మేము కేవలం వీటన్నింటికీ, మా సైనికులను ప్రమాదంలో పడేసినందుకు గానూ తిరిగి పొందాలని కోరుకుంటున్నాం'' అని ట్రంప్ చెప్పారు. అలాగే, అమెరికాతో జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ ఘోరంగా దెబ్బతింటుందని అన్నారు. ఇప్పటికే దాని నేవీ, ఎయిర్‌ఫోర్స్, క్షిపణి సామర్థ్యాలు దాదాపుగా తుడిచిపెట్టుకుపోయాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా దాడులలో మరణించిన

**అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జల సంధి మూతపడింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. హర్మూజ్‌ను తమ అధీనంలోకి తీసుకుంటామని, సరకు రవాణా నౌకలకు 20 శాతం ఫీజు వసూలు చేస్తాం ప్రకటించారు. అయితే, ఈ ప్రకటన చేసిన కొద్దిసేపటికే అమెరికా తమపై సైనిక దాడుల కారణంగా తాము ఈ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించడం గమనార్హం. సోమవారం ఫాక్స్ అండ్ ఫ్రెండ్స్ కార్యక్రమంలోఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. 'మేము హర్మూజ్ జల సంధిని స్వాధీనం చేసుకుంటాం**

ట్టు ప్రచారం జరుగుతోన్న పలువురుఇరాన్ నాయకుల పేర్లను కూడా వెల్లడించారు. ఇరాన్‌తో కాల్పుల విరమణ ముగిసినట్టు ట్రంప్ గతవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇరాన్‌పై అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా, అమెరికా చర్యలకు ప్రతిస్పందనగా హర్మూజ్ జలసంధిని మూసివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. జలసంధిలో నౌకల రాకపోకలు నిలిచిపోయాయని, పరిస్థితులు చక్కబడిన వెంటనే ముందస్తు షెడ్యూల్ ప్రకారం అన్ని దరఖాస్తులను సమీక్షించి, అనుమతుల జారీ ప్రక్రియను తిరిగి ప్రారంభిస్తాం.. ఈ అనుమతి పొందడానికి మా వెబ్‌సైట్ మాత్రమే ఏకైక మార్గమని గుర్తుంచుకోవాలి.. నిరంతర సమాచారం కోసం మా ఎక్స్ (ట్విట్టర్) ఖాతాను అనుసరించండి... మీ ఓర్పు, సహకారానికి ధన్యవాదాలు''అని ఇరాన్ పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిన్ అథారిటీ (పీజీఎస్ఏ) తెలిపింది.



## దేశీయ మార్కెట్లలో కుదుపు

- భగ్గుమన్న ముడి చమురు ధరలు
- ట్రంప్ వ్యాఖ్యల ప్రభావం

**న్యూఢిల్లీ, జులై 14 (ఏ.ఎం.ఎస్):** హోర్మోజ్ జలసంధిలో పెరుగుతున్న దాడులు, పశ్చిమాసియా తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అస్థిరత దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్మోజ్ జలసంధిని దిగ్బంధిస్తున్నామని, అక్కడ టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఈ పరిణామాలు భారతీయ మార్కెట్లను తీవ్ర ప్రతికూలతల్లోకి నెట్టడంతో మంగళవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుండే సూచీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి.

ఈ అంతర్జాతీయ భయాందోళనల నేపథ్యంలో.. మంగళవారం ఉదయం మార్కెట్ల ప్రారంభ సమయానికి బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ సెన్సెక్స్ 412 పాయింట్లు కుప్పకూలి 77,203 వద్ద ట్రేడవుతోంది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ కూడా 107 పాయింట్లు నష్టపోయి 24,103 వద్ద కదలాడుతోంది. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశీయ రంగాలైన పెయింట్స్, ఏవియేషన్, టైర్స్ మరియు ఆటోమొబైల్ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

## అమెరికా, ఇరాన్ ప్రతిదాడులు

***భారతీయుడు మృతి**

**టెహ్రాన్, జులై 14:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

అమెరికా, ఇరాన్‌లు మళ్లీ దాడులు, ప్రతిదాడులకు పాల్పడుతున్నాయి. ఇరాన్ నౌకాశ్రయాలే లక్ష్యంగా అమెరికా దాడులు చేయగా, హర్మూజ్ జలసంధిలో రెండు యూఏఈ ట్యాంకర్లపై ఇరాన్ దాడులు చేసింది.

ఈ దాడుల్లో ఓ భారతీయుడు మృతి చెందగా, మరో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్‌వాసులు గాయపడ్డారు. ఈనేపథ్యంలో హర్మూజ్‌లో నౌకల రాకపోకలను నిర్బంధిస్తున్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారులు వెల్లడించారు.

## చైనాలో ఈదురుగాలుల బీభత్సం

- సురక్షిత ప్రాంతాలకు 2.6 లక్షల మంది

**బీజింగ్, జులై 14:** టైఫూన్ 'బావి' ప్రభావంతో ఈశాన్య చైనాలోని పలు ప్రాంతాలు తీవ్ర వర్షాలు, బలమైన ఈదురుగాలులతో అతలాకుతలమవుతున్నాయి. ముఖ్యంగా లియావోనింగ్ ప్రావిన్స్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రమాదం దృష్ట్యా సుమారు 2.6 లక్షల మందిని ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు ప్రాంతాల్లో రవాణా సేవలకు అంతరాయం ఏర్పడగా, సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



## ఇరాన్ మాజీ అధ్యక్షుడికే 'మొస్సాద్' ఎర..

**ఇరాన్ :** వద్ద అణ్వాయుధాలు ఉండకుండా చూడటమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ పదే పదే చెబుతున్నా.. టెహ్రాన్‌ను రాజకీయంగా, సైనిక సామర్థ్యాల పరంగా అణచివేయడమే ఆ దేశం అసలు ఉద్దేశంగా కన్పిస్తోంది. ఇందుకు సంబంధించి తాజాగా ఓ సంచలన కథనం వెలుగులోకి వచ్చింది. ఇరాన్‌లో ప్రస్తుత ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఇజ్రాయెల్ (Israel) నిఘా సంస్థ మొస్సాద్ కొన్నేళ్లుగా పక్కా ప్రణాళిక రచించిందని దాని సారాంశం. ఇందుకోసం ఇరాన్ మాజీ అధ్యక్షుడు అహ్మదీనెజాద్ )కు ఎర వేసి తమవైపు లాక్కోవాలని చూసిందట..! ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ )పై ఇజ్రాయెల్‌అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో నెజాద్ నివాసం ఉంటున్న కాంపౌండ్‌పైనా బాంబులు పడ్డాయి. ఆ ఘటన నుంచి మాజీ అధ్యక్షుడు సురక్షితంగా బయటపడ్డారు. నాడు ఓ కారు సినిమాటిక్ తరహాలో నెజాద్‌ను ఆ భవనం నుంచి కాపాడి ఓ రహస్య ప్రాంతానికి తీసుకెళ్లింది. ఆయనను కాపాడిన వారు మొస్సాద్ గ్రూప్ సభ్యులై ఉంటారని ఇరాన్ అధికారిక వర్గాలు అనుమానించాయి. అప్పటి నుంచి ఆయనపై నిఘా పెట్టాయని న్యూయార్క్ టైమ్స్ తమ కథనంలో వెల్లడించింది.నెజాద్‌ను తమకు అనుకూలంగా మలచుకునేందుకు ఇజ్రాయెల్ కొన్నేళ్లు నుంచి విపరీతంగా ప్రయత్నించినట్లు తెలిసింది. 2023లో ఆయన గ్వాటెమాలా పర్యటనకు వెళ్లినప్పుడు తొలిసారి మొస్సాద్ సభ్యులతో సమావేశమైనట్లు సమాచారం. ఆ తర్వాత 2024లో హంగేరీలోని ఓ యూనివర్సిటీ కార్యక్రమానికి నెజాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాడు అక్కడి ప్రభుత్వ సూచన మేరకు విశ్వవిద్యాలయం ఆయనను ఆహ్వానించాల్సి వచ్చిందట. పేరుకే అది వర్సిటీ ఈవెంట్. ఆ పర్యటనలో నాటి మొస్సాద్ చీఫ్ డేవిడ్ బార్నియాతో ఇరాన్ మాజీ అధ్యక్షుడు రహస్యంగా భేటీ అయ్యారు. అప్పటి నుంచి ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ వర్గాలతో ఆయన సంప్రదింపులు జరుపుతూనే ఉన్నట్లు తెలిసింది. ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభం కావడానికి ఐదు రోజుల ముందు కూడా హంగేరీలో పర్యటించారు. ఆ సమయంలోనూ మొస్సాద్ ప్రతినిధులతో ఆయన భేటీ అయినట్లు సమాచారం. విదేశీ పర్యటనల్లో నెజాద్ కొన్ని గంటల పాటు భద్రతా సిబ్బందికి కూడా కన్పించకుండా అదృశ్యమయ్యేవారని ఇరాన్ అధికారిక వర్గాలు తెలిపాయి.ఇరాన్‌లో ప్రస్తుత ప్రభుత్వాన్ని కూల్చి.. తమకు అనుకూలురైన నెజాద్‌కు అధికారం కల్పించేలా ఇజ్రాయెల్ ఈ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఈ విషయంలో నెజాద్‌మొస్సాద్ మధ్య విభేదాలు వచ్చాయట.

అంతేగాక, దాడుల సమయంలో తనను కాపాడేందుకు ఇజ్రాయెల్ చేసిన ఆపరేషన్‌పైనా ఇరాన్ మాజీ అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.




# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

**ఎంఈఓకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వినతి**

**– జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని డిమాండ్**

**భద్రాచలం టౌన్ 14/7/26 వుదయం ప్రతినిధి**

అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భద్రాచలం డివిజన్ కమిటీ, భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి టి. రమాదేవిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భద్రాచలం పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్, డివిజన్ ప్రింట్ మీడియా అధ్యక్షులు భూక్యా రంజిత్ నాయక్, డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎల్. శ్రీహరి కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు మీడియా వెన్నెముకలాంటి వ్యవస్థ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఎన్నికలు, ప్రజా ఉద్యమాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సమస్యలు వంటి ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా ప్రజలకు తెలియజేయడంలో జర్నలిస్టులు నిరంతరం సేవలందిస్తున్నారని అన్నారు.వార్తల సేకరణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తూ, ఎండా వానా అనే తేడా లేకుండా ప్రజల మధ్య పనిచేసే జర్నలిస్టుల జీవితం అనేక కష్టనష్టాలతో నిండి ఉంటుందని పేర్కొన్నారు. చాలామంది జర్నలిస్టులు తక్కువ వేతనాలతో, స్థిరమైన ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలల్లో విద్యా ఫీజులు విపరీతంగా పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలతో పాటు జర్నలిస్టుల కుటుంబాలు కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు చదువుకుంటే లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల అనేక మంది జర్నలిస్టులు అప్పులు చేసి పిల్లలకు చదువు చెప్పాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్టుల సమాజానికి అందిస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకుని వారి పిల్లలకు కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించడం ప్రభుత్వ సామాజిక బాధ్యత అని అన్నారు. ఇది దానం కాదు, జర్నలిస్టుల సేవలకు ప్రభుత్వం అందించే గౌరవమని స్పష్టం చేశారు.కరోనా మహమ్మారి సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమైన పరిస్థితుల్లో కూడా జర్నలిస్టులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ప్రతి సమాచారాన్ని చేరవేశారని గుర్తు చేశారు.ఆ సమయంలో అనేక మంది జర్నలిస్టులు వైరస్ బారిన పడగా, కొందరు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. అలాంటి సేవలను ప్రభుత్వం గుర్తించి జర్నలిస్టుల కుటుంబాలకు విద్య, వైద్యం, బీమా వంటి రంగాల్లో ప్రత్యేక రాయితీలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఇతర రాష్ట్రాల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలవుతున్న పథకాలను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రత్యేక సంక్షేమ విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా ఫీజు రాయితీతో పాటు స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం, వసతి సదుపాయాలు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.జర్నలిస్టుల సంక్షేమాన్ని కేవలం హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులకే పరిమితం చేయకుండా వారి కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక సంక్షేమ చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలు ఆర్థిక కారణాలతో చదువును మధ్యలో నిలిపివేయాల్సిన పరిస్థితి రాకూడదని,అందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని సూచించారు.విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు అని, జర్నలిస్టుల పిల్లలు కూడా నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందించాలని పేర్కొన్నారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించాలంటే జర్నలిస్టుల కుటుంబాల వంటి సేవారంగాలకు చెందిన వర్గాలకు ప్రత్యేక రాయితీలు అవసరమని తెలిపారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మండల విద్యాశాఖ అధికారి టి. రమాదేవి మాట్లాడుతూ జర్నలిస్టుల సమర్పించిన వినతిని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి సాధ్యమైన మేరకు చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు ప్రభుత్వానికి పలు డిమాండ్లను కూడా వినిపించారు. జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీతో పాటు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, గృహ స్థలాల కేటాయింపు, జర్నలిస్టుల సంక్షేమ నిధి బలోపేతం, వృద్ధాప్య పెన్షన్, కుటుంబ సభ్యులకు విద్యా మరియు వైద్య సహాయం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, అలాంటి వ్యవస్థలో పనిచేసే జర్నలిస్టుల సంక్షేమం బలోపేతం కావడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల కుటుంబాల సంక్షేమం అంటే భావి తరాల విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడేనని అన్నారు.చివరగా ప్రభుత్వం తమ వినతిపై సానుకూల నిర్ణయం తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో అక్రిడిటేషన్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ కార్యదర్శి జె. జయరాం, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు కాట సత్యం, సహాయ కార్యదర్శి బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు మదార్, పట్టణ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. ప్రేమ్ కుమార్, కోశాధికారి వి. నాయుడు, సభ్యులు ఆర్. వెంకట్, పి. నాగేంద్ర బాబు, ఎం. సాయి కుమార్. తదితరులు పాల్గొన్నారు.



# భూసేకరణ -ఎస్ఐఆర్‌కు వేగం...

## విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం: కలెక్టర్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 14 (వుదయం ప్రతినిధి)**



భూసేకరణ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, క్రీడలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన తిప్పనపల్లి, మద్దుకూరు గ్రామాలతో పాటు చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వివిధ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా తిప్పనపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిధిలో మొత్తం 70 ఎకరాల భూమికి సర్వే చేపట్టాల్సి ఉండగా, ప్రతిరోజూ సుమారు 15 ఎకరాల మేర సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. మిగిలిన సర్వేను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి నిర్ణీత గడువులో ముగించాలని ఆదేశించారు. భూ యజమానుల వివరాలతో పాటు బోర్లు, సాగులో ఉన్న పంటలు, ఆయిల్‌పామ్ తోటలు, ఇతర శాశ్వత ఆస్తుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.అనంతరం మద్దుకూరు గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, డిజిటలైజేషన్, రికార్డుల నిర్వహణపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు 65 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారులు తెలపగా, మిగిలిన ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితత్వంతో డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని అన్నారు.తదుపరి చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సాంబార్ పలుచగా ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, యూనిఫాంల పంపిణీపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో అశోక్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోచంపల్లి మున్సిపాలిటీలో EV పారిశుధ్య వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా, తేదీ:14/07/2026.**



పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో మున్సిపాలిటీ ఆవరణలో రెండు నూతన పారిశుధ్య వాహనాలను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పారిశుధ్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ రెండు పారిశుధ్య వాహనాల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగి, పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందనున్నాయని ఎమ్మెల్యే గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని– శ్రీనివాస్ ,కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి- కలెక్టర్

**హనుమకొండ, జూలై 14 వుదయం జిల్లా ప్రతినిధి) :**



విద్యార్థులు విద్యా ప్రమాణాలతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) ప్రాంగణంలోని ప్రభుత్వ క్రీడా పాఠశాల, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ తీసుకున్న ముఖ్య నిర్ణయాలు, సూచనలు చేశారు.విద్యా ప్రమాణాల పరిశీలన,పాఠశాల విద్యార్థులను ఆంగ్ల, తెలుగు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. జాతీయ జెండా విశిష్టతపై విద్యార్థులు ఇచ్చిన సమాధానాలను అభినందించి, వారికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. వసతుల తనిఖీ, విద్యార్థుల వసతి గృహాలు, తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, వసతిలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డిని ఆదేశించారు. జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో రూ.70 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్ మరమ్మతులు: స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్ పనులను పరిశీలించి, మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా, సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ప్రశాంత్, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ మాధవి, రవికుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20వ తేదీలోగా ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తి చేయాలి: ఎన్నికల అధికారి, కలెక్టర్

**భూపాలపల్లి జులై 14 (వుదయం విలేకరి)**



ఈ నెల 20వ తేదీలోగా ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.మంగళవారం ఘన్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా 306 పోలింగ్ కేంద్రంలో పరిధిలో బీఎల్ఓ గీత నిర్వహిస్తున్న నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తూ, రోజువారీ నమోదు వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు.

మిగిలిన నమోదు ప్రక్రియను రానున్న ఐదు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను ఎన్నికల సంఘం యాప్ ద్వారా సులభంగా ఓటరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు ఎన్యూమరేషన్ నమోదు ఫారాలను పూర్తి చేయడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ఓల సహాయం పొందవచ్చని స్పష్టం చేశారు. ఓటరు జాబితా పారదర్శకత కోసం మరణించిన వారు, వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం జాబితా నుండి తొలగించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అత్యంత బాధ్యతాయుతమైన ప్రక్రియ అని, గడువులోగా వంద శాతం పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , పశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణను విజయవంతం చేయాలి— కలెక్టర్

**అపోహలు నమ్మవద్దు..**

**ముందస్తు నోటీసు లేకుండా ఓటు తొలగింపు ఉండదు**



**ములుగు, జూలై 14 (వుదయం ప్రతినిధి):**

ములుగు జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నిర్ణీత గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.మొత్తం ఓటర్లు: 2,36,970డిజిటలైజ్ అయిన ఫారాలు: 1,46,583 (61.86%)పెండింగ్ ఉన్న ఫారాలు: 82,994 (38.14%)కలెక్టర్ ముఖ్య సూచనలు: బీఎల్ఓల బాధ్యత: ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలి. ఇళ్లకు తాళాలు వేసి ఉంటే మరోసారి వెళ్లి వివరాలు సేకరించాలి.ఆలస్యం లేకుండా నమోదు: సేకరించిన ఫారాలను రోజువారీగా 'బీఎల్ఓ యాప్'లో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలి.సహకారం అందించాలి: ప్రజలు తమ వివరాలను సరిచూసుకుని, పూర్తి చేసిన ఫారాలను అవసరమైన పత్రాలతో సహా బీఎల్ఓలకు అందించాలి. ముసాయిదా ఓటరు జాబితాలో పేరున్న ఏ ఓటరునూ ముందస్తు నోటీసు లేకుండా తొలగించే అవకాశం లేదు. కాబట్టి ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, కేవలం ఎన్నికల సంఘం జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# మండల అధికారులు ఎస్ఐఆర్ 'ప్రక్రియపై అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు:

## 'వరంగల్ ఆర్డీవో సుమ హెచ్చరిక

**పర్వతగిరి, జులై 14 ( వుదయం ప్రతినిధి ) :**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్' (యస్ ఐ ఆర్ ) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ ఆర్డీవో (రెవెన్యూ డివిజనల్ అధికారిణి) సుమ మండల అధికారులకు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు అని మండల అధికారులు ప్రతి రోజు ప్రతి రోజు ప్రతి గ్రామంలో బిఎల్ఒ లతో ఎస్ ఐ ఆర్ సక్రమంగా పూర్తి చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్నారం షరీఫ్,అన్నారం పెద్ద తండా,కోంకపాక గ్రామాల్లో నిర్వహిస్తున్న 'సర్' డేటా డిజిటలైజేషన్ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ టీ.వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్‌లతో కలిసి రికార్డులను, ఓటరు నమోదు మార్పులు చేర్పులు తొలగింపు సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీవో సుమ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలతో పోలిస్తే పర్వతగిరి మండలంలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత నత్తనడకన సాగడంపై తీవ్ర అసంతృప్తి గ్రామ స్థాయి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మందగించడంపై అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓటర్లు ఫారాలను నింపి అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.ఎన్యూమరేషన్ ఫారాల్లో పేర్లు ఇతర వివరాలు నమోదు చేయడంలో బీవోలు, బిఎల్ఎలు ఓటర్లకు సహకరించాలని సూచించారు. తహసీల్దార్, ఎంపీడీవోలు ప్రతిరోజూ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, సిబ్బందిని సమన్వయం చేసుకొని పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హరిత,ఎపియం రాజిర్,కార్యదర్శి రఘు,స్థానిక ఉప సర్పంచ్ అనిత,బిఎల్వోలు,బిఎల్ఎలు మేడిశెట్టి కరుణాకర్, స్వప్న, అనిత, నర్మద,కందికట్ల అనిల్, బోట్ల మధు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ పుత్రికకు సర్వోత్తమ్ రెడ్డి చేయూత

**సూర్యాపేట జులై 14, వుదయం ప్రతినిధి**



ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు" అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో, యాస శృతి సౌజన్యంతో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నూతనకల్ లో 10వ తరగతి చదువుతున్న సరస్వతీ పుత్రిక సప్పిడి నందిని కి 10,000 రూపాయల ఆర్థిక సాయం ను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు."ప్రతిభ ఉన్న విద్యార్థులకు మా అండ" – సర్వోత్తమ్ రెడ్డిఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, చదువులో రాణిస్తున్న, అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించడం అభినందనీయం అన్నారు. "ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి. సమాజానికి ఉపయోగపడే పౌరులుగా రూపుదిద్దుకోవాలి" అని నందిని ఆశీర్వదించారు. విద్య, వైద్యం, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న అక్షర ఫౌండేషన్ కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్ కుమార్ రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాసు, సుభాష్ చంద్రబోస్, బత్తిని ఉపేందర్, కాసర్ల సైదులు, గడ్డం వీరబాబు, ధరావత్ వీరాసింగ్, గంగాధర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యం - కలెక్టర్

**జఫర్‌గఢ్ కేజీబీవీ, కొడకండ్ల సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**అన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం..**

**ప్రతి 15 రోజులకు మాక్ టెస్ట్‌కేజీబీవీల్లో డైనింగ్ టేబుళ్లు, క్రీడా సౌకర్యాల ఏర్పాటుకు ఆదేశం**

**జనగామ, జూలై 14 వుదయం ప్రతినిధి) :**



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లాలోని జఫర్‌గఢ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని, కొడకండ్ల మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న విద్యాబోధన, వసతులను పరిశీలించారు. తిమ్మాంపేట గ్రామంలో నిర్మిస్తున్న 'యాంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' భవన నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులు ప్రారంభంవిద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు వీలుగా రూపొందించిన 'అన్ అకాడమీ' ఆన్‌లైన్ తరగతులను కలెక్టర్ ఈ సందర్భంగా ప్రారంభించారు. గణిత పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతిరోజూ కనీసం రెండు గంటలు ఈ ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్వహించే మాక్ టెస్టుల ద్వారా విద్యార్థుల ప్రతిభను అంచనా వేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.'ఫాస్ట్ మ్యాథ్స్', 'GET IT WRITE' పుస్తకాల ఆవిష్కరణగణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించేలా రూపొందించిన 'ఫాస్ట్ మ్యాథ్స్', 'GET IT WRITE' పుస్తకాలను కలెక్టర్ విద్యార్థినులకు అందజేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను స్వయంగా పరీక్షించేందుకు కొడకండ్ల పాఠశాలలో కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా బ్లాక్‌బోర్డ్‌పై గణిత సమస్యను ఇచ్చి పరీక్షించారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందేశం:"చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదవాలి. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి."వసతుల పరిశీలన – కఠిన ఆదేశాలుపాఠశాలల్లోని వంట గదులు, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత, డైట్ చార్జీల అమలుపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినులు సౌకర్యవంతంగా కూర్చుని భోజనం చేసేందుకు ప్రతి కేజీబీవీలో తక్షణమే డైనింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్లను నిరంతరం పర్యవేక్షించాలని, గ్రామీణ ప్రాంత కేజీబీవీలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు క్రమం తప్పకుండా సందర్శించాలని స్పష్టం చేశారు. అలాగే, విద్యార్థినుల దినచర్యలో విద్యతో పాటు క్రీడలు కూడా భాగం కావాలని, ఇందుకోసం ప్రతి కేజీబీవీలో బాస్కెట్ బాల్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమాల్లో విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పనులను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలి: కలెక్టర్

**పెద్దపల్లి, జూలై-14 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో డీఎంఎఫ్‌టీ (DMFT), సీఎస్ఆర్ (CSR) నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ప్రాజెక్టర్ ద్వారా పనుల పురోగతిని పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కలెక్టరేట్ నుంచి డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులతో మంజూరైన గ్రామీణ అభివృద్ధి పనులన్నింటినీ ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడైనా క్రిటికల్ గ్యాప్స్ ఉన్నట్లయితే వెంటనే గుర్తించి సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.అంగన్‌వాడీ భవనాల మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, చిన్నారులకు సురక్షితమైన, మెరుగైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయండి :కలెక్టర్



**కరీంనగర్ జులై 14 (వుదయం ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ లో నిర్మించే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను చిన్న చిన్న భాగాలుగా విభజించి పూర్తిచేయాలని సూచించారు. నిర్మాణ పరిసరాలను కలియ తిరుగుతూ సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు అర్థమయ్యేలా బోధించండి

**రాజన్న సిరిసిల్ల, జూలై 14 {వుదయం ప్రతినిధి}:**

**నిత్యజీవిత పదాలతో అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి..కలెక్టర్**



విద్యార్థులకు భాష సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, వారు రోజువారీ జీవితంలో ఉపయోగించే పదాల ద్వారా అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌సర్వీస్ టీచర్ ట్రైనింగ్‌లో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థంగా అమలు చేయాలని ఆమె అన్నారు. ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న హిందీ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి శిక్షణా తరగతిలో కూర్చుని బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి శిక్షణ ద్వారా పొందుతున్న అనుభవాలు, బోధనలో అనుసరించాల్సిన విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి కేంద్రంగా బోధన సాగాలని, రంగురంగుల బోధన సామగ్రి (టీ.ఎల్.ఎం.) వినియోగిస్తూ కృత్యాధారిత పద్ధతిలో పాఠాలు చెప్పాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రోజువారీ జీవితంలో వినియోగించే పదాలు, అంకెలు, పండ్లు, వస్తువుల పేర్లు వంటి అంశాలను సులభంగా నేర్చుకునేలా బోధించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆసక్తిగా పాఠశాలకు వచ్చేలా బోధన ఉండాలని, ఇంగ్లీష్, గణితం తదితర అంశాల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.జిల్లాలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక స్థాయి ఎంఆర్‌పీలకు తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య, తహసీల్దార్ మహేష్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికల్లో యూరియా విక్రయాలు

**ఆదిలాబాద్, జూలై 14 (వుదయం ప్రతినిధి) :**

**15 మండలాల్లో తొలి విడతగా కేంద్రాల ఏర్పాటు**

**మహిళా సంఘాల ఆదాయానికి కొత్త మార్గం**



జిల్లాలో రైతులకు ఎరువులు సకాలంలో అందించడంతో పాటు గ్రామీణ మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా రైతు వేదికల ద్వారా స్వయం సహాయక బృందాలతో యూరియా విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎరువుల పంపిణీ, ఆయిల్ పామ్ సాగు, ఇతర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.మొదటి విడతలో భీంపూర్, ఆదిలాబాద్ రూరల్, తాంసి, ఇచ్చోడ, బోరజ్, జైనత్, గుడిహత్నూర్, మావల, తలమడుగు తదితర 15 మండలాల రైతు వేదికల్లో యూరియా విక్రయ కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు ఆరు నెలల తాత్కాలిక లైసెన్సులు జారీ చేసి, భవిష్యత్తులో విత్తనాలు, క్రిమిసంహారక మందుల విక్రయాలకు కూడా అనుమతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎఫ్ఓఎఫ్ఓ విధానం రద్దు నేపథ్యంలో రవాణా భారం మహిళా సంఘాలపై పడకుండా స్థానిక మార్కెట్ ధరలకు అనుగుణంగా రవాణా ఖర్చులు వసూలు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల కొనుగోలుకు సంఘాల నిధులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం తాత్కాలికంగా ప్రారంభమయ్యే కేంద్రాలను 6–7 నెలల్లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించే శాశ్వత వి.ఓ భవనాలు, గోదాముల్లోకి మార్చనున్నట్లు తెలిపారు. విక్రయాలు, నిల్వలవివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని హెచ్చరించారు. 12 నెలల నీటి వసతి ఉన్న రైతులకు ఆయిల్ పామ్, నిమ్మ, మామిడి తోటల పెంపకానికి 40–50 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నామని, ఆయిల్ పామ్ డ్రిప్‌కు ఎకరానికి రూ.22,800, నిర్వహణ కోసం నాలుగేళ్లపాటు ఏటా రూ.4,200 చొప్పున ప్రోత్సాహకం ఇస్తామని తెలిపారు.కేజీబీవీ విద్యార్థులకు జూలై 15లోగా, ఇతర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జూలై 30 లోగా మొదటి జత యూనిఫాంల కుట్టు పని పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, జిల్లాలో ఇంకా పొదుపు సంఘాల్లో చేరని 22 వేల మంది మహిళలను జూలై 31లోగా సంఘాల్లో చేర్చి బ్యాంకు ఖాతాలు తెరవాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీఓ రవీందర్, డీసీఓ సత్యనారాయణ, డీఏఓ రవీందర్, డీహెచ్ఎస్ఓ నర్సయ్య, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారులు, ఎరువుల కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**కామారెడ్డి, జూలై 14 (వుదయం ప్రతినిధి):**



కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మంగళవారం కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, సిబ్బంది రోల్‌కాల్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే ప్రతి బాధితుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు పోలీస్ శాఖపై మరింత విశ్వాసం కలిగేలా ప్రతి అధికారి బాధ్యతగా, జవాబుదారీ తనంతో సేవలు అందించాలని స్పష్టం చేశారు. స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, నాణ్యమైన దర్యాప్తు ప్రమాణాలను పాటిస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీ భద్రతపై ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. స్వాధీనం చేసుకున్న ఆస్తులను చట్టపరమైన నిబంధనల ప్రకారం భద్రపరచాలని, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో పటిష్టమైన వాహన తనిఖీలు, గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్పీ చెప్పారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, లాటరీ మోసాలు, ఫేక్ లింకులు మరియు ఓటీపీ మోసాల పట్ల గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా, అత్యవసర సమయాల్లో డయల్-100 ద్వారా వచ్చే పిలుపులకు అత్యంత వేగంగా స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు తక్షణ సహాయం అందించి భరోసా కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇదే క్రమంలో కామారెడ్డి పట్టణ ట్రాఫిక్ నిర్వహణపై ఎస్పీ ప్రత్యేక సమీక్ష జరిపారు. ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా సమర్థవంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, టౌన్ ఎస్ఐలు, ట్రాఫిక్ ఎస్ఐ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బొగ్గు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక...

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్/జులై 14 (వుదయం ప్రతినిధి)**

**రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి 26 వేల కోట్ల అప్పు ఉంది..**

**సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వం తాత జాగీరా..?**

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



తెలంగాణలో సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ తీవ్రంగా దెబ్బతీశాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. సింగరేణిని కేసీఆర్ కుటుంబం తమ జేబు సంస్థగా మార్చుకుని ఇష్టారాజ్యంగా దోపిడీ చేసిందన్నారు. ఇదే సమయంలో సింగరేణి కార్మికులపై ఆదాయపు పన్ను భారం తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎన్ఆర్ గార్డెన్ లో సింగరేణి భరోసా యాత్ర ముగింపు సభ కొరకు ఏర్పాటు చేసిన సభలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు లతో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సింగరేణి కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, సంస్థ ప్రస్తుతం కష్టనష్టాల్లో ఉందిని, కేసీఆర్ పాలన వల్ల సింగరేణి 15 సంవత్సరాలు వెనుకబడిందన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదన్నారు .దేశంలో ఎక్కడా లేని సమస్యలు సింగరేణిలో ఉన్నాయని తెలిపారు.ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ఒక్కరోజైనా సింగరేణి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించరా?. సింగరేణిని కేసీఆర్ కుటుంబం తమ జేబు సంస్థగా మార్చుకున్నారని దుయ్యబట్టారు. ఇష్టారాజ్యంగా దోపిడీ చేశారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరిస్తోందన్నారు.వాళ్ల తాత జాగీరు అన్నట్లు గత ప్రభుత్వం, తాజా ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయనీ విమర్శించారు. బొగ్గు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, బొగ్గు లేకపోతే దేశం ఒక్కరోజు కూడా ముందుకు సాగదని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో జెన్కోకు రూ.8,958 కోట్ల అప్పు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నరేళ్లలో మరో రూ.26,875 కోట్ల అప్పు చేసిందని తెలిపారు. అప్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని బెదిరించే ధోరణిలో వ్యవహరిస్తోందని విమర్శించారు.కర్ణాటకకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడిందని, ఇది చాలా ప్రమాదకరమని అన్నారు. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ సుమారు 434 మిలియన్ టన్నుల గ్రేడ్–8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, దీనివల్ల సింగరేణికి రూ.1.20 లక్షల కోట్ల టర్నోవర్ వచ్చే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్, బిజెపి సీనియర్ నాయకులు, బిజెపి శ్రేణులు, యూత్ నాయకులు, సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థినికి బంగారు పతకం

**కరీంనగర్ జులై 14 (వుదయం ప్రతినిధి):**




విద్యార్థులకు పోటీతత్వాన్ని అలవర్చానని మరియు వివిధ పోటీలలో పాల్గొనేందుకు ప్రోత్సాహం అందించడం ద్వారా సమాజంలో ఉత్తమ స్థానాలను కైవసం చేసుకోవడంలో ఎటువంటి సందేహం లేదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాఠశాల చెందినటువంటి విద్యార్థినికి రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో బంగారు పతకం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఏర్పాటు చేసినటువంటి అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాల పట్ల విస్తృతమైన అవగాహన కల్పించడం ద్వారా వాటి పట్ల ఆసక్తి పెరుగుతుందని మరియు పోటీలను పాల్గొనడానికి అర్హత సాధిస్తరని వారు చెప్పారు.విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయడంలో ఎస్ఐపి వారు సఫలీకృతులు అయినారని మరియు ఎన్నో కార్యక్రమాల నిర్వహణ ద్వారా వారు నీటికి సమాజంలో ఇతరులకు ఆదర్శంగా ఉన్నారని వారు చెప్పారు.పాఠశాల చెందినటువంటి ఈ.అన్విత, 8వ తరగతి, బంగారు పతకం, ప్రశంసా పత్రం మరియు ట్రోఫీ గెలుచుకున్నదని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశం తెలంగాణ వైపు చూసేలా గోదావరి పుష్కరాలు

**ధర్మపురి, జూలై14 (వుదయం ప్రతినిధి):**

**బాసర నుంచి భద్రాచలం వరకు ముందస్తు ప్రణాళికలు**

**తొలి విడతలో ధర్మపురి, కోటిలింగాలకు రూ.117 కోట్లు మంజూరు**


**మరో రూ.50-60 కోట్ల ప్రతిపాద నలు ప్రభుత్వ పరిశీలనలో..**

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి**



2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో అత్యంత వైభవం గా నిర్వహిస్తామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం మంత్రి అడ్లూరి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌లతో కలిసి ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రా ల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు.పుష్కరాల ఘాట్లు, ఆలయాల పునర్నిర్మాణ పనులను పరిశీలించి,అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లను కేటా యిం చింద న్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన కేబినెట్ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసిన ట్లు వెల్లడించారు.బాసర నుంచి భద్రా చలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన దేవాలయాల పునరుద్ధ రణతో పాటు భక్తులకు కనీస సౌకర్యా ల కల్పన కు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లు,ఆలయాల అభివృ ద్ధి, ఘాట్ల నిర్మాణం,రహదారుల విస్తర ణ కోసం తొలి విడతగా రూ.117 కోట్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపా రు. ఇందులో భాగంగానే ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్ని ర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్న ట్లు పేర్కొన్నారు.ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల అదనపు అభివృద్ధి కోసం మరో రూ.50 నుంచి రూ.60 కోట్ల ప్రతిపాదన లను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వివరించారు.అమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో వంతెన నిర్మాణం ద్వారా సంతోషీమాత ఆల యానికి అనుసంధానం ప్రత్యేక వీఐపీ స్నాన ఘాట్ నిర్మాణం,కోటిలింగాల ఆలయం సమీపంలో డబుల్ రోడ్డు నిర్మాణం,పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీఐపీ, సాధారణ స్నాన ఘాట్లు,ట్రాఫిక్ నిర్వహణ, బైపాస్ రోడ్లు, విద్యుత్, తాగు నీరు, పార్కింగ్, టాయిలెట్ల వంటి మౌలి క వసతులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి తెలిపారు. అధికారులు నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బాసర, కాళేశ్వరం, వేములవాడ, యాదాద్రి, భద్రాచలం వంటి పుణ్యక్షే త్రాలు భారీ నిధులతో అభివృద్ధి చెందుతున్నాయని, పుష్కరాల మహోత్సవాన్ని విజయ వంతం చేసేందుకు ప్రజలం దరూ సహకరిం చాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో అదన పు కలెక్టర్ రాజా గౌడ్,ఆర్డీఓ మధుసూదన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సి పల్ చైర్మన్ నాగలక్ష్మి , దేవస్థానం ఈవోసంకటాల.శ్రీనివాస్, మున్సిపల్ కమిష నర్ శ్రీనివాసరావు తహ శీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధు లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలి: కలెక్టర్



**నిర్మల్ జిల్లా 14 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యాశాఖ పై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ బోధన చేయాలన్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేయాలని చెప్పారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా సులువుగా అర్థమయ్యే విధానాలు అవలంబిస్తూ విద్యా బోధన చేయాలని అన్నారు. వారి నైపుణ్యాలు పెరిగేవిధంగా సామూహిక చర్చల ద్వారా కొత్త విషయాలు నేర్చుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలు అంచనా వేయడానికి వారాల, నెలల వారిగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు పోషకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఉండాలన్నారు. ఇంటికి వెళ్ళిన తర్వాత విద్యార్థులు సబ్జెక్టులు చదువుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరచూ తరగతులకు రాని, చదువు మానేసిన విద్యార్థులను బడులకు తీసుకువచ్చే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు ఏంటో తెలుసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పూర్తిగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటిని వృధా చేస్తే జరిమానా విధింపు: కలెక్టర్

**నిజామాబాద్, జూలై 14 :**



ఎక్కడ కూడా తాగునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 5వేల జరిమానా విధించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటిలభ్యత, భూగర్భ జలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏమేరకు సరిపోతాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నందున, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని ఏమాత్రం వృధా చేయకుండా, భవన నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనాతాగునీటిని వృధాచేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నివాస ప్రాంతాలకు, ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపడుతూ, భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవకా శం ఉన్న చోట ఫాంపాండ్స్, ఇతర వాట ర్ షెడ్నిర్మాణాలు జరిపించాలని సంబం ధిత అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రౌండ్ వాటర్ లెవెల్స్ పడిపోయిన చోట, నీటి వనరుల లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రాధాన్యత క్రమంలో వీటి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.

## జల సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

**ధర్మపురి జులై 14 (వుదయం ప్రతినిధి):**

**ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పిలుపు**

**వర్షపు నీటిని పొదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత**




భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న మూడవ విడత జల సంచయ జన భాగీదారి కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి ప్రతి పౌరుడు భాగ స్వామి కావాలని మున్సి పల్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్మపురి పట్టణ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత అంతా చురుకుగా పాల్గొని వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు పెం పొందించడానికి, నీటి వృథాను నివారించడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని కమిషనర్ సూచించారు. అందులో భాగంగా పట్టణ పరిధిలోని ప్రతి ఇంట్లోనూ వర్షపు నీటి సంరక్షణ ఏర్పాట్లను, ఇంకుడు గుంతలను ఏర్పా టు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మన పరిసరాల్లోని చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందన్నా రు. ప్రతి ఇంటి వద్ద వర్షపునీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జల మట్టం పెరుగుతుందని, ఇది భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. నీటి ప్రతి బొట్టూ అమూల్యమైనదని, ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం జయప్రదం అవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రజా ఉద్యమంలో ప్రతి పౌరుడూ స్వచ్ఛందం గా పాల్గొని నీటి సంరక్షణకు కట్టుబడి ముందుకు రావాలని కోరారు. నీటిని ఆదా చేద్దాం – భావితరాలకు భద్రత కల్పిద్దాం అని కమిషనర్ పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్వేముల.నాగలక్ష్మి , మేనేజర్ గంగాధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ గంగాధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ఎంపీ మల్లు రవి జన్మదిన వేడుకలు

**వెల్దండ, జూలై 14 (వు దయం) :**

నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన కేకును కట్ చేసి తీపి పంచుకొని నిరంతరం ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ఎంపీ మల్లు రవి కి శుభాకాంక్షలు తెలిపారు కార్యకర్తలు. లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీలాల్ నాయక్ మండల పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్, సీనియర్ నాయకులు వర్కట్ రెడ్డి, మల్లు వెంకట గౌడ్, మల్లు రవి అత్యంత సన్నిహితులు కొయ్యల పుల్లయ్య, ఉపసర్పంచ్ శ్రీను, కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, కృపానందం, అంజయ్య, నరసింహ, వెంకటేష్, కిష్టాల్, రంగనాథం, పాల్గొన్నారు

## కొత్తకోటలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ సమీక్ష

**వనపర్తి జూలై 14 (వుదయం ప్రతినిధి)**

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలి దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డిప్రోటోకాల్ ప్రకారం ఆయా శాఖల అధికారులు తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిముఖ్యమంత్రి పర్యటకు ప్రణాళిక ప్రకారం పోలీస్ బందోబస్తు జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డికొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు సమష్టిగా పని చేసి విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి సూచించారు.



కొత్తకోట సంత వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు ఎ.ఎస్.ఎల్ కాన్వాయ్ నిర్వహించిన అనంతరం పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి విద్యాశాఖ పై ఉన్న ప్రత్యేక దృష్టి కారణంగా కేవలం ఒక పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నారని, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ హెలిప్యాడ్ ఏర్పాటు, బారికేడింగ్ బాధ్యతలను ఆర్ అండ్ బి అధికారులకు బాధ్యతలు అప్పగించి దిశానిర్దేశం చేశారు. వేదిక, విద్యార్థులను కూర్చోబెట్టడం జిల్లా విద్యాఅధికారికి బాధ్యతలు అప్పగించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైవ్ కవరేజీ వంటివి చూసుకోవాలని సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలో రాజీ లేకుండా చూసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ కంట్రోల్, వేదిక వద్ద ముఖ్యమంత్రి కార్యక్రమం సజావుగా జరిగే విధంగా పోలీస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కార్యక్రమం ఆసాంతం ప్రశాంతంగా నిర్వహించే విధంగా చూడాలని పోలీస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యాదయ్య కుమార్, ఆర్.డి.ఓ. సెక్యూరిటీ ఇంచార్జి శ్రీధర్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## పోతిరెడ్డిపల్లిలో భక్తిశ్రద్ధలతో చందనోత్సవం

**సంగారెడ్డి వుదయం:**

సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయం లో మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సాహితీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ మీనా రాము ఆధ్వర్యంలో చేపట్టిన 108 అమావాస్యల సేవా కార్యక్రమం లో భాగంగా శ్రీ కేతకి సంగమేశ్వర స్వామివారికి పవిత్ర అభిషేకం, శ్రీ ఆంజనేయ స్వామివారికి చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద మహా యజ్ఞం నిర్వహించి పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు



అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

## ఉర్దూ సీనియర్ జర్నలిస్టుకు ఘన సన్మానం

- ఉమ్రా యాత్రలో నాగర్ కర్నూల్ సంక్షేమం కోసం ప్రార్థించాలి
- షేక్ ఫరీద్ అహ్మద్ ను సన్మానించిన ఎంజే ఏ, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు



**నాగర్ కర్నూల్, జూలై 14 (వుదయం బ్యూరో):**

ముస్లింల పవిత్ర ఉమ్రాయాత్రకు వెళ్తున్న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఉర్దూ దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు అల్హాజ్ షేఖ్ ఫరీద్ అహ్మద్ ను మంగళవారం జిల్లా కేంద్రంలోని మస్జిద్ ఏ మహఫుజ్ బిన్ మహఫుజ్ మస్జిద్ లో ఘనంగా సన్మానించారు. ఉమ్రా యాత్రకు వెళుతున్న సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా ముస్లిం జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటో, వీడియో జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు ఘనంగా శాలువలు పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా పవిత్ర ఉమ్రా యాత్రకు మక్కా మదీనా లకు వెళుతున్న సందర్భంగా దేశంతో పాటు రాష్ట్రంలో ప్రధానంగా నాగర్ కర్నూల్ జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించాలని పలువురు ఆకాంక్షించారు. ఉమ్రా యాత్ర సందర్భంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అల్లాతో ప్రార్థించాలని కోరారు. ఉర్దూ దినపత్రికల సంఘం బాధ్యులు షేఖ్ యాకూబ్ బావజీర్,సీనియర్ జర్నలిస్టులు అహ్మదుల్లా ఖాన్, మహమ్మద్ సాజిద్, అబ్దుల్ హామీద్ ఖాన్, మహమ్మద్ జాకీర్, సయ్యద్ రబ్బానిల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మహమ్మద్ సాదిక్, అబ్దుల్ రహీం, మహమ్మద్ రియాజ్, మహమ్మద్ వసీమ్, మహమ్మద్ సమీర్, మహమ్మద్, మహమ్మద్ నూరుల్ హఖ్ , హాఫీజ్ మొహమ్మద్ ఓవైస్, డెస్క్ జర్నలిస్ట్ డెస్క్ జర్నలిస్ట్ మహమ్మద్ అఫ్రోజ్, మాహమూద్ తదితరులు సీనియర్ జర్నలిస్ట్ షేక్ ఫరీద్ అహ్మద్ ను ఘనంగా సన్మానించారు.

**మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో...**

ఉర్దూ దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్, జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు అల్హాజ్ షేఖ్ ఫరీద్ అహ్మద్ ను మిలాద్ కమిటీ, వక్ఫ్ కాంప్లెక్స్ టేనెంట్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోవక్ఫ్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు నాసర్ మోహియొద్దీన్,మున్సిపల్ కౌన్సిలర్ మొహమ్మద్ నిజామ్,మీలాద్ కమిటీ అధ్యక్షుడు షేఖ్ యాకూబ్ బావాజీర్, సభ్యులు మహమ్మద్ ఇబ్రహీం, మహమ్మద్ సాదిక్ పాషా, టేనెంట్స్ అసోసియేషన్ బాధ్యులు మహమ్మద్ అలీం, సయ్యద్ అహ్మద్ వివిధ ముస్లిం సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు చెప్తే మాకేంటి?.. మా ఇష్టం!'

- బస్సు ఆపమంటే పాలిటెక్నిక్ విద్యార్థులపై డ్రైవర్ 'కండకావరం'
- 'మా ఇష్టం వచ్చినట్లే వెళ్తాం.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ హుంకారాలు
- రోడ్డుపైనే గంటల కొద్దీ విద్యార్థుల పడిగాపులు.. నిమ్మకు నీరెత్తిన గద్వాల ఆర్టీసీ అధికారులు!

**గద్వాల, జూలై 14 (వుదయం బ్యూరో)**

చదువుల తల్లి ఒడికి చేరాల్సిన విద్యార్థులు.. బస్సుల కోసం నడిరోడ్డుపై నరకయాతన అనుభవిస్తున్నారు. క్లాసులకు టైమైపోతోందని ఆవేదనతో బస్సు ఆపమని చేతులెత్తి మొక్కినా.. ఓ ఆర్టీసీ డ్రైవర్ అహంకారం నిలువెల్లా తలకెక్కి ప్రవర్తించాడు. 'కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే మాకేంటి?.. మా ఇష్టం వచ్చినట్లే వెళ్తాం' అంటూ ప్రజా రవాణా వ్యవస్థకే మచ్చ తెచ్చేలా నిర్లక్ష్యపు వీరంగం వేశాడు." గద్వాల మండలం గోనుపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆర్టీసీ సిబ్బంది బరితెగింపునకు ఇది పరాకాష్ట ఇది!

**చదువులు సాగేదెలా?.. నిర్లక్ష్యం శాపమై!**

గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా ప్రతిరోజూ ప్రభుత్వ బస్సులపైనే ఆధారపడి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఈ మార్గంలో నడిచే పలు బస్సులు కళాశాల గేటు వద్ద ఆపకుండానే మొండిగా వెళ్లిపోతున్నాయి. ఫలితంగా విద్యార్థులు గంటల తరబడి ఎండనకా, వాననకా రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. సమయానికి బస్సులు అందక నిత్యం క్లాసులు ఆలస్యమవుతోందని, ప్రాక్టికల్ కోర్సే తున్నామని విద్యార్థులు కన్నీటిపర్యంత మవుతున్నారు.

**ప్రభుత్వ జీతం తింటూ.. ప్రత్యక్ష పెద్దరిక సవాలా?**

తాజాగా, బస్సు ఆపాలని విద్యార్థులు కోరగా డ్రైవర్ బండిని ఆపకుండా పోనిచ్చాడు. దీంతో విసిగిపోయిన విద్యార్థులు.. ఈ నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దానికి సదరు డ్రైవర్ ఏమాత్రం జంకకుండా.. "కలెక్టర్‌కు చెప్తే మాకేంటి? మా ఇష్టం వచ్చినట్లే వెళ్తాం.. ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ అత్యంత ఉద్ధతంగా సమాధానమిచ్చాడు. ప్రజా సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగి, సాక్షాత్తూ జిల్లా పరిపాలనాధికారినే సవాల్ విసరడం గద్వాల జిల్లాలో దావానలంలా మారింది.

**అరణ్యరోదనగా మారిన ఫిర్యాదులు!**

ఈ దురుసు ప్రవర్తనపై, డ్రైవర్ ఇష్టారాజ్యంపై గద్వాల ఆర్టీసీ అధికారులకు విద్యార్థులు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. అధికారుల అండదండలు ఉండటం వల్లే క్షేత్రస్థాయి సిబ్బంది ఇంతలా బరితెగిస్తున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి!**

కలెక్టర్‌ను సైతం లెక్కచేయకుండా, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న సదరు డ్రైవర్‌ను తక్షణమే సస్పెండ్



చేయాలని విద్యార్థి లోకం డిమాండ్ చేస్తోంది. అలాగే గోనుపాడు పాలిటెక్నిక్ కళాశాల వద్ద అన్ని ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా ఆగేలా జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు





## అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

- మెట్ట పంట పొలాలకు ఎకరాకు 8 వేయిలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి
- జాయింట్ కలెక్టర్ వెంకటాచారి కి మెమోరండం
- కలెక్టరేట్ కార్యాలయం ముందు రైతు సంఘం ధర్నా
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ

**వికారాబాద్, జూలై 14 (వుదయం బ్యూరో):**

వికారాబాద్ జిల్లాలోని అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ కు మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ మాట్లాడుతూ ఎల్ ని నో ప్రాబ్లం వల్ల తక్కువ వర్షపాతం నమోదయిందని అన్నారు. వరికి ప్రత్యన్నయ్య మెట్ట పంటలను సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరాకు 8000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశించినంతగా వానలు పడడం లేదని ఈ సంవత్సరం సేద్యం ఎలా ఉంటుందని భయాందోళనతో రైతులు విత్తనాలు నాటారన్నారు. దాదాపు 30 శాతం విత్తనాలు మొలకత్తలేదని, నకిలీ విత్తనాల బెడద వల్ల కొన్ని జిల్లాలలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. మిట్ట పంటలకు అవసరమయ్యే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వరి పండిన పొలాలకు మిట్ట పంటలకు మళ్లించాలంటే అవసరమైన భూసారాన్ని పెంచడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని, మంచి దిగుబడి ఉండదని, పంటలకు మద్దతు ధరలు అమలవుతాయా లేదా అన్న సందేహంతో రైతులు ఆందోళన పడుతున్నారన్నారు. రైతులకు దయ్యాన్ని ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మిట్ట పంటలన్నిటికీ మద్దతు ధరలను గ్యారెంటీగా అమలు కావడానికి మార్కెట్ శక్తులను నియంత్రించాలని, అవసరమైన మార్కెట్ జోక్యం నిధులను కేటాయించి మద్దతు ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధైర్యంగా భవిష్యత్తులో కూడా పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతు అనుకూల చర్యలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు విజయలక్ష్మి పండిత్ , మాజీ విద్యార్థి నాయకుడు పీర్ మహమ్మద్ , అనంతయ్య విమలమ్మ, సావిత్రమ్మ, బాబు తదితరులు.

## కళాశాలల బంద్ విజయవంతం నారాయణపేట ఏబీవీపీ

**నారాయణపేట, జూలై 14 (వుదయం ప్రతినిధి):**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నారాయణపేట జిల్లాలో ఏ బి వి పి ఆధ్వర్యంలో నిర్వహించిన కళాశాలల బంద్ మంగళవారం విజయవంతం అయింది.ఈ సందర్భంగా కళాశాలలో ఏబీవీపీ నాయకలు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయని కారణంగా 11వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి యేట 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, 4.5 మంది సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతు న్నారని అన్నారు. ఇక్కడి విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలసవెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబ ర్స్మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థు లను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని, మా ప్రభుత్వం లో బకాయిలు చెల్లించడంతో పాటుగా, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయక పోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు.ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, బడ్జెట్ కాలేజిలు సైతం మూతపడు తున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ అనేవి విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం వేసే బిక్ష కాదన్నారు. రీయింబర్స్మెంట్ కోసం అడిగితే విద్యార్థులపై ఉక్కుపాదం మోపుతున్నా రని, నిరసన చేస్తే లాఠీ చార్జీలు చేస్తూ అక్రమ కేసు లు బనాయిస్తున్నారని, కానీ తెలంగాణ విద్యార్థులకు ఇవి కొత్తేమీ కాదన్నారు. రేవంత్ రెడ్డి మాట తప్పారని, ఇచ్చి న హామీనినిల బెట్టుకోవాలని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంకురార్పణ చేస్తామని హెచ్చరించారు. అన్ని కళాశాల ప్రాంగణాలు, విశ్వవిద్యాలయాలు మరోసారి ఉద్యమ వేదికలై కాంగ్రెస్ పార్టీకి మరణ శాసనం రాస్తాయన్నారు. పేద విద్యార్థులను చదువు లకు దూరం చేస్తూ రాక్షసానందం పొందుతున్న రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మార్చుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారుఈ కార్య క్రమంలో నారాయణపేట జిల్లా కన్వీనర్ నరేష్ నగర కార్యదర్శి సతీష్ ఇంతియా, చరణ్ రెడ్డి, మణికంత, అజయ్, రోహిత్, ఉదయ్, రవి తదితర కార్యకర్తలు పాల్గొని బంద్ విజయ వంతం చేశారు.



## ప్రభుత్వ వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కె. హైమావతి
- సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవు
- సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దు



**సిద్దిపేట, జూలై 14 వుదయం బ్యూరో :**

జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (PHC) వైద్యులు స్థానికంగా అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. మంగళవారం సిద్ది పేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఓపీ నిర్వహణ, సిబ్బంది సమయపాలన, మందుల లభ్యతపై మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రోగులు ఎక్కువగా వస్తున్నారని, సిబ్బంది అంతా సమయానికి విధులకు హాజరవుతున్నారని వైద్యాధికారి కలెక్టర్‌కు వివరించారు.ఆసుపత్రికి వచ్చిన ఒక వృద్ధుడిని కలెక్టర్ ఆప్యాయంగా పలకరించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల సదుపాయాలు, మందులు కల్పించిందని తెలిపారు. చిన్న సమస్యలకైనా, పెద్ద జబ్బులకైనా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలని, పెద్ద సమస్య ఉంటే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కి వెళ్లాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అనవసరంగా డబ్బులు వృధా చేసుకోవద్దని కోరారు.ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్‌ను కలెక్టర్ ఆదేశించారు. పిహెచ్‌సి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి, తక్షణమే శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ఫోన్ ద్వారా మండల స్పెషల్ ఆఫీసర్‌ను కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.

## కృత్రిమ మేధతో ఎన్నో ఉపయోగాలు

- చెడుకు వాడొద్దు
- జేఎన్టీయూ వైస్ చాన్సలర్ కృష్ణ కుమార్ రెడ్డి
- ఘనంగా తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వేడుకలు




**హైదరాబాద్, జూలై 14, 2026:**

కృత్రిమ మేధతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, చెడుకు వాడొద్దని ముఖ్య అతిథి జేఎన్టీయూ వైస్ చాన్సలర్ కృష్ణ కుమార్ రెడ్డి తెలిపారు. తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల 21 గ్రాడ్యుయేషన్ డే, కళాశాల ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధతో అనర్థాలు కూడా చాలా జరుగుతున్నాయన్నారు. టెక్నాలజీకి అనుగుణంగా పిల్లలు ముందుకెళ్లాలి కానీ అదే టెక్నాలజీని వాడుకుంటూ చెడు అలవాట్లకు దారి తీయవద్దన్నారు. తీగల కృష్ణారెడ్డి 25 ఎకరాలలో ఇంత పెద్ద కళాశాల ఏర్పాటు చేసి ఎంతోమందికి విద్యను అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కాలంలో ఇంజనీరింగ్తో పాటు పాలిటెక్నిక్ డిప్లమా లో కూడా ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. అనేక మంది ఇంజనీరింగ్ తర్వాత బయట దేశాలకు వెళ్తున్నారని, వారికి సరైన నైపుణ్యం లేకపోవటం వల్ల అనేక మంది చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని దేశాలలో వారి భాషను నేర్చుకుని వెళ్తే దానికి అనుగుణంగా మనకు ఎన్నో అవకాశాలు ఆయా దేశాలలో ఉన్నాయన్నారు.ఈ సందర్భంగా టీకేఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామమైన మీర్పేట్ లో 2000 సంవత్సరంలో ప్రారంభించిన ఈ కళాశాల 21వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. దాదాపు 25 సంవత్సరాలు కళాశాలలో వేల విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, డిప్లమా పూర్తి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. చాలా సందర్భాల్లో విదేశాల్లో పర్యటించినప్పుడు అక్కడ కూడా మన టీకేఆర్ లో విద్యనభ్యసించి విదేశాల్లో స్థిరపడ్డ విద్యార్థులు కూడా కలవడం నాకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈరోజు ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని బయటికి వెళ్తున్న విద్యార్థులు కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరసరు. కాలానుగుణంగా వస్తున్న కోర్సులకు లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్ అత్యాధునికంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీకేఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ టీ హరినాథ్ రెడ్డి, కోశాధికారి అమర్నథ్ రెడ్డి, టీకేఆర్సీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి, టీకేఈఎం ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలి

**చిట్యాల జులై 14(వుదయం ప్రతినిధి)**

విద్యుత్ తీగలు తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలి అని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు చిట్యాల మండల కేంద్రంలో33/11కెవి చిట్యాల టు రంగాపురం లైన్ ఉన్న విద్యుత్ తీగలు 17 ఇండ్లపై ఉన్నవి ఈ తీగల ఉండటం వలన గతంలో విద్యుత్ షాక్ తో ముసాపూర్ రమేష్ అనే వ్యక్తి చనిపో



వడం జరిగిందని ఆరోపించారు తీగలు తొలగించాలని గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ మండల అధికారులకు జిల్లా అధికారులకు ఆ కాలనీవాసులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యుత్ తీగలను తొలగించాలని డిమాండ్ చేశారు ఎమ్మెల్యే చెప్పినప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు అని వర్షాకాలంలో ఇండ్ల స్లాబులపైన ప్రమాదకరంగా ఉన్నాయి ఇప్పటికైనా విద్యుత్ తీగలు తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని తక్షణమే తొలిగించాలని కోరారు.



## సంక్షేమ పథకాలకు ఆటంకం కలగకుండా అమలు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం

**చిట్యాల, జులై 14 (వుదయం ప్రతినిధి):**

సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమలు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు అన్నారు మంగళవారం చిట్యాల మండలంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని 51 మంది లబ్ధిదారులకు 51,05916.00 రూపాయలు చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అమలు చేస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. అలాగే గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి సర్వేలు నిర్వహించి, హద్దుల నిర్ధారణతో పాటు అర్హులకు పట్టాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## ఆరోగ్య సంరక్షణకు అధునాతన ఆవిష్కరణలు

- గీతం చర్చాగోష్ఠిలో పేర్కొన్న స్వదేశీ, విదేశీ పరిశ్రమ నిపుణులు

**పటాన్చెరు, (వుదయం):**

ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడానికి అధునాతన మెటీరియల్స్, నూతన చికిత్సా పరిష్కారాల ఆవిష్కరణను రసాయన, జీవశాస్త్ర ఆవిష్కరణలు నడిపిస్తున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'పదార్థాల నుంచి ఔషధాల వరకు: రసాయన, జీవ శాస్త్రాల పాత్ర' అనే అంశంపై మంగళవారం ఒకరోజు చర్చాగోష్ఠిని ఏర్పాటు చేశారు.



ఆరోగ్య సంరక్షణ, బయోమెడికల్ సైన్సెస్ ను అభివృద్ధి చేయడంలో రసాయన, జీవ శాస్త్రాలు పోషిస్తున్న కీలక పాత్రపై చర్చించడానికి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఒకచోట చేర్చిన ఈ కార్యక్రమంలో పారిస్ లోని రెన్నెస్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రెన్ గ్రే, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ చాడ రాజిరెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడంలో రసాయన, జీవ శాస్త్రాల ప్రధాన భూమికను వారు వివరించారు.ప్రొఫెసర్ రెన్ గ్రే నూతన కైనేస్ ఇన్హిబిటర్ల ఆవిష్కరణ, ఔషధ రసాయన శాస్త్రంలో సుస్థిరతపై మాట్లాడారు. మానవ కైనోమ్ లో 538 ప్రోటీన్ కైనేసులున్నాయని, ఇమాటినిబ్, సోరాఫెనిబ్, సునిటినిబ్ సహా దాదాపు వంద ఎఫ్డీఏ ఆమోదిత ప్రోటీన్ కైనేస్ ఇన్హిబిటర్లు (పీకేఐలు) అందుబాటులో ఉన్నాయని, వాటిలో సుమారు 85 శాతం క్యాన్సర్ చికిత్సకు ఉపయోగిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 400కు పైగా కైనేస్ ఇన్హిబిటర్లు క్లినికల్ అభివృద్ధి దశలో ఉన్నాయని, ఇది 9.8 శాతం వార్షిక వృద్ధి రేటుతో, సుమారు 64 బిలియన్ల పౌండ్ల విలువైన వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్ కు ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా మాట్లాడుతూ, అత్యాధునిక పరిశోధలను ప్రోత్సహించడానికి, అర్థవంతమైన శాస్త్రీయ పరస్పర చర్యలకు వేదికలను సృష్టించడంలో గీతం నిబద్ధతను చాటిచెప్పారు. సంక్లిష్టమైన శాస్త్రీయ, ఆరోగ్య సంరక్షణ సమస్యలను పరిష్కరించడానికి బహుళ విభాగాల విధానాలను అవలంబించాలని ఆయన విద్యార్థులు, పరిశోధకులను ప్రోత్సహించారు.ఈ సెమినార్ లో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదార్థ విజ్ఞాన శాస్త్రం, ఔషధ రసాయన శాస్త్రం, జీవ పరిశోధనలలో అభివృద్ధి చెందుతున్న పోకడలపై నిపుణుల ఉపన్యాసాలు, ఆసక్తికరమైన చర్చల నుంచి వారు ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమాన్ని రసాయన శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ గౌసియా బేగం, డాక్టర్ ఎ.రత్నమాల సమన్వయం చేశారు.

## సైబర్ నేరాలపై అక్రమతంగా ఉండాలి ఎస్సై విక్రం

**మరికల్ జూలై ( 13 వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్ర పరిధిలోని తీలేరూ గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మరికల్ ఎస్సై విక్రం అవగాహన సదస్సు నిర్వహించారు కొత్త వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే ఓటీపీలు బ్యాంకు వివరాలు ఏటీఎంలో నెంబర్లు ఎవరికి చెప్పొద్దని ఆయన అన్నారు మరియు కేవైసీలు టేకు ఉద్యోగాలు పెట్టుబడులు స్కీములు లాటరీలు గురించి మోసపోవద్దని ఆయన అన్నారు



ఒకవేళ అనుమానా వ్యక్తుల నుండి ఫోన్ కాల్ వస్తే 1930 సైబర్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేసి సమీప పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయాలని ఆయన అన్నారు పోలీస్ స్టేషన్లో వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయబడతాయని వాటిలో అత్యవసర నెంబర్ కంప్లైంట్ బాక్సులు క్యూఆర్ కోడ్లు ఉంటాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మృతి చెందిన వికలాంగుని కుటుంబానికి 6వేలు ఆర్థిక సహాయం

ఏపీజే అబ్దుల్ కలాం మండల దివ్యాంగుల పరపతి అసోసియేషన్.
మండల దివ్యాంగుల పరపతి అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రావు.



ఖానాపురం, జులై 14 (వుదయం ప్రతినిధి):మండలంలోని దబ్బీర్ పేట గ్రామానికి చెందిన దివ్యాంగుడు వట్టం పాపయ్య(65) అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహాన్ని ఏపీజే అబ్దుల్ కలాం మండల దివ్యాంగుల పరపతి అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు కోగంటి ప్రభాకర్ రావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి ఏపీజే అబ్దుల్ కలాం మండల దివ్యాంగుల పరపతి అసోసియేషన్ ద్వారా 6 వేల రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం మండల దివ్యాంగుల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దొనికెల రాములు, మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు మెరుగు శంకర్, ప్రధాన కార్యదర్శి ఏశబోయిన కుమార్, నాయకులు, ఈక రాములు, పార్వతమ్మ, నంద తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ ఉత్తమ విద్యాబోధనకు అవకాశం ఏర్పడుతుంది

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి జులై 14(వుదయం విలేకరి) శిక్షణ ఉత్తమ విద్యాబోధనకు అవకాశం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఘన్‌పూర్ మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో కాటారం, మొుగుళ్లపల్లి, మహాముత్తారాం, భూపాలపల్లి మండలాల జడ్పీ, కెజిబివి, మోడల్ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ఫర్ క్వాలిటీ లెర్నింగ్ టు ట్రాన్స్ నేటివ్ క్లాస్ రూమ్స్ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించే దిశగా బోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను సరైన దిశలో నడిపిస్తూ, భావి భారతానికి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ముఖ్య బాధ్యత అని తెలిపారు. విద్యాబోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కీలకమైందని, దీని ద్వారా బోధనలో నాణ్యత పెరిగి విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలు పెరిగి మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 6 పాఠశాలల్లో విద్యార్థులకు ఏఐ శిక్షణ అందించామని, త్వరలో మరిన్ని పాఠశాలలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. గుణాత్మక విద్య సామర్థ్యవంతమైన ఉపాధ్యాయుల ద్వారానే సాధ్యం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాల పెంపుఆధునిక బోధనా పద్ధతులు, సరికొత్త అధ్యాపన విధానాలు, తరగతి నిర్వహణపై శిక్షణ అవసరమని తెలిపారు. శిక్షణ సృజనాత్మక మరియు నాణ్యమైన బోధనకు మార్గదర్శనమని తెలిపారు విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మైనారిటీ సంక్షేమ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయి అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్, ఎఎంఓ విజయ్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గ్రీన్ వుడ్ పాఠశాలలో ఘనంగా కప్పతల్లి ఆట

### వర్షాల కోసం విద్యార్థుల ప్రత్యేక ప్రార్థనలు

భూపాలపల్లి జులై 14(వుదయం విలేకరి)ప్రస్తుత వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, కరవు పరిస్థితులు నెలకొనడంతో, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ మహాదేవపూర్ మండల కేంద్రం లోని గ్రీన్ వుడ్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయబద్ధంగా కప్పతల్లి ఆట" వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మన పూర్వీకులు వర్షాల కోసం జరిపే ఈ ప్రాచీన సంప్రదాయాన్ని నేటి తరానికి పరిచయం చేస్తూ పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పచ్చటి ఆకులతో, పూలతో కప్పతల్లి బొమ్మను సిద్ధం చేసి, పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో మన సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలకు మన సంస్కృతి తెలియడమే కాకుండా, ప్రకృతికి–మానవాళికి ఉన్న సంబంధం పట్ల అవగాహన పెరుగుతుంది. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. ఈ వినూత్న కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు చీర్ల శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజకుమార్ ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. త్వరలోనే వానదేవుడు కరుణించి మంచి వర్షాలు కురుస్తాయని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మక మరియు నాణ్యమైన బోధనకు మార్గదర్శనమని తెలిపారు విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు ఉ జ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మైనారిటీ సంక్షేమ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయి అధికారి బాబూరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఓ భాస్కర్, ఎఎంఓ విజయ్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 'అలుమ్ని భవన' నిర్మాణానికి విరాళాలు ఇవ్వాలి: ఈవీ శ్రీనివాస్ రావు



హనుమకొండ, జూలై 14 (వుదయం ప్రతినిధి) : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల కోసం (అలుమ్ని) త్వరలోనే ఆత్మీయ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం (గాూా) అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి కళాశాల ప్రాంగణంలో భవన నిర్మాణ స్థలాన్ని, అలాగే శరవేగంగా జరుగుతున్న కళాశాల నూతన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల పూర్వ విద్యార్థుల సమావేశాలకు, సేవా కార్యక్రమాలకు ఈ భవనం శాశ్వత వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని పిలుపునిచ్చారు.

?బ్యాంకు ఖాతా వివరాలు:

విరాళాలు అందించదలచిన వారు కింద పేర్కొన్న బ్యాంకు ఖాతాకు జమ చేసి, రశీదు వివరాలను సంఘం కోశాధికారి పడిశాల ఆనంద్ కుమార్ కు తెలియజేయాలని కోరారు.

? పూర్వ విద్యార్థుల సంఘం -- ప్రభుత్వ పాలిటెక్నిక్, వరంగల్

?ఖాతా సంఖ్య: 62052476227

?బ్యాంకు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంజీఎం శాఖ, వరంగల్

?కళాశాల అభివృద్ధికి, స్థల కేటాయింపునకు ఎంతో సహకరించిన మాజీ ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ సేవలను కొనియాడిన సంఘం.. ఆయనను అలుమ్ని సంఘానికి శాశ్వత ఆహ్వానితుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మణ్ భవన నిర్మాణ పురోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఉమేందర్, భిక్షపతి, సాయిరాజ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ఫీవర్ సర్వే, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన డీఎంహెచ్ఓ



హనుమకొండ టౌన్, జూలై 14 (వుదయం ప్రతినిధి) : జ్వర సర్వేలో భాగంగా గృహ సందర్శన చేసినప్పుడు బాధితుల వివరాలు సేకరించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు 'డ్రై డే' ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఏ. అప్పయ్య సూచించారు.

?మంగళవారం ఆయన అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్ మోహన్ రావుతో కలిసి పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న ఇంటింటి జ్వర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం అక్కడి 'ఆరోగ్య మహిళా' క్లినిక్‌ను సందర్శించి, మెప్మా రిసోర్స్ పర్సన్స్ ద్వారా మహిళలు ఈ సేవలను వినియోగించుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

?గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి, అనంతరం లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని డీఎంహెచ్ఓ సందర్శించారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు తప్పకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రోజు 30 మంది బాలికలకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ హైదర్ తెలిపారు. ?ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ దీప్తి, డాక్టర్ రాజా హైదర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఖాదర్ అబ్బాస్, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## సఫాయి మిత్రుల సంక్షేమమే జీడబ్ల్యూఎంసీ ధ్యేయం

### కమిషనర్ టి. వెంకన్న

### ఘనంగా 'నమస్తే దినోత్సవం'.. పీపీఈ కిట్లు, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ




వరంగల్ టౌన్, జూలై 14 (వుదయం ప్రతినిధి) :
నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సఫాయి మిత్రల ఆరోగ్యం, భద్రతకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఔవీజ) అత్యంత ప్రాధాన్యతనిస్తోందని కమిషనర్ టి. వెంకన్న తెలిపారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో "నమస్తే దినోత్సవం" సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు భద్రతా ప్రమాణాలు, వ్యర్థాల సురక్షిత నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

?అనంతరం కమిషనర్ 60 మంది సఫాయి మిత్రలకు గ్లౌజులు, మాస్కులు, రిఫ్లెక్టివ్ జాకెట్లు, గమ్‌బూట్లు కలిగిన పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (ౡాజు) కిట్లను పంపిణీ చేశారు. విధుల్లో వీటిని తప్పనిసరిగా వాడాలని సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'ఆయుష్మాన్ భారత్ పథకం కింద అర్హులైన కార్మికులకు ఉచిత వైద్య సేవలు పొందేందుకు వీలుగా హెల్త్ కార్డులను అందజేశారు. కార్మికుల శ్రమతోనే నగరం ఆరోగ్యంగా ఉందంటూ వారి సేవలను కమిషనర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ప్రజారోగ్య విభాగ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.


## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

భూపాలపల్లి జులై 14(వుదయం విలేకరి)



ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మహాదేవపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారిని శ్రీజ హెచ్చరించారు మంగళవారం మహాదేవపూర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు దానిలో భాగంగా సూరారం గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగిందని అన్నారు గ్రామంలోని గాంధీనగర్ లో ఓ షాపులో అధిక ధరలకు అమ్ముతున్నా స్టాక్ రిజిస్టర్స్ బిల్ బుక్స్ కూడా సరిగ్గా మెయింటైన్ చేయకుండా రైతులకు బిల్లులు ఇవ్వని కారణంతో డీసీఎంస్ లోని – స్టాఫ్ సెల్ ఇవ్వడం జరిగిందని ఎలాంటి క్రయవిక్రయాలు జరుపకూడదని హెచ్చరించారు ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకి విక్రయిస్తే కటిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ధర్మేందర్ మరియు రైతులు పాల్గొన్నారు.

## చెన్నారావుపేట డిప్యూటీ ఎమ్మార్వో గా పవన్ కుమార్.



చెన్నారావుపేట జూలై 14. (వుదయం న్యూస్ ప్రతినిధి)చెన్నారావుపేట మండల డిప్యూటీ ఎమ్మార్వో గా పవన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పవన్ కుమార్ గతంలో పర్వతగిరి, వర్ధన్నపేట లో పనిచేసినారు. ఆ తదినంతరం కలెక్టర్ క్యాంపు లో సూపర్డెంట్ గా కూడా పనిచేశారు. ప్రస్తుతం చెన్నారావుపేట డిప్యూటీ ఎమ్మార్వో గా పదవి బాధ్యతలు చేపట్టారు

## బీఆర్ఎస్ నాయకుడు గడ్డం విష్ణు కుటుంబాన్ని పరామర్శించిన కొక్కిరాల రాకేష్ రావు.



పరకాల జులై 14 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గడ్డం విష్ణు తండ్రి గడ్డం ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బీఆర్ఎస్ నాయకుడు కొక్కిరాల రాకేష్ రావు వారి కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా గడ్డం ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పంచాగిరి సుధాకర్, మాజీ ఎంపీటీసీ పాడి భగవాన్ రెడ్డి, నాయకులు బండి వెంకటేష్, ఏకు రమేష్, బొట్ల నరేష్, ఎండీ మంజూర్ అలీ, బొల్లెడ్ల కృపేందర్ రెడ్డి, ఎండీ అఫ్రోజ్, బొమ్మకంటి నాగరాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

## ధన్సింగ్ ని పరామర్శించిన సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్



చెన్నారావుపేట జులై. 14 ( వుదయం న్యూస్. ప్రతినిధి)చెన్నారావుపేట మండలం చెరువు కొమ్ము తండా కి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాణోత్ ధన్సింగ్ ని ఈ రోజు చెన్నారవుపేట మండల సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్ పరామర్శించారు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాయకుడు ధన్సింగ్ ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు..ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని విశ్రాంతి తీసుకొని త్వరగా కొలుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో.సర్పంచులు విక్రమ్ బాలు నాయక్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య నర్సు నాయక్ వట్టే తిరుపతి రెడ్డి గూడ మహేందర్ టీచర్ బాణోత్ జాను ఉప సర్పంచ్ కొర్ర మోహన్ మాజీ సర్పంచ్ గణేష్ రాజు శివ మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సహకరించాలి.

### కొక్కిరాల రాకేష్ రావు.



పరకాల జులై 14 (వుదయం ప్రతినిది): ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కొక్కిరాల రాకేష్ రావు సోమవారం స్థానిక బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఓటరు నమోదు, సవరణ ఫారాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలోని లోపాలను సరిదిద్దడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు ఫారాలను బీఎల్ఓలకు అందజేసినట్లు చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి వెంకటేష్, నాగరాజు, కృపేందర్ రెడ్డి, బీఎల్ఓ రజిత తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## ఈ సీజన్‌లో కంజంక్టివైటిస్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే..



వర్షాకాలం ప్రారంభమైతే కళ్లకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు పెరగడం సాధారణమే. వాటిలో ముఖ్యంగా కంజంక్టివైటిస్ (పింక్ ఐ) కేసులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. చాలామంది దీనిని చిన్న సమస్యగా తీసుకున్నప్పటికీ, ఇది అత్యంత వేగంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే కంటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే లక్షణాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.కంటి గుండ్రని భాగాన్ని, కనురెప్పల లోపలి భాగాన్ని కప్పి ఉండే పారదర్శక పొరను కంజంక్టైవా అంటారు. ఈ పొరలో ఇన్ఫ్లమేషన్ లేదా ఇరిటేషన్ ఏర్పడిన పరిస్థితినే కంజంక్టివైటిస్‌గా పిలుస్తారు. ఇది వైరస్‌లు, బ్యాక్టీరియా లేదా అలెర్జీ కారణంగా వస్తుంది. వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వైరస్‌లు, బ్యాక్టీరియా విస్తరించడానికి అనుకూల వాతావరణం ఉండటం వల్ల ఈ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతాయి. కంజంక్టివైటిస్ ఒక అంటువ్యాధి కావడంతో బాధితులతో సన్నిహితంగా ఉండటం, వారి చేతి రుమాళ్లు, తువ్వాళ్లు వంటి వ్యక్తిగత వస్తువులను పంచుకోవడం ద్వారా కూడా ఇతరులకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలో ఒకటి లేదా రెండు కళ్లలో ఎర్రబడటం, కళ్ల నుంచి నీరు లేదా జిగురు వంటి స్రావం రావడం, కనురెప్పలు వాపు రావడం, మంట లేదా ఇసుక పడినట్లు గరుకుగా అనిపించడం, ముఖ్యంగా అలెర్జీ కారణంగా వచ్చినప్పుడు దురద, వెలుతురును చూడలేకపోవడం, చూపు మసకబారడం, కొన్నిసార్లు కంటి నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి ఒక్కరిలో అన్ని లక్షణాలు కనిపించవు. అయితే కళ్లు ఎర్రబడటం లేదా చికాకు ఎక్కువసేపు కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు. కంజంక్టివైటిస్‌ను నివారించడంలో వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో కీలకం. కళ్లను చేతులతో తాకడం లేదా రుద్దడం మానుకోవాలి. చేతులను తరచూ సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తువ్వాళ్లు, చేతి రుమాళ్లు, కంటి మేకప్ వస్తువులను ఇతరులతో పంచుకోవద్దు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో రక్షణ కళ్లజోడు ధరించడం మంచిది. కళ్లు ఎర్రబడినా లేదా దురదగా అనిపించినా కాంటాక్ట్ లెన్స్‌లను ఉపయోగించకూడదు. కంజంక్టివైటిస్ సోకిందని అనుమానం వచ్చినప్పుడు కళ్లను రుద్దకూడదు. మూసిన కనురెప్పలపై ఐస్ ప్యాక్‌ను కొద్దిసేపు ఉంచితే ఉపశమనం లభిస్తుంది. కళ్ల నుంచి స్రావం వస్తే కాటన్ బాల్ లేదా ఒకసారి మాత్రమే ఉపయోగించే టిష్యూ పేపర్‌తో శుభ్రం చేసుకోవాలి. ఇన్ఫెక్షన్ పూర్తిగా తగ్గే వరకు కాంటాక్ట్ లెన్స్‌లను ధరించకూడదు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కూడా అవసరం.అయితే కొన్ని లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మూడు రోజులకుపైగా కళ్ల ఎర్రదనం, స్రావం, చికాకు కొనసాగడం, చూపు మసకబారడం, తీవ్రమైన కంటి నొప్పి లేదా వెలుతురును చూడలేకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. సమయానికి చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య మరింత తీవ్రమవకుండా నివారించవచ్చు.

## ఉదయం షుగర్ పెరగకుండా ఉండాలంటే..




మధుమేహం ఉన్న చాలా మంది ఉదయం నిద్రలేవగానే రక్తంలో చక్కెర (బ్లడ్ షుగర్) స్థాయిలు ఎక్కువగా ఉండటాన్ని గమనిస్తుంటారు. దీనికి ప్రధాన కారణం తెల్లవారుజామున శరీరంలో విడుదలయ్యే కొన్ని హార్మోన్లు. వీటివల్ల కాలేయం ఎక్కువ గ్లూకోజ్‌ను విడుదల చేస్తుంది. ఈ పరిస్థితిని వైద్యులు 'డాన్ ఫినామినన్' అని పిలుస్తారు. అయితే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా ఉదయం షుగర్ పెరగడాన్ని చాలావరకు నియంత్రించవచ్చు. రాత్రంతా శరీరానికి నీరు అందకపోవడంతో స్వల్ప డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. దీంతో రక్తంలో గ్లూకోజ్ సాంద్రత పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం లేవగానే ఒక గ్లాసు నీరు తాగడం మంచి అలవాటు. రోజూ కనీసం 30 నిమిషాలు నడక, యోగా లేదా తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను సమర్థంగా ఉపయోగించుకుంటుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. కొంత మందికి సాయంత్రం వ్యాయామం చేయడం కూడా ఉదయం షుగర్ పెరగకుండా సహాయపడుతుంది. ఉదయం అల్పాహారం చేయకపోతే రక్తంలో చక్కెర స్థాయిలు అస్థిరంగా మారే అవకాశం ఉంది. గుడ్లు, పెరుగు, పప్పులు, ఓట్స్, మిల్లెట్స్, పండ్లు, నట్స్ వంటి ప్రొటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే షుగర్ నియంత్రణకు ఉపయోగపడుతుంది. ఉదయం ఎక్కువ కెఫిన్ తీసుకోవడం కొంత మందిలో రక్తంలో చక్కెర స్థాయిలను పెంచే అవకాశం ఉంది. కాబట్టి టీ, కాఫీని పరిమితంగా తీసుకోవడం మంచిది. మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనిస్తూ అలవాట్లను మార్చుకోవాలి. రోజుకు 7–8 గంటలు నాణ్యమైన నిద్ర లేకపోతే ఒత్తిడి హార్మోన్లు పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు అధికమవుతాయి. కాబట్టి ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం అలవాటు చేసుకోవాలి. మానసిక ఒత్తిడి కూడా షుగర్ పెరగడానికి ఒక కారణం. ధ్యానం, ప్రాణాయామం, యోగా లేదా మీకు ఇష్టమైన పనుల్లో సమయం గడపడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. వైద్యులు సూచించిన మందులు లేదా ఇన్సులిన్‌ను సమయానికి తీసుకోవడం చాలా ముఖ్యం. ఉదయం షుగర్ తరచుగా ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా వైద్యులని సంప్రదించి చికిత్సలో మార్పులు అవసరమా తెలుసుకోవాలి. రాత్రి ఆలస్యంగా లేదా ఎక్కువగా భోజనం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు రాత్రంతా ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి నిద్రకు కనీసం 2–3 గంటల ముందే తేలికపాటి భోజనం చేయడం మంచిది. ముఖ్యంగా అన్నం, స్వీట్లు, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు తగ్గించి, ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.

## ఈ ప్రాథమిక వైద్య పరికరాలు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండాల్సిందే..



ఇంట్లో పిల్లలు, వృద్ధులు లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి వంటి కీలక ఆరోగ్య సూచీలను ఎప్పటికప్పుడు గమనించడం చాలా ముఖ్యం. ఇందుకోసం కొన్ని ప్రాథమిక వైద్య పరికరాలను ఇంట్లోనే ఉంచుకోవడం అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుంది. అయితే ఈ పరికరాల్లో అసాధారణ రీడింగ్ కనిపించగానే భయపడకుండా, ప్రశాంతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ థర్మామీటర్, బీపీ మానిటర్, పల్స్ ఆక్సీమీటర్, అవసరమైతే గ్లూకోమీటర్, నెబ్యులైజర్, అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్ ప్రతి ఇంట్లో ఉండటం మంచిది. ఇవి ఆరోగ్య పరిస్థితిలో వచ్చే మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిలో ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అత్యవసర సమయంలో కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు తగ్గించి, వైద్యులకు సరైన సమాచారం అందించడంలో కూడా ఈ పరికరాలు ఉపయోగపడతాయి. అయితే ఏదైనా పరికరంలో అసాధారణ రీడింగ్ కనిపించిన వెంటనే అది తీవ్రమైన సమస్య అని భావించకూడదు. మొదట కనిపించిన రీడింగ్‌ను ఒక హెచ్చరికగా మాత్రమే పరిగణించి, మరోసారి సరిచూసుకోవడం అవసరం. ఎందుకంటే కొన్నిసార్లు పరికరాన్ని సరిగా ఉపయోగించకపోవడం లేదా ఇతర కారణాల వల్ల కూడా తప్పుడు రీడింగ్ వచ్చే అవకాశం ఉంటుంది. రక్తపోటు ఎక్కువగా లేదా చాలా తక్కువగా కనిపిస్తే ముందుగా కొద్దిసేపు ప్రశాంతంగా కూర్చొని మళ్లీ బీపీని పరీక్షించాలి. డైనింగ్ కుర్చీలో నిటారుగా కూర్చొని, చేతిని టేబుల్‌పై సపోర్ట్ ఇచ్చి కొలిస్తే సరైన ఫలితం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆందోళన, నొప్పి, ఇటీవల చేసిన శారీరక శ్రమ, బీపీ కఫ్‌ను సరిగా ధరించకపోవడం వంటి కారణాల వల్ల కూడా రీడింగ్ మారుతుంది. అలాగే బీపీ కొలిచే ముందు కనీసం గంటపాటు టీ, కాఫీ తాగకుండా ఉండాలి. దగ్గు మందులు, ముక్కు దిబ్బడ తగ్గించే మందులు లేదా నెబ్యులైజేషన్ వాడిన తర్వాత కూడా బీపీ, పల్స్ తాత్కాలికంగా పెరిగే అవకాశం ఉంటుంది. గ్లూకోమీటర్‌లో రక్తంలో చక్కెర స్థాయి ఒక్కసారిగా ఎక్కువగా లేదా తక్కువగా కనిపిస్తే ముందుగా చేతులను శుభ్రంగా కడిగి మళ్లీ పరీక్షించాలి. వేళ్లపై ఆహార అవశేషాలు లేదా శానిటైజర్, స్పిరిట్ అవశేషాలు ఉండటం వల్ల కూడా తప్పు రీడింగ్ వస్తుంది. చెమటలు పట్టడం, తల తిరగడం, అయోమయం, తీవ్రమైన దాహం వంటి లక్షణాలు కూడా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మరో వేలితో మళ్లీ పరీక్షించడం లేదా సాధ్యమైతే మరో గ్లూకోమీటర్‌తో పోల్చి చూడడం కూడా మంచిది. థర్మామీటర్‌లో అధిక జ్వరం నమోదైతే ముందుగా ఉష్ణోగ్రతను సరిగ్గా కొలిచామా లేదా అని నిర్ధారించుకోవాలి. శరీరానికి తగినంత నీరు అందేలా చూసుకోవాలి. జ్వరం ఎక్కువసేపు కొనసాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అయోమయం లేదా ఫిట్స్ వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలి. పల్స్ ఆక్సీ మీటర్‌లో ఆక్సిజన్ స్థాయి తక్కువగా కనిపిస్తే చేతులను వెచ్చగా ఉంచి, కదలకుండా కొద్దిసేపు ఉండి మళ్లీ పరీక్షించాలి.

## వర్షాకాలంలో జలుబుకు చెక్!

వర్షాకాలంలో వాతావరణంలో మార్పుల కారణంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, జీర్ణ సమస్యలు వంటి ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇలాంటి సమయంలో శరీరానికి వెచ్చదనం కలిగించేందుకు, సాధారణ ఆరోగ్యానికి తోడ్పడేందుకు చాలా మంది ఆయుర్వేద కషాయాలను తాగుతుంటారు. తులసి, అల్లం, పసుపు, మిరియాలు, దాల్చినచెక్క వంటి సహజ పదార్థాలతో తయారుచేసే ఈ కషాయాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.



తులసి–అల్లం కషాయం తయారు చేయడానికి 10 నుంచి 12 తులసి ఆకులు, ఒక అంగుళం అల్లం ముక్క, నాలుగు నల్ల మిరియాలు, చిన్న దాల్చినచెక్క ముక్క, రెండు లవంగాలు, రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీటిని మరిగించి అందులో అన్ని పదార్థాలను వేసి 10 నుంచి 15 నిమిషాలు సన్నని మంటపై మరిగించాలి. తర్వాత వడకట్టి కొద్దిగా చల్లారిన అనంతరం కావాలనుకుంటే తేనె కలిపి తాగవచ్చు.

పసుపు – నల్ల మిరియాల కషాయం పసుపు–నల్ల మిరియాల కషాయం తయారు చేయడానికి అర టీస్పూన్ పసుపు పొడి, అర టీస్పూన్ నల్ల మిరియాల పొడి, ఒక అంగుళం అల్లం ముక్క, చిన్న దాల్చినచెక్క ముక్క, రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీటిలో అన్ని పదార్థాలను వేసి 12 నుంచి 15 నిమిషాల పాటు సన్నని మంటపై బాగా మరిగించాలి. అనంతరం వడకట్టి గోరువెచ్చగా తాగాలి. కావాలనుకుంటే కషాయం కొద్దిగా చల్లారిన తర్వాత ఒక టీస్పూన్ తేనె కలిపి తీసుకోవచ్చు.

లవంగం – దాల్చినచెక్క కషాయం తయారు చేయడానికి నాలుగు లవంగాలు, చిన్న దాల్చినచెక్క ముక్క, రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా లవంగాలు, దాల్చినచెక్కను స్వల్పంగా దంచి నీటిలో వేయాలి. సుమారు 15 నిమిషాల పాటు సన్నని మంటపై బాగా మరిగించాలి. అనంతరం వడకట్టి గోరువెచ్చగా తాగాలి. ఈ కషాయం సువాసనతో పాటు వెచ్చదనాన్ని కూడా అందిస్తుంది.

వేప – పసుపు కషాయం తయారు చేయడానికి 5 నుంచి 6 శుభ్రమైన వేప ఆకులు, అర టీస్పూన్ పసుపు పొడి రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీటిలో అన్ని పదార్థాలను వేసి 12 నుంచి 15 నిమిషాల పాటు సన్నని మంటపై బాగా మరిగించాలి. అనంతరం వడకట్టి గోరువెచ్చగా తాగాలి.

## జుట్టుకి హెన్నా పెట్టేటప్పుడు...

తెల్ల వెంట్రుకల్ని దాచడం కోసమో, జుట్టుకి పోషణ అందిస్తుందనో... చాలామంది గోరింటాకు తలకు పెట్టుకుంటారు. అయితే, అది పెట్టే విధానం తెలియకపోతే... చిక్కులు తప్పవు. మరి



మనం చేసే తప్పులేంటో? వాటికి పరిష్కారమేంటో తెలుసుకుందామా! చాలామంది తలకు నూనె ఉన్నప్పుడే హెన్నా పూసేస్తుంటారు. ఇలా చేయడం వల్ల రంగూ, పోషకాలు కురులకు సరిగ్గా పట్టవు. తలస్నానం చేసి పూర్తిగా ఆరిన శిరోజాలకే గోరింటా కు పెట్టాలి. అప్పుడే ఫలితం బాగుం టుంది. గంటల తరబడి హెన్నా తలకు పెట్టుకోవడం వల్ల రంగు వస్తుంది అనుకుంటారు కొందరు. కానీ, అది బాగా గట్టిపడితే తలనొప్పి రావొచ్చు. జుట్టూ రాలొచ్చు. మరీ ఎక్కువ ఆరిపోకుండా అప్పుడప్పుడూ నీళ్లతో తలను తడపండి. లేదంటే శిరోజాలు పొడిబారతాయి. హెన్నా పౌడర్ కలిపిన వెంటనే జుట్టుకు పట్టించడం వల్ల పూర్తి రంగు రాదు. ముందు రోజు రాత్రి ఇనుప పాత్రలో కలిపితే మంచి రంగు వస్తుంది. అందులోనూ టీ లేదా కాఫీ డికాక్షన్‌లో నీళ్లల్లో నానబెట్టి ఉదయాన్నే కొంచెం పెరుగు లేదా నిమ్మరసం కలిపితే మేలు. మెత్తగానే కాదు... మెరుస్తూ ఉంటుంది. తలకు హెన్నా పెట్టుకున్నాక వెంటనే షాంపూ వాడకండి. ముందుగా మంచి నీళ్లతో హెన్నా మొత్తాన్ని వదిలించండి. పూర్తిగా ఆరాక ఆయిల్ పెట్టి మసాజ్ చేయండి. ఆ మర్నాడు మాత్రమే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. అప్పుడే జుట్టుకు రంగు బాగా పడుతుంది. మృదువుగానూ ఉంటుంది.

## అందానికీ 'గుడ్డు'..!



గుడ్డు సంపూర్ణ పోషకాహారమనే విషయం తెలిసిందే. ప్రొటీన్లతో పాటు విటమిన్లు, ఖనిజాలెన్నో నిండి ఉన్న గుడ్డు అందానికీ మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి.. వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు, సన్నటి గీతలు వస్తుంటాయి. అయితే గుడ్డులోని తెల్లసొనను ముఖంపై పూతలా వేయడం వల్ల చర్మం బిగుతుగా మారుతుందట. వారంలో రెండుసార్లు ఈ పూత వేసుకోవడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. గుడ్డు లోని తెల్ల సొనతో కంటి కింది భాగాన్ని నెమ్మదిగా మర్దన చేయాలి. అలా కాసేపు ఉంచి చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఆ తర్వాత అక్కడ కొబ్బరి నూనె రాయాలి. ఇలా తరచూ చేయడం వల్ల కళ్ల కింద వాపును తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. గుడ్డులోని తెల్లసొనలో రెండు, మూడు చుక్కల టీట్రీ ఆయిల్ వేసి మొటిమలు ఉన్న చోట నెమ్మదిగా రాయాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు, వాటివల్ల వచ్చే మచ్చలు తగ్గిపోతాయట.

ముందుగా గోరువెచ్చటి నీటితో ముఖం కడుక్కొని గుడ్డులోని తెల్లసొనను పొరలా అప్లై చేసుకోవాలి. అది పూర్తిగా ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల చర్మరంధ్రాలు శుభ్రపడతాయని చెబుతున్నారు నిపుణులు.

అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఒకేలాంటి టూత్‌పేస్ట్, బ్రష్ అందరికీ సరిపోవు..



దంతాలను రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం మాత్రమే సరిపోతుందని చాలామంది భావిస్తారు. ఫ్లాసింగ్‌ను నిర్లక్ష్యం చేయడం, ఏ టూత్‌పేస్ట్ అయినా అందరికీ ఒకేలా పనిచేస్తుందని అనుకోవడం సాధారణమే. అయితే నోటి పరిశుభ్రత విషయంలో అందరికీ ఒకే విధమైన సంరక్షణ సరిపోదని దంత ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వయస్సు, ఆరోగ్య పరిస్థితి, వైద్య చరిత్ర, దంతాల సున్నితత్వం వంటి అంశాలను బట్టి ప్రతి ఒక్కరి ఓరల్ కేర్ అవసరాలు భిన్నంగా ఉంటాయి. అందుకే నోటి సంరక్షణను వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడం ముఖ్యం. సాధారణంగా ఒకే టూత్‌పేస్ట్, ఒకే మౌత్‌వాష్, ఒకే విధంగా బ్రష్ చేయడం అందరికీ సరిపోతుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ వాస్తవానికి ప్రతి ఒక్కరి నోటి ఆరోగ్య పరిస్థితి వేరు. అందువల్ల వారి అవసరాలకు తగ్గట్టుగా ఓరల్ కేర్ ఉత్పత్తులు, పద్ధతులను ఎంచుకోవడం ద్వారా మాత్రమే మంచి ఫలితాలు పొందవచ్చు. శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్నవారు, ఐసీయూలో చికిత్స పొందుతున్నవారు లేదా ఇతరుల సహాయంపై ఆధారపడే రోగులకు సాధారణంగా నోరు పుక్కిలించడం లేదా ఉమ్మివేయడం కూడా కష్టంగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పుక్కిలించాల్సిన అవసరం లేని ప్రత్యేక ఓరల్ కేర్ ద్రావణాలు లేదా సంరక్షకుల సహాయంతో నోటి పరిశుభ్రతను పాటించడం అవసరం. నాడీ సంబంధిత వ్యాధులు, అభివృద్ధి లోపాలు లేదా మేధోపరమైన సమస్యలు ఉన్న వారికి సాధారణ టూత్‌పేస్ట్‌లలో ఉండే ఘాటైన రుచి, ఎక్కువ నురుగు లేదా కొన్ని రకాల టెక్స్చర్లు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. కొందరిలో ఇవి వాంతి భావన లేదా ఇంద్రియాలకు అధిక ఒత్తిడిని కూడా కలిగిస్తాయి. కాబట్టి వారికి తగిన ఉత్పత్తులను ఎంపిక చేసుకోవాలి. క్యాన్సర్ చికిత్స పొందుతున్నవారు, మధుమేహంతో బాధపడుతున్నవారు లేదా దీర్ఘకాలంగా కొన్ని మందులు వాడేవారిలో నోరు ఎండిపోవడం, చిగుళ్లు బలహీనపడటం, దంతాల పైపొర దెబ్బతినడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణ ఓరల్ కేర్ ఉత్పత్తుల కంటే సున్నితమైన ఉత్పత్తులు ఉపయోగించడం మంచిది. బ్రేసెస్ ధరించిన టీనేజర్లలో బ్రాకెట్లు, వైర్ల మధ్య ఆహార కణాలు, ప్లాక్ ఎక్కువగా పేరుకుపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల దంతవైద్యుల సూచన మేరకు ఆర్థోడాంటిక్ టూత్‌బ్రష్, ఇంటర్‌డెంటల్ బ్రష్, ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్ లేదా మౌత్‌వాష్, వాటర్ ఫ్లాసర్ వంటి ప్రత్యేక ఉత్పత్తులను ఉపయోగించడం ద్వారా దంతాలను సమర్థంగా శుభ్రం చేసుకోవచ్చు. వయసు పెరిగేకొద్దీ నోటి లోపలి కణజాలం సున్నితంగా మారుతుంది. కొన్ని మందుల ప్రభావంతో నోరు ఎండిపోవడం కూడా జరుగుతుంది. అలాంటి వృద్ధులకు చిగుళ్లను ఇబ్బంది పెట్టని, మృదువైన ఓరల్ కేర్ ఉత్పత్తులు అనుకూలంగా ఉంటాయి. ఇంద్రియాల సున్నితత్వం ఎక్కువగా ఉన్న పిల్లలకు టూత్‌పేస్ట్‌లోని నురుగు, టెక్స్చర్ లేదా ఘాటైన పుదీనా రుచి కారణంగా బ్రష్ చేయడం ఇష్టం ఉండదు. అలాంటి పిల్లలకు తక్కువ నురుగు వచ్చే, మృదువైన రుచి కలిగిన టూత్‌పేస్ట్‌లను ఉపయోగించడం వల్ల వారు సులభంగా బ్రష్ చేసే అలవాటు పెంచుకుంటారు. చేతుల కదలికలు పరిమితంగా ఉన్నవారికి సాధారణ టూత్‌బ్రష్‌ను సరిగ్గా పట్టుకోవడం కష్టమవుతుంది. వారికి మంచి గ్రిప్ ఉన్న ప్రత్యేక టూత్‌బ్రష్‌లు ఉపయోగించడం నోటి పరిశుభ్రతను సులభతరం చేస్తుంది. ప్రస్తుతం ఆరోగ్య సంరక్షణలో వ్యక్తిగత అవసరాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. అదే విధంగా ఓరల్ కేర్ కూడా ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఉండాలి. అవసరాలకు సరిపడే ఉత్పత్తులు, సరైన పద్ధతులు ఎంచుకున్నప్పుడే నోటి ఆరోగ్యాన్ని సమర్థంగా కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## హెచ్‌సీఎల్ టెక్ లాభంలో 20% వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఏకీకృత నికర లాభం రూ.4,624 కోట్లుగా నమోదైంది. 2025–26 ఇదే త్రైమాసిక లాభం రూ.3,843 కోట్ల కంటే ఇది 20% పైగా అధికం. కార్యకలాపాల ఆదాయం 14% పెరిగి రూ.34,579 కోట్లకు చేరుకుంది. 2026–27 ఆదాయ వృద్ధి అంచనాలను 1–4% వద్ద కంపెనీ కొనసాగించింది. 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల అంతర్జాతీయ కంపెనీల్లో పరివర్తన వేగం పెరుగుతోంది. మా కంపెనీకి ఇది కొత్త వృద్ధి అవకాశాలు కల్పిస్తోంద'ని హెచ్‌సీఎల్ టెక్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా వెల్లడించారు. తొలి త్రైమాసికంలో అత్యధిక కొత్త ఆర్డర్ల (2.4 బి.డాలర్ల)ను కంపెనీ నమోదు చేసిందని సంస్థ సీఈఓ, ఎండీ సి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అధునాతన ఏఐ వ్యాపారం అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే 62.1% పెరిగిందన్నారు.







# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, వడ్డీ రేట్లు పెరుగుతాయన్న భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నడుమ మన మార్కెట్ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. దీంతో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్ల మేర ఆవిరైంది. సెన్సెక్స్ ఉదయం 77,272.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,616.40) నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 600 పాయింట్లకు పైగా నష్టంతో 77,001.48 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 561.46 పాయింట్ల నష్టంతో 77,054.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158.95 పాయింట్ల నష్టంతో 24,052.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, టీసీఎస్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర రూపం దాల్చడం స్టాక్‌మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఇరు దేశాల మధ్య మళ్లీ అగ్గి రాజుకోవడంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు విఘాతం కలుగుతుందన్న భయాలు నెలకొన్నాయి. దీంతో చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఏకంగా 87 డాలర్ల స్థాయికి చేరడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతీసింది.

# మొదలైన ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓ..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పేరిట అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీగా కొనసాగుతోంది. 15.5 శాతం మార్కెట్ వాటా ఉంది. వివిధ పథకాల కింద సుమారు రూ.12 లక్షల కోట్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తోంది. నేటి నుంచి (జులై 14) ఈ పబ్లిక్ ఇష్యూ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఐపీఓకు సంబంధించిన కొన్ని వివరాలు.. పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎస్‌బీఐ ఫండ్స్ మార్కెట్ నుంచి రూ.9,813 కోట్లు సమీకరించనుంది. వాస్తవానికి రూ.11,693 కోట్ల పబ్లిక్ ఇష్యూ అనుకున్నప్పటికీ ఐపీఓ సైజ్ తగ్గింది. ప్రీ ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.1,655 కోట్లు సమీకరించడంతో ఆ మేర పరిమాణం తగ్గింది. జులై 14న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై 16న ముగుస్తుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.545–574గా నిర్ణయించారు. సుమారు రూ.1.17 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. జులై 21న లిస్టింగ్‌కు రానుంది. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తి ఆఫర్ ఫర్ సేల్ (OFS) రూపంలో జరగనుంది. కంపెనీకి ఎలాంటి నిధులూ రావు. ఎస్‌బీఐ, అముండీ ఇండియా హోల్డింగ్ ఐపీఓలో భాగంగా తమ వాటాలు విక్రయిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం, స్మాల్ హెచ్ఎన్ఐలకు 5 శాతం, బిగ్ హెచ్ఎన్ఐలకు 10 శాతం, 50 శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. రిటైల్ ఇన్వెస్టర్లు ఈ ఐపీఓలో పాల్గొనాలంటే కనీసం 26 షేర్లు (లాట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.14,924 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 13 లాట్‌లు కొనుగోలు చేయొచ్చు. ఎస్‌బీఐ ఉద్యోగులకు రూ.170 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను రిజర్వ్ చేశారు. ఒక్కో షేరుపై రూ.54 డిస్కౌంట్ లభిస్తుంది. షేర్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు; మ్యూచువల్ ఫండ్స్ ఫీజులు; కమీషన్ల విషయంలో సెబీ ఎప్పటికప్పుడు తీసుకొచ్చే కఠిన నిబంధనలు; ఇప్పటికే ఉన్న కంపెనీలతో పాటు మరిన్ని డిజిటల్ కంపెనీలు అసెట్ మేనేజ్‌మెంట్‌లోకి ప్రవేశిస్తుండడంతో ఆ మేర లాభాల మార్జిన్ తగ్గే అవకాశం ఉంది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా





సన్‌లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పాన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. ఆయా కంపెనీలు ఇప్పటికే స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. ఎస్‌బీఐ ఫండ్స్ షేర్లు గ్రే మార్కెట్‌లో దాదాపు 18 శాతం ప్రీమియంతో ట్రేడవుతున్నాయి. దీంతో రూ.680 వద్ద షేర్లు లిస్టయ్యే అవకాశం ఉంది. ఇష్యూ ధరతో పోలిస్తే రూ.106 ప్రీమియంతో షేర్లు లిస్టయ్యే అవకాశం ఉందని జీఎంపీ సూచిస్తోంది. అయితే, జీఎంపీ అంచనాలన్నీ అన్నిసార్లూ నిజం కాకపోవచ్చు. కొన్నిసార్లు అంచనాలు తప్పొచ్చు. కాబట్టి, ఐపీఓకు దరఖాస్తు చేసేముందు కంపెనీ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ వ్యాపారం, వ్యాల్యుయేషన్ వంటి అంశాలను పరిశీలించడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# అమెరికా, యూరప్ మార్కెట్లకు వన్‌ప్లస్ గుడ్‌బై!



ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ మరోసారి వార్తల్లో నిలిచింది. అమెరికా, యూరోపియన్ మార్కెట్లకు ఈ కంపెనీ స్వస్తి పలికేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అక్కడ కార్యకలాపాలను నిలిపివేయబోతోందని జర్మనీకి చెందిన విన్‌ఫ్యూచర్ నివేదిక పేర్కొంది. వారం రోజుల్లో దీనిపై కంపెనీ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే వన్‌ప్లస్ ఫోన్లు వాడుతున్న యూరప్, అమెరికా వినియోగదారులకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, సేవల పరంగా ఎలాంటి ఇబ్బందులూ ఉండవని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇచ్చిన కాలపరిమితి వరకు సేవలు కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం స్టాక్ అయిపోయాక ఎలాంటి కొత్త ఫోన్లను లాంచ్ చేయబోదని తెలుస్తోంది. అదే సమయంలో భారత్, చైనా వంటి ఇతర మార్కెట్లలో మాత్రం తన కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తుందని సమాచారం. భారత్‌లో వన్‌ప్లస్ బ్రాండ్‌కు మంచి ఆదరణ ఉంది. దీంతో దేశీయంగా సేవలు కొనసాగేందుకు అవకాశం ఉంది. ఒప్పో సబ్‌బ్రాండ్‌గా తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లను విడుదల చేసే అవకాశం ఉంది. గతంలోనూ పశ్చిమాసియా మార్కెట్ల నుంచి వన్‌ప్లస్ వైదొలుగుతున్నట్లు ప్రచారం జరగ్గా.. కంపెనీ తోసిపుచ్చింది. మరోవైపు, ర్యామ్, చిప్‌ల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వన్‌ప్లస్ తన ప్యాడ్ ధరలను పెంచింది. వన్‌ప్లస్ ప్యాడ్ గో 2, ప్యాడ్ లైట్ ధరలను రూ.1000 నుంచి రూ.2 వేల వరకు సవరించింది.

## 5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు



ఈ ఏడాది జూన్‌లో మనదేశం నుంచి 40.41 బిలియన్ డాలర్ల (రూ.3.84 లక్షల కోట్లు) విలువైన ఎగుమతులు జరిగాయి. గతేడాది జూన్ ఎగుమతులు 34.98 బి.డా. కంటే ఇవి 15.5% అధికం. ఇదే సమయంలో ముడిచమురు అధిక ధరల వల్ల, దిగుమతులు బిల్లు భారం 31% వృద్ధితో 70.84 బి.డాలర్లకు చేరింది. ఫలితంగా వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠమైన 30.43 బిలియన్ డాలర్లు (రూ.2.89 లక్షల కోట్లు)గా నమోదైంది. ముడిచమురు దిగుమతులు 40% అధికమై 19.32 బి.డాలర్లకు పెరిగాయి. జూన్ ప్రథమార్ధంలో 90 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ముడిచమురు ధర, ప్రస్తుతం 80 డాలర్ల దిగువకు చేరింది. గత నెలలో ఎలక్ట్రానిక్స్‌దిగుమతులు 58.77% పెరిగి 13.4 బి.డాలర్లకు, యంత్రాలు 30.9% పెరిగి 5.8 బి.డాలర్లకు, పసిడి 7% వృద్ధితో 2 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్‌లో ఎగుమతులు 15.92% పెరిగి 129.32 బి.డాలర్లకు చేరాయి. ఇదే సమయంలో దిగుమతులు 19.89% అధికమై 216.18 బి.డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్య లోటు 68.75 బి.డాలర్ల నుంచి 86.86 బి.డాలర్లకు చేరింది. పసిడి దిగుమతులు 2025 ఏప్రిల్–జూన్‌లో 7.49 బి.డాలర్లు కాగా, ఈ ఏడాది ఇదే త్రైమాసికంలో 11.01 బి.డాలర్లకు పెరిగాయి.

అమెరికాకు తగ్గిన ఎగుమతులు: జూన్‌లో అమెరికాకు భారత ఎగుమతులు 1.21% తగ్గి 8.17 బి.డాలర్లకు పరిమితమయ్యాయి. దిగుమతులు మాత్రం 33.86% పెరిగి 5.5 బి.డాలర్లుగా నమోదయ్యాయి. 2025 జూన్‌లో అమెరికాకు భారత ఎగుమతులు 8.27 బి.డాలర్లుగా, అక్కడ నుంచి దిగుమతులు 4.11 బి.డాలర్లుగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో దేశీయంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి పెరిగింది. ఆహార వస్తువులు ప్రియం కావడంతో, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మధ్యస్థ లక్ష్యిత స్థాయి 4% కంటే పైకి ద్రవ్యోల్బణం చేరింది. 2024ను ఆధార సంవత్సరంగా తీసుకున్న కొత్త సిరీస్ ఈ ఏడాది జనవరిలో ప్రారంభమ్యాక, రిటెయిల్ ద్రవ్యోల్బణం 4 శాతాన్ని మించడం ఇప్పుడే. ఈ ఏడాది మే నెలలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 3.93 శాతంగా నమోదైంది.

# విమాన టికెట్ల ధరల నియంత్రణ నిబంధనలను రెండు వారాల్లో సమర్పించండి

విమాన టికెట్ ధరల్లో భారీ హెచ్చుతగ్గులు, విమానయాన సంస్థలు విధిస్తున్న అదనపు ఛార్జీలపై సుప్రీంకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. భారత పౌర విమానయాన రంగాన్ని ఆధునికీకరించే లక్ష్యంతో తీసుకొచ్చిన 'భారతీయ వాయుయాన్ అధినియం, 2024' చట్టం కింద రూపొందించిన కొత్త నిబంధనలను రెండు వారాల్లోగా సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. సీల్డ్ కవర్‌లో ఈ నిబంధనలను కోర్టుకు సమర్పించాలని న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ నిబంధనలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి, కోర్టుకుసమర్పించడానికి సంబంధంలేదని స్పష్టం చేసింది. సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం, ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 3కు వాయిదా వేసింది.






## జపాన్ ఓపెన్ బరిలో సాత్విక్ జంట



సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో బరిలోకి దిగుతోంది. రెండేళ్లుగా ఒక్క టైటిలూ గెలవలేకపోయిన సాత్విక్ ద్వయం.. ఈ టోర్నీలో ఎలా ఆడుతుందో చూడాలి. సాత్విక్‌కు భుజం గాయం కావడంతో గత నెలలో జరిగిన ఇండోనేసియా ఓపెన్‌కు దూరమైన భారత జంట.. జపాన్ ఓపెన్‌తో పునరాగమనం చేయబోతోంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో డానియెల్–మాడ్స్ (డెన్మార్క్) జంటతో భారత జోడీ తలపడనుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో వాంగ్ (మలేసియా)తో సింధు తలపడనుంది. హువాంగ్ (చైనీస్ తైపీ)తో ఉన్నతి హుడా ఆడుతుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో కొకి (జపాన్)తో లక్ష్యసేన్ పోటీపడతాడు. విదిత్‌సర్న్ (థాయ్‌లాండ్)తో ఆయుష్ శెట్టి తలపడతాడు. ధ్రువ్ కపిల–తనీషా, రుత్విక–రోహన్ జోడీలు మిక్స్‌డ్ డబుల్స్ బరిలో ఉన్నాయి.

# ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టులో భారత అమ్మాయిల భారీ విజయం

క్రికెట్ మక్కాగా పేరున్న లార్డ్స్‌లో, ఇంగ్లాండ్ లాంటి మేటి జట్టుతో భారత మహిళలకు టెస్టు మ్యాచ్. ఇటీవలే టీ20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శన చేసిన హర్మన్‌ప్రీత్ సేన పెద్దగా అంచనాల్లేకుండా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగింది. మైదానంలోకి దిగాక కసితో కదిలిన అమ్మాయిలు.. ఫేవరెట్‌గా మ్యాచ్‌లో అడుగుపెట్టిన ఆతిథ్య జట్టుకు పెద్ద షాకే ఇచ్చారు. తొలి ఇన్నింగ్స్‌లో క్రాంతి గౌడ్ అయిదు వికెట్ల ప్రదర్శన.. రెండో ఇన్నింగ్స్‌లో యాస్తిక భాటియా అద్భుత శతకం.. రెండు ఇన్నింగ్స్‌ల్లో స్మృతి మంధాన సూపర్ అర్ధశతకాలు.. ఇంకా మిగతా అమ్మాయిల కృషీ తోడై లార్డ్స్‌లో భారత్ ఏకంగా 270 పరుగుల భారీ విజయాన్నందుకుని చరిత్ర సృష్టించింది. లాంఛనం పూర్తయింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో ఏకైక టెస్టులో మూడో రోజే విజయాన్ని ఖాయం చేసుకున్న భారత మహిళల జట్టు.. నాలుగో రోజు ప్రత్యర్థిని చుట్టేసి 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు తీసిన పేసర్ క్రాంతి గౌడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. 457 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 130/6తో ఆఖరి రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. మరో 56 పరుగులు జోడించి 186 పరుగులకే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరుకు కేవలం రెండు పరుగులే జత చేసి ఔటైయింది. ఒక పరుగుతో బ్యాటింగ్ కొనసాగించిన ఎకిల్‌స్టోన్ (50) పోరాడింది. ఇసీ వాంగ్ (33 బంతుల్లో 1), లారెన్ ఫైలర్ (22 బంతుల్లో 4 నాటౌట్)తో కలిసి భారత విజయాన్ని ఆలస్యం చేసింది. వాంగ్, లారెన్ బెల్ (0) వికెట్లను దీప్తి శర్మ పడగొట్టడంతో ఇంగ్లాండ్ 159/9తో ఓటమికి అడుగు దూరంలో నిలిచింది. అర్ధసెంచరీ తర్వాత ఎకిల్‌స్టోన్‌ను స్నేహ్ రాణా (4/42) బౌల్డ్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించింది. స్నేహ్‌తో పాటు సయాలి (2/24), క్రాంతి గౌడ్ (2/54), దీప్తి శర్మ (2/36) విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285, ఇంగ్లాండ్ 170 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌ను భారత్ 341/7 వద్ద డిక్లేర్ చేసింది. లార్డ్స్‌లో మహిళల టెస్టు మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి. లార్డ్స్‌లో సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా యాస్తిక భాటియా రికార్డుల్లో నిలిచింది. భారత క్రికెట్ చరిత్రలో యాస్తిక కంటే ముందు పది మంది మాత్రమే ఈ ఘనత సాధించారు. చివరగా 2021లో కేఎల్ రాహుల్ ఇక్కడ సెంచరీ బాదాడు. దిగ్గజ బ్యాటర్లు సునీల్ గావస్కర్, సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లిలకు కూడా లార్డ్స్‌లో శతకం సాధ్యం కాలేదు.




రత్ తొలి ఇన్నింగ్స్: 285;
ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 170;
భారత్ రెండో ఇన్నింగ్స్: 341/7 డిక్లేర్డ్;
ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: 186 ఆలౌట్ (అమీ జోన్స్ 54, ఎకిల్‌స్టోన్ 50, మాడీ విలియర్స్ 26; స్నేహ్ రాణా 4/42, క్రాంతి గౌడ్ 2/54, సయాలి 2/24, దీప్తి 2/36).

# అదే మా తొలి విజయం



హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ విజయానికి వేలంలోనే పునాది పడిందని జట్టు ప్రధాన కోచ్ అనిరుధ్ తెలిపాడు. వేలంలో వ్యూహాత్మకంగా వ్యవహరించామని, ఆటగాళ్ల ఎంపికపై ముందు నుంచే స్పష్టంగా ఉన్నామని అతడు చెప్పాడు. వేలం ముందు నుంచీ ట్రోఫీ నెగ్గే వరకు ఈ ఛాంపియన్స్‌తో ప్రయాణం గురించి అనిరుధ్ మాటల్లో.. వేలంలో ఎవర్ని దక్కించుకోవాలనే విషయంపై ముందు నుంచే కసరత్తు చేశాం. ఆటగాళ్ల గురించి తెలుసుకున్నాం. ముఖ్యంగా రంజీ అనుభవమున్న అభిరథ్ రెడ్డిని కెప్టెన్‌గా నిర్ణయించుకున్నాం. అజయ్‌దేవ్ గౌడ్ కూడా జట్టులో ఉండాలనుకున్నాం. అందుకే ఐకాన్ ప్లేయర్ విభాగంలో ఎవరి కోసం ప్రయత్నించలేదు. ఈ క్రమంలో సరైన ఆటగాళ్లను గుర్తించడం, వారిని వేలంలో దక్కించుకోవడం పెద్ద సవాలుగా నిలిచింది. ఆఖరికి 80 నుంచి 90 శాతం మేం అనుకున్న ప్లేయర్లనే కొనుగోలు చేశాం. దీంతో అక్కడే మేం తొలి విజయం సాధించామన్న భావన కలిగింది. ఒక్క సీజన్ కోసమే కాకుండా, భవిష్యత్తు దృష్ట్యా ఎక్కువగా కుర్రాళ్లకే ఓటేశాం. టోర్నీకి విజయమే లక్ష్యంగా సన్నద్ధమయ్యాం. వేలం తర్వాత తక్కువ సమయం ఉన్నప్పటికీ.. ఆటగాళ్లంతా రోజుకు రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతూ, ప్రత్యేక కసరత్తుతో ఫిట్‌నెస్ పెంచుకున్నారు. తెలంగాణ క్రికెట్లో ఇదొక నూతన అధ్యాయంగా అభివర్ణించొచ్చు. రాష్ట్ర క్రికెట్‌కు టీజీ20 ఊతమిస్తుంది. యువకులు తమ ప్రతిభను చూపించేందుకు సరైన వేదిక లేక కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారందరికీ ఈ లీగ్ సువర్ణావకాశం. హెచ్‌సీఏ, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్‌దే ఈ ఘనత. వైష్ణవ్‌రెడ్డి ఆడిన 6 మ్యాచ్‌ల్లోనూ నాటౌట్‌గా నిలవడం గొప్ప విషయం. వాస్తవానికి టోర్నీకి ముందు అతడు కొన్నాళ్లు క్రికెట్ ఆడలేదు. టీజీ20 ప్రకటన వచ్చాకే బ్యాటు పట్టుకున్నాడు. వైష్ణవ్‌లాంటి ఆటగాణ్ని కనీస ధరకే దక్కించుకున్నాం. అభిరథ్, అజయ్‌దేవ్, ప్రణవ్, యశ్వీర్ వంటి కుర్రాళ్లను ఐపీఎల్ ఫ్రాంచైజీలు పరిగణనలోకి తీసుకుంటాయని భావిస్తున్నా. హిమతేజ (ఖమ్మం), తన్మయ్ (కరీంనగర్), వేద్‌రెడ్డి (ఖమ్మం) వంటి ఆటగాళ్ల ప్రదర్శన నన్ను చాలా మెప్పించింది. టీజీ20 వేలానికి ముందు నుంచీ ఫ్రాంచైజీ యాజమాన్యం అద్భుతంగా సహకరించింది. మాపై నమ్మకం ఉంచినందుకు రామోజీ గ్రూప్‌నకు ధన్యవాదాలు. ఇలాంటి ఫ్రాంచైజీలో భాగమవడం.. నేను, మా సహాయక బృందం చాలా అదృష్టంగా భావిస్తున్నాం. ఏం కావాలని అడిగినా సానుకూలంగా స్పందించారు. ఈ టోర్నీకి ముందు నేను జాతీయ క్రికెట్ సంఘం (ఎన్‌సీఏ)లో అండర్–16 అబ్బాయిల ఎలీట్ క్యాంప్‌నకు ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్నా. అక్కడినుంచే జట్టు ప్రణాళికల్లో, వ్యూహరచనల్లో భాగమయ్యా. వేలం ముందు రోజు ఉదయమే హైదరాబాద్ వచ్చాను. జిల్లా క్రికెటర్లను గుర్తించేందుకు మా జట్టు సహాయక బృందం చాలా శ్రమించింది. ఈ క్రమంలో గణేశ్ గదుగు, అఖిల్ రాథోడ్ లాంటి మ్యాచ్ విన్నర్‌లను దక్కించుకున్నాం. జిల్లా కోటా భర్తీ చేయడం కాకుండా జట్టు అవసరాలకు అనుగుణంగా, వారి నైపుణ్యాలను బట్టి ఎంపిక చేశాం.


## రెండంకెల సంఖ్యలో ఐపీఎల్‌కు!



తెలంగాణలోని యువ క్రికెటర్లు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు టీజీ20 క్రికెట్ లీగ్ గొప్ప వేదికగా నిలిచిందని హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఫ్రాంఛైజీల యాజమాన్యం మద్దతు వల్లే తొలి సీజనే ఘనవిజయమైందని ఆయన తెలిపారు. ''తెలంగాణలో క్రికెట్ లీగ్ నిర్వహించాలని గతంలోనే ప్రతిపాదనలు వచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఈసారి ఎలాగైనా నిర్వహించాలనే దృఢసంకల్పంతో నేను, ఆగంరావు ముందుకెళ్లాం. తర్వాత టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ కలిసి నడిచింది. మొదట్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కానీ డబ్బు సమీకరణ జరిగాక వెనుదిరిగి చూడలేదు. ఐపీఎల్ స్థాయిలో టోర్నీ నిర్వహించాలనే లక్ష్యంతో సాంకేతిక, మౌలిక సదుపాయాల విషయంలో రాజీపడలేదు. ఇటీవల నేను లండన్ వెళ్లినప్పుడు టీజీ20 గురించి అడగడం చాలా సంతోషాన్నిచ్చింది. ఫ్రాంఛైజీల యాజమాన్యాల మద్దతు కీలకమైంది. సమష్టి కృషితో, సమన్వయంతో ఈ టోర్నీ సజావుగా నిర్వహించగలిగాం. వచ్చే సీజన్ నుంచి ఇంకా పెద్ద ఎత్తున చేస్తాం. జిల్లా స్థాయి ఆటగాళ్లను పెద్ద వేదికల్లో భాగం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఫ్రాంఛైజీ నలుగురు జిల్లా ప్లేయర్లను ఎంపిక చేసుకోవాలనే నిబంధన పెట్టాం. కొందరు తల్లిదండ్రులు మాట్లాడుతూ 'ఈ టోర్నీ మా పిల్లలకు గొప్ప వేదికగా నిలిచింది. ఆట ఆపేసి, ఉద్యోగం చూసుకోవాలనుకునే సమయంలో వారి సత్తా నిరూపించుకునేందుకు మంచి అవకాశం లభించింది' అన్నారు. క్రికెట్ ఆపేసిన వారు కూడా టీజీ20 ప్రకటన వచ్చాక తిరిగి ఆడటం ఈ టోర్నీ కోసం వారు ఎంత ఎదురు చూస్తున్నారో తెలియజేసింది. 16 ఏళ్ల కుర్రాడు వేద్ రెడ్డిని ఇప్పటికే పలు ఐపీఎల్ ఫ్రాంఛైజీలు సంప్రదించాయి. పైస్థాయి క్రికెట్ ఆడేందుకు యువ ఆటగాళ్లకు టీజీ20 అమూల్యమైన వేదికైనందుకు గర్వంగా ఉంది. రాబోయే రోజుల్లో తెలంగాణ నుంచి రెండంకెల సంఖ్యలో ఐపీఎల్‌కు ఎంపికవుతారని ధీమాగా ఉన్నా'' అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

## చెన్నై, ఫ్లెమింగ్ బంధానికి తెర

చెన్నై సూపర్ కింగ్స్ అనగానే ధోనీతో పాటు ఠక్కున గుర్తొచ్చే పేరు స్టీఫెన్ ఫ్లెమింగ్. ఫ్రాంఛైజీతో అతడి బంధం అంతగా పెనవేసుకుపోయింది. అతడి మార్గనిర్దేశనంలో ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందుకుంది సీఎస్కే. అయిదుసార్లు ఛాంపియన్ అయింది. ఇప్పుడు చెన్నైతో ఫ్లెమింగ్ సుదీర్ఘ ప్రయాణానికి తెరపడింది. ఆ ఫ్రాంఛైజీ ప్రధాన కోచ్‌గా అతడు వైదొలిగాడు. సుహృద్భావ వాతావరణంలో సీఎస్కే అతడితో విడిపోయింది. ఫ్లెమింగ్ 18 ఏళ్లు చెన్నై కోచ్‌గా విధులు నిర్వర్తించాడు. 2008లో అరంగేట్ర ఐపీఎల్‌లో చెన్నైకి ఆడిన అతడు.. 2009లో ఆ జట్టు కోచ్‌గా బాధ్యతలు అందుకున్నాడు. ''క్రీడల్లో 18 ఏళ్లంటే జీవిత కాలం. నేను కృతజ్ఞతతో నిష్క్రమిస్తున్నా. నా కోచింగ్ కెరీర్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌తో నా కాలం నాకు లభించిన గొప్ప గౌరవం. మేం సాధించిన దాని పట్ల గర్విస్తున్నా. మేమంతా కలిసి చిరస్మరణీయ విజయాలను ఆస్వాదించాం. క్లిష్ట పరిస్థితులను అధిగమించాం. సీఎస్కే ఎప్పుడూ నా హృదయానికి చేరువగా ఉంటుంది. ముందు ముందు కూడా చెన్నైకి మద్దతుగా ఉంటా'' అని సీఎస్కే విడుదల చేసిన ప్రకటనలో ఫ్లెమింగ్ చెప్పాడు.




# వుదయం సినిమా MOVIE TIME!

## ఆ క్రెడిట్ నాకు దక్కాలి: తాప్సీ



**వుదయం సినిమా**
గత కొన్ని సంవత్సరాలుగా హిందీ సినిమాల్లో తనదైన స్టైల్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు నటి తాప్సీ (Taapsee Pannu). పింక్, థప్పడ్, సాండ్ కి ఆంఖ్, బద్లా, హసీనా దిల్‌రుబ, ముల్క్ లాంటి సినిమాలతో మంచి విజయం సాధించారు. ఇటీవల ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అందరూ భయపడే విషయాలల్లో తాను రిస్క్ తీసుకున్నారని వెల్లడించారు.

## రాకాలో మరో బాలీవుడ్ బ్యూటీ ఫిక్స్




**వుదయం:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతోన్న పాన్ వరల్డ్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ అడ్వెంచర్ రాకా ఈ సినిమాలో మొత్తం ఐదుగురు హీరోయిన్స్ నటిస్తారనే ప్రచారం ఎప్పటి నుంచో సాగుతోంది. కేవలం దీపికా పదుకోన్‌ను మాత్రమే టీం అఫీషియల్‌గా కన్ఫర్మ్ చేసింది. రీసెంట్‌గా మలయాళ బ్యూటీ ఫెమినా జార్జ్ తాను ఈ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు మరో బ్యూటీ కూడా తాను 'రాకా'లో నటిస్తున్నట్లు కన్ఫర్మ్ చేశారు. ఆమెనే పంజాబీ బ్యూటీ నైలా గ్రెవాల్ (Naila Grrewal). దాదాపు 11 ఏళ్ల తర్వాత నైలా 'రాకా'తో సౌత్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. 2015లో వచ్చిన 'తమాషా' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ... బరేలీ కి బర్ఫీ, తప్పడ్, ఇష్క్ విష్క్ రీబౌండ్ వంటి చిత్రాల్లో నటించారు. ఫైనల్‌గా కోర్ట్ రూం డ్రామా సిరీస్ 'మామ్లా లీగల్ హై'లో నటించారు. ఇప్పుడు రాకాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు నైలా.

## నాలుగు భాషల్లో స్ట్రీమింగ్ కానున్న 'మా ఇంటి బంగారం'




**వుదయం:** సమంత హీరోయిన్‌గా, నందిని రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. పైగా ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 100 కోట్ల మైలు రాయిని అధిగమించి చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఇప్పుడు ఈ సినిమా అధికారికంగా ఓటీటీలో విడుదల కానుంది. ఈ చిత్రం జూలై 17న, 2026 (శుక్రవారం నాడు) 'జియో హాట్ స్టార్' (Jio Hotstar)లో ప్రత్యేకంగా డిజిటల్ ప్రీమియర్ కానుంది. థియేటర్లలో అద్భుత విజయం సాధించిన నెల రోజుల లోపే ఈ చిత్రం ఇలా డిజిటల్ వేదికపైకి వస్తుండటం విశేషం.కాగా, ఈ సినిమా రిలీజ్ టైమ్ లో ఏయే భాషల్లో స్ట్రీమింగ్ అవుతుందనే దానిపై స్పష్టత లేదు. అయితే ఇప్పుడు, ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం మరియు కన్నడ ఇలా నాలుగు భాషల్లో విడుదల కానుంది. ఇక ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి, శ్రీముఖి తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ఎన్టీఆర్ పేరుతో కార్యక్రమాలు చేసే అధికారం Raw NTR 'సంస్థకు లేదు



**వుదయం:** RAW NTR పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓ సంస్థ, ఎన్టీఆర్ (Nandamuri Taraka Rama Rao Jr)తో సంబంధం ఉన్నట్టుగా ప్రజల్లో భావన కలిగించే విధంగా వ్యవహరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఎన్టీఆర్ ఆఫీసు పేర్కొంది. ఆ సంస్థకు, ఎన్టీఆర్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 'రా ఎన్టీఆర్' సంస్థ వల్ల రాజకీయ చర్చ 'ఊరూ వాడ' (Ooru Vaada Campaign) పేరుతో వంద కోట్ల రూపాయలతో సేవా యజ్ఞం మొదలు పెడుతున్నామని 'రా ఎన్టీఆర్' సంస్థ పేర్కొంది. దాని వెనుక ఎన్టీఆర్ ఉన్నారని భావన ప్రజల్లో కలిగేలా వ్యవహరించింది. దాంతో రాజకీయ రంగ ప్రవేశం కోసం ఎన్టీఆర్ ఆ సంస్థను తెరపైకి తీసుకు వచ్చారని పలువురు భావించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ ఆఫీసు ఓ ప్రకటన విడుదల చేసింది.

## 'రామాయణ' ఢీ.. నిర్మాత నమిత్ మల్హోత్రా మైండ్ బ్లోయింగ్ కామెంట్స్

**వుదయం:** భారతీయులందరికీ రామాయణం ఒక ఎమోషన్. ప్రతి ఒక్కరూ తమ చిన్నప్పటి నుంచి వింటూ, చదువుకుంటూ పెరిగిన మహా కావ్యం ఇది. అయితే ఈ కథను ప్రపంచ ప్రేక్షకులకు సరికొత్తగా, వాళ్లకు అర్థమయ్యే విజువల్ లాంగ్వేజ్‌లో పరిచయం చేయబోతున్నారు. రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నమిత్ మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అమెరికాకు చెందిన ఓ వ్యక్తి తనతో మాట్లాడుతూ.. "ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన, మొదటి కథను మీరు మా ముందుకు తీసుకొస్తున్నారు. మాకు ఏమాత్రం తెలియని ఈ కథను తెరపై చూడటం, ఒక కొత్త లోకాన్ని డిస్కవర్ చేసిన ఫీలింగ్ ఇస్తుంది" అని అన్నారట.ప్రస్తుతం గ్లోబల్ ఆడియన్స్ ఎప్పుడూ ఒకే రకమైన రొటీన్ సినిమాలు చూడటానికి ఇష్టపడట్లేదు. 'డ్యూన్' సిరీస్ లాంటి డిఫరెంట్ ఎపిక్స్ వస్తున్నప్పుడు జనాలు కొత్తదనం కోసం థియేటర్లకు పరిగెడుతున్నారు. మన సంస్కృతికి సంబంధించిన ఈ గొప్ప కథను, అంతర్జాతీయ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో భారీ స్క్రీన్‌పైకి తీసుకురావడం పెద్ద బాధ్యతగా ఫీల్ అవుతున్నట్లు నమిత్ వివరించారు. జులై 23, 24 తేదీల్లో బిగ్ సర్‌ప్రైజ్ ఈ భారీ చిత్రం లో రావణాసురుడిగా కేజీయఫ్ స్టార్ యష్ నటిస్తుండగా.. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే కనిపించనున్నారు. దీపావళి కానుకగా 2026లో రామాయణ మొదటి భాగం, 2027 లో రెండో భాగం థియేటర్లలోకి రానున్నాయి. ఇక ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రామాయణ ఫస్ట్ లుక్‌ను జులై 23న ప్రఖ్యాత శాన్ డియాగో కామిక్-కాన్ (SDCC) ఈవెంట్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఆ మరుసటి రోజే అంటే జులై 24న మోస్ట్ అవేటెడ్ ట్రైలర్ లాంచ్ చేసి గ్లోబల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నారు. ఇండియన్ సినిమా స్టామినా ఏంటో ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ ప్రాజెక్ట్ ఉండబోతోంది.




## ఏంజెల్ భాగ్యశ్రీ - ట్రెడిషనల్ డ్రెస్ విత్ క్యూట్ లుక్



స్టార్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ట్రెడిషనల్ క్యూట్ లుక్‌లో మెరిశారు. ఏంజెల్ లా ఉన్న లేటెస్ట్ ఫోటో షూట్ ట్రెండ్ అవుతోంది.

## ఇదొక అరుదైన, గొప్ప సినిమా..

**వుదయం:** సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమా లతో పాన్ ఇండియా రేంజ్ లో ఫేమస్ అయి పోయాడీ టాలీవుడ్ ట్యాలెంటెడ్ డైరెక్టర్. ప్రస్తుతం ప్రభాస్ తో కలిసి స్పిరిట్ అనే హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ను తెరకెక్కిస్తున్నాడు సందీప్ రెడ్డి వంగా. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ లో బిజీ బిజీగా ఉంటున్నాడు సందీప్. కాగా ఈ డైరెక్టర్ సినిమాల్లాగే ఆయన మాటలు కూడా స్ట్రెయిట్ ఫార్వర్డ్ గానే ఉంటాయి. ఎలాంటి ఫిల్టర్ ఉండదు. అలాంటి సందీప్ రెడ్డి వంగా తాజాగా ఓ సినిమాను చూసి ప్రశంసలు కురిపించాడు. అంతేకాదు ఒక మూడు గంటలు ఈ సినిమా కోసం కేటాయించి తప్పక చూడాలని విజ్ఞప్తి చేశాడు. మరి సందీప్ రెడ్డి వంగాకు అంత బాగా నచ్చిన సినిమా ఏదనుకుంటున్నారా? టాలీవుడ్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సినిమా రావు బహదూర్. వెంకటేష్ మహా తెరకెక్కించిన ఈ సినిమా జులై 03న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఒక డిఫరెంట్ సైకలాజికల్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమా.


సందీప్ రెడ్డి వంగా

## డ్యాన్సర్స్ మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం..!



**వుదయం:** రెండు వర్గాలుగా చీలిన డ్యాన్సర్స్ అసోసియేషన్.రెమ్యూనరేషన్లలో అక్రమాలంటూ పరస్పర ఆరోపణలు.డ్యాన్సర్స్ అసోసియేషన్ వివాదంలో కీలక మలుపు. నటుడు చిరంజీవి ఎంట్రీతో ఫిల్మ్ ఫెడరేషన్‌కు చేరిన పంచాయితీ.ఇరువర్గాలతో ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధుల చర్చలు.

## ఈ వారం థియేటర్లలోకి 9 సినిమాలు

**వుదయం:** ఈ వారం 9 సినిమాలు థియేటర్లలోకి రానున్నాయి. శుక్రవారం ఒక్క రోజే బాక్సాఫీస్ వద్ద మూవీస్ సందడి నెలకొననుంది. మరి ఆ మూవీస్ ఏంటో ఓసారి చూస్తే...1.మిస్టర్ మిడిల్ క్లాస్ : శ్రీకాంత్, లయ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ మిస్టర్ మిడిల్ క్లాస్ (Mister Middle Class). జి.నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాల2.ఓ సుకుమారి : తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన విలేజ్ లవ్, ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా3.వదలా : జగపతి బాబు, లయ, హృతికా శ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ వదలా. ఆకెళ్ల వి కృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా4.MRP : వెన్నెల కిశోర్, నరేష్ అగస్త్య ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ MRP. శ్రవణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా5.ది ఒడిస్సీ : హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వం వహించిన లేటెస్ట్ మూవీ 'ది ఒడిస్సీ6.ఆపరేషన్ అరుణా రెడ్డి : పోసాని కృష్ణ మురళి, హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన మూవీ 'ఆపరేషన్ అరుణా రెడ్డి7.రాజా ది రాజా : రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన మూవీ 'రాజా ది రాజా' (Raja The Raja). లవ్, మిస్టరీ, పునర్జన్మ కాన్సెప్ట్ ఆధారంగా ఈ మూవీని రూపొందించారు. అనిల్ బోయిడపు దర్శకత్వం 8.వెంకట్రామయ్య గారి తాలూకా... : దినేష్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'వెంకట్రామయ్య గారి తాలూకా...'. సతీష్ ఆవాల దర్శకత్వం9.ఒక కోర్టు కేసు : సూర్యాన్స్, తనీషా మిశ్రా జంటగా నటించిన లేటెస్ట్ మూవీ 'ఒక కోర్టు కేసు'. గణేష్ పూడి దర్శకత్వం వహించగా... దయానంద్, ముక్తార్, సత్యకృష్ణ తదితరులు కీలకపాత్రలు పోషించారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.